thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 247 కరీంనగర్ శుక్రవారం, 14 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## తీర్పుల వివరాలన్నీ వెల్లడించాలి

న్యూఢిల్లీ : న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల హైకోర్టులు తమతమ వెబ్‌సైట్లలో ఒక డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేసి, అందులో తీర్పుల వివరాలను వెల్లడించాలని ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 31 తర్వాత రిజర్వ్ చేసిన తీర్పులు, వెల్లడించిన తీర్పులు, అప్‌లోడ్ చేసిన తేదీలతో సహా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చిల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఝూర?ండ్ హైకోర్టు సహా పలు హైకోర్టులు సివిల్, క్రిమినల్ కేసుల్లో తుది వాదనలు పూర్తయిన తర్వాత కూడా ఏళ్ల తరబడి తీర్పులు ఇవ్వకపోవడాన్ని ధర్మాసనం తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలోనే తీర్పుల వివరాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది.




ఢిల్లీ: హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు ప్రపంచ పెట్టుబడిదారులకు హైదరాబాద్‌ను ఉత్తమ గమ్యస్థానంగా మార్చుతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ ఫోరం సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా USISPF వార్షిక సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆయన ప్రదర్శించారు. గత 23 నెలల కాలంలో కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం హైదరాబాద్‌లో ఉందని తెలిపారు. భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్రస్థానంలో ఉన్న హైదరాబాద్.. ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తోపాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడుల్ని, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి రేవంత్ వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ్య ద్వారమని సీఎం కొనియాడారు.




దేశం అంతా ఇప్పుడు బీహార్ ఎగ్జిట్ పోల్స్ పైనే చర్చలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా సర్వే రిజల్ట్స్ వచ్చాయని కొందరు.. ఎన్డీయే గెలుపు పక్కా అని మరికొందరు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మెయిన్ స్ట్రీమ్ సర్వే సంస్థలు, న్యూస్ ఛానెల్స్ అన్నీ బీజేపీ-జేడీయూ కూటమి ఎన్డీఏ కే అధికారం అని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఎన్డీఏకు కనీసం 140 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. అయితే ఈ ఎగ్జిట్ పోల్స్ లో కాంగ్రెస్-ఆర్జేడీ ఆధ్వర్యంలోని మహాగట్బంధన్ కూటమి మళ్లీ ఈసారి కూడా అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని వెల్లడించాయి. 2020లో గెలుపుకు దగ్గరకు వచ్చినట్లే వచ్చి ఓడిన ఈ కూటమి.. ఈసారి పక్కాగా గెలుస్తామనే ధీమాలో ఉంది.

**అధికారం ఎన్డీఏది.. సీఎం ఎవరంటే..** ఎగ్జిట్ పోల్స్ ప్రకారం.. రాష్ట్ర ప్రజలు అధికారాన్ని మళ్లీ ఎన్డీఏకు కట్టబెట్టేందుకు సుముఖత చూపారు. నితీష్ కుమార్ ఆధ్వర్యంలోని ఎన్డీఏ వైపే మొగ్గు చూపారు. కానీ సీఎం ఎవరంటే తేజస్వీ యాదవ్ వైపు మొగ్గు చూపడం సర్‌ప్రైజింగ్ థింగ్. పీపుల్స్ పల్స్ , ఆక్సిస్ మై ఇండియా సంస్థలు వెల్లడించిన ఫలితాల్లో.. సీఎం క్యాండేట్ గా తేజస్వీకే జనాలు జై కొట్టినట్లు పేర్కొంది. ఆక్సిస్ మై ఇండియా ప్రకారం.. ఎన్డీఏ కు 121 నుంచి 141 సీట్లు వస్తాయని ప్రెడిక్ట్ చేసింది. అదే సమయంలో మహాగట్బంధన్ కు 98 నుంచి 118 సీట్లు వస్తాయని అంచనా వేసింది. కానీ.. సీఎం క్యాండేట్ గా తేజస్వీ యాదవ్ కు 34 శాతం ప్రజలు ఓటేశారు. అదే సమయంలో నితీష్ కుమార్ కేవలం 22 శాతం మాత్రమే సీఎం అభ్యర్థిగా ఓటర్లు భావిస్తున్నారు. మరో సంస్థ పీపుల్స్ పల్స్ సర్వేలో 133-159 సీట్లతో ఎన్డీఏ అధికారం చేపడుతుందని.. కాంగ్రెస్ కూటమి 75-101 సీట్లతో ప్రతిపక్షానికే పరిమితం అవుతుందని వెల్లడించింది. అదే సమయంలో సీఎంగా తేజస్వీ యాదవ్ పర్ఫెక్ట్ అని 32 శాతం ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. నితీశ్ కుమార్ 30 శాతం మంది మాత్రమే విశ్వసిస్తున్నారు. 2025 నవంబర్ 11 న బీహార్ అసెంబ్లీ తుది దశ పోలింగ్ పూర్తైన విషయం తెలిసిందే. మొత్తం 243 సీట్లకు జరిగిన ఓటింగ్ లో ఆ రాష్ట్ర చరిత్రలోనే 1951 తర్వాత అత్యధికంగా 66.91 శాతం పోలింగ్ నమోదైంది.




## జూబ్లీహిల్స్ ఫలితానికి...

# కౌంట్ డౌన్ షురూ!

## పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికార గణం

## అన్ని పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్... టెన్షన్...!!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలకు కౌంట్ డౌన్ మొదలు కావడంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ నెల 14వ తేదీన యూసుఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో కౌంటింగ్ మొదలు కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలింగ్ సరళిని బట్టి ఎవరు గెలుస్తారు? ఎన్ని ఓట్ల మెజార్టీ ? అంటూ గెలుపు, ఓటములను విశ్లేషించుకుంటున్నారు. ఈ నెల 11వ తేదీన పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలకు చేరడంతో ఓటర్లు నిక్షిప్తం చేసిన రిజల్ట్స్‌పై నేతల్లో గుబులు పట్టుకుంది. ఎవరి భవితవ్యం ఎలా ఉండనుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. నేషనల్ ఫ్యామిలీ ఒపీనియన్ ప్రేవేట్ లిమిటెడ్, మిషన్ చాణక్య, క్యూ మెగా సర్వే సంస్థలు మినహా దాదాపు ఎగ్జిట్ పోల్స్ అన్నీ హస్తంకు పట్టం కట్టడంతో కాంగ్రెస్ శ్రేణులంతా ఉత్సాహంలో ఉన్నారు. హస్తం హవా జోరుమీదుండటంతో బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నాయకులలో టెన్షన్ మొదలు కాగా సర్వేలు ఎంతవరకు నిజమనేది చర్చకు దారితీసింది.

**కూడికలు, తీసివేతల్లో అభ్యర్థులు...** జూబ్లీహిల్స్ బై పోల్లో బరిలోకి దిగిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోలింగ్ అనంతరం తమ గెలుపు, ఓటములు ఎంత శాతం అనేది లెక్కించుకుంటున్నారు. దాదాపు అన్ని డివిజన్లలో బూత్ ల వారిగా పోలైన ఓట్ల వివరాలను పరిశీలిస్తున్నారు. పోలైన మొత్తం ఓట్లు ఎన్ని? ప్రత్యర్థులకు ఎన్ని పోలై ఉంటాయి? గెలుపుకు కావాల్సిన మేజిక్ ఫిగర్‌కు ఎన్ని ఓట్లు రావాలి ? తనకు ఎన్ని వస్తున్నాయి ? అనే అంశాలపై కూడికలు, తీసివేతలు లెక్కిస్తున్నారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను సైతం పరిగణలోకి తీసుకుని విశ్లేషిస్తున్నారు. డివిజన్ల స్థాయి నాయకులతో సమావేశమై ఓ అంచనాకు వచ్చేందుకు చూస్తున్నారు. ఇలా పోలింగ్ కు, కౌంటింగ్ కు మధ్య రెండు రోజుల గడువు ఉండడంతో దాదాపు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇదే పనులలో పడ్డారు.

**ఎక్కడ చూసినా ఫలితాలపై చర్చలే...** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? ఓటర్లు ఏ పార్టీకి పట్టం కట్టబోతున్నారు? అనేది గ్రేటర్ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలో ఎక్కడ చూసినా ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. ఏ ఇద్దరు కలిసినా, టీ స్టాళ్లు, హోటళ్లు, బార్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు వీటికి వేధికలుగా మారుతున్నాయి. చివరకు ఫోన్లు మాట్లాడినా పోలైన ఓట్లు ఎన్ని? గెలిచే అవకాశం ఎవరికి ఉంది ? ఎగ్జిట్ పోల్స్ ప్రకటించిన ఫలితాలు నిజమేనా ? అంటూ మాట్లాడుకోవడం కనబడుతోంది. మొత్తం మీద మరొక్క రోజులో గెలుపు, ఓటములు డిసైడ్ కానుండగా నగర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

**144 సెక్షన్ అమలు...** ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటల నుండి ఫలితం ప్రకటించేంత వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఇక్కడ పోలీసులు ఆంక్షలు విధించారు. మద్యం దుకాణాలు మూసి వేసి వేయనున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**ఏర్పాట్లలో అధికారులు....** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఏడు డివిజన్ల లోని 127 పోలింగ్ కేంద్రాలలో 407 పోలింగ్ బూత్ లు ఉన్నాయి. నియోజకవర్గంలో అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,08,561 మంది పురుషులు, 1,92,779 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. మొత్తం 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండగా 48.47 శాతం ఓటింగ్ నమోదైంది. సుమారు 1.94 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా అక్కడక్కడ చోటు చేసుకున్న చెదరు ముదురు సంఘటనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు పటిష్టమైన బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు.

కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటల నుండి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసి వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# భారత్-పాక్ మధ్య యుద్ధ మేఘాలు!?



## సరిహద్దుల్లో ఉద్రిక్తతలు: ప్రయాణ హెచ్చరికలు..

ఢిల్లీలో జరిగిన పేలుడు ఘటనతో దేశంలో ఉత్కంఠ పెరిగిన నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం కూడా తమ పౌరులకు జాగ్రత్తలు చెబుతోంది. ఈ పరిణామాల మధ్య, బ్రిటన్‌కు చెందిన విదేశీ కార్యాలయం తాజాగా తన పౌరుల కోసం ట్రావెల్ అడ్వైజరీని విడుదల చేసింది. ఈ అడ్వైజరీలో ప్రధానంగా భారత-పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాలపై ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

**యూకే నుండి కఠినమైన ట్రావెల్ అడ్వైజరీ....** యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వం తన పౌరులకు కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా భారత్-పాక్ సరిహద్దుకు 10 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణం చేయరాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఇరు దేశాల మధ్య ప్రసిద్ధ వాఘా-అటారి సరిహద్దు క్రాసింగ్‌ను మూసివేశారనే సమాచారాన్ని కూడా ఈ అడ్వైజరీలో పేర్కొంది. యాదృచ్ఛికంగా రాజధానిలో జరిగే ఆకస్మిక ఘటనలు త్వరగా రాజకీయ, సైనిక ప్రతిస్పందనలకు దారితీసే అవకాశం ఉన్నందున, ఈ హెచ్చరికకు ప్రాధాన్యత పెరిగింది.

శ్రీనగర్, పహల్‌గామ్, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్ వంటి కొన్ని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలకు ప్రయాణం చేసే ముందు స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని బ్రిటన్‌కు చెందిన విదేశీ కార్యాలయం కోరింది. జమ్మూకి విమాన మార్గంలో రాకపోకలు మాత్రం పరిమితులతో అనుమతించవచ్చని సూచించింది. ఈ సూచనలను ఉల్లంఘిస్తే, ట్రావెల్ ఇన్సూరెన్స్ షరతులు అమలులో ఉండకపోవచ్చని గట్టిగా హెచ్చరించింది.

**సరిహద్దులోనూ ఉద్రిక్తత...** భారత్-పాక్ సరిహద్దులో ఆందోళన వ్యక్తం అవుతున్న వేళ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు మరింత ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. ఇటీవల జరిగిన దాడులను ఉదాహరిస్తూ అవసరమైతే అఫ్ఘనిస్తాన్‌లోని నిర్దిష్ట లక్ష్యాలపై సైనిక చర్యలు చేయవచ్చునని ఆయన హెచ్చరించారు.

ఆఫ్ఘాన్ గడ్డపై ఉగ్రవాద శిబిరాలు ఉన్నాయని ఆరోపిస్తూ "సమాన కాయిదా" ద్వారా ప్రతికార చర్యలు ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన ఆఫ్ఘాన్-పాక్ సంబంధాలను మరింత ఉద్వేగపూరితంగా మార్చే అవకాశముంది.

**తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలు...** ఈ అస్థిర పరిస్థితుల నేపథ్యంలో పర్యాటకులు, విమాన ప్రయాణికులు, సరిహద్దు ప్రాంతాల్లోని స్థానిక నివాసులు తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారిక సంస్థలు ఇచ్చే సూచనలను ఖచ్చితంగా అనుసరించండి. వీలైనంత వరకు సరిహద్దు ప్రాంతాల దగ్గరకు వెళ్లకపోవడం శ్రేయస్కరం. ప్రయాణ బీమా పత్రాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించండి. స్థానిక వార్తామాధ్యమాల్లోనూ అధికారిక ప్రకటనలపై నిత్య అప్డేట్స్ చెక్ చేసుకోండి.

విమాన ప్రయాణం వంటి సురక్షిత మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు. భారత్ పాక్ మధ్య పరిస్థితి త్వరగా మారే అవకాశం ఉంది. అధికారిక సూచనల్ని అనుసరించడం.. అవసరమైతే ప్రయాణాన్ని వాయిదా వేయడం అత్యంత బాధ్యతాయుతమైన చర్య అవుతుంది.




## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కౌంటింగ్‌పై జిల్లా ఎన్నికల అధికారి కీలక ప్రకటన

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఎవరు గెలవబోతున్నారనేది ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్‌పై జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ కీలక విషయాలు వెల్లడించారు. నవంబర్ 14వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చేస్తామన్నారు. స్పెషల్ పర్మిషన్‌తో ఈ సారి 42 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను అబ్జర్వ్ చేయడానికి స్పెషల్ అధికారిని కూడా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు 186 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కౌంటింగ్‌ను ఎప్పటికప్పుడు RO పరిశీలిస్తారని.. LED స్క్రీన్ ద్వారా, EC యాప్ ద్వారా అప్డేట్ ఇస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని ఆర్ వి కర్ణన్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ.. రేపు కౌంటింగ్ కోసం ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, రేపు కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




## భాగ్యనగరంలో హై అలర్ట్.. బస్టాండ్, రైల్వే స్టేషన్లలో విస్తృత సోదాలు


హైదరాబాద్ : భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హెూటల్స్‌పై పోలీసులు నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా.. అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కాగా... రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

## హైదరాబాద్‌లో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు: సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. దిల్లీలో జరిగిన అమెరికా –భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేని హైదరాబాద్.. పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని తెలిపారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటు ఉందన్నారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీల ప్రభుత్వాలు సారథ్యం వహించినప్పటికీ.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖద్వారంగా నిలిచిందని సీఎం తెలిపారు. జీసీసీలకు గమ్యస్థానమైన హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, 



పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల తరహాలతో హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు.



### మంత్రి కొండా సురేఖపై కేసును విత్ డ్రా చేసుకున్న నాగార్జున

హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పెట్టిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడించారు.




ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్, ఎర్రకోట పేలుడు ఘటనల్లో తీగ లాగే కొద్దీ భారీ ఉగ్ర కుట్ర బయటపడుతోంది. వీరు దేశవ్యాప్తంగా నాలుగు నగరాల్లో దాడులకు పన్నాగం పన్నినట్లు తెలిసింది. ఇందుకోసం 8 మంది సూసైడ్ బాంబర్లను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ కేసుల్లో నిందితులు డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ డైరీల్లో భారీ ఉగ్ర ప్లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.

**టెర్రర్ హబ్‌గా.. 17వ నంబరు భవనం...** దిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్–ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. ఇక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఇందులో ముజమ్మిల్‌కు చెందిన 13వ నంబరు గదిలోనే ఉగ్ర కుట్రలకు పథక రచన చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ గదిలో పోలీసులు సోదాలు జరిపి కొన్ని కెమికల్స్, డిజిటల్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

**డైరీల్లో కీలక ప్లాన్లు..** ఇక, ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. ఆ డైరీల్లో 25 మంది వ్యక్తుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారంతా జమ్మూకశ్మీర్, ఫరీదాబాద్‌కు చెందిన వారని గుర్తించారు. దీంతోపాటు నవంబరు 8 నుంచి 12 వరకు తేదీలను ప్రస్తావించినట్లు సమాచారం. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను కూడా సిద్ధం చేయాలని వారు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఇందులో ఐ20 కారులోనే ఎర్రకోట వద్ద పేలుడు జరగ్గా.. ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది.

**8 మంది బాంబర్లతో..** ఈ ప్లాన్‌ను అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్లు జరపాలని వీరు పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి. ఈ ఉగ్ర కుట్రను అమలుచేసే బాధ్యతను ప్రధానంగా ఉమర్‌కు అప్పగించినట్లు సమాచారం. ఇందుకోసం నిందితులు దాదాపు రూ.20 లక్షల వరకు నిధులు సేకరించి ఆ మొత్తాన్ని ఉమర్‌కు ఇచ్చినట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఈ డబ్బును వినియోగించి 20 క్వింటాళ్లకు పైగా ఎన్‌పీకే ఫెర్టిలైజర్‌ను గురుగ్రామ్, నూహ్ తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. ఈ పదార్థాలను వినియోగించి వారు ఐఈడీ బాంబులను తయారు చేయాలని ప్లాన్ చేసినట్లు అధికారులు భావిస్తున్నారు. అయితే, వీరి కుట్రలను పోలీసులు భగ్నం చేశారని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల జమ్మూకశ్మీర్, హరియాణా సహా పలు రాష్ట్రాల్లో జరిపిన సోదాల్లో ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్‌ను పోలీసులు ఛేదించిన సంగతి తెలిసిందే.




హైదరాబాద్: ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

## సీఎం రేవంత్‌పై దాసోజ్ శ్రవణ్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, నవంబర్ 13: ఎన్ని అక్రమాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై (%జవీ =వఝుఠ్ష్ట్ర =వసుసుఎ%) కీలక వ్యాఖ్యలు చేశారు. బైపోల్స్‌లో ఎంఐఎం కూడా అక్రమాలకు పాల్పడి కాంగ్రెస్‌కు సహకరించిందని ఆరోపించారు. పోలీసులు బోగస్ ఓటింగ్‌కు సహకరించటం ప్రత్యక్షంగా చూశామన్నారు. కాగ్ రిపోర్ట్ సీఎం రేవంత్ రెడ్డి బట్టలు విప్పేసిందన్నారు. అప్పులు భారీగా తెచ్చిన రేవంత్.. ఆర్థిక అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేశారు. అనుభవం లేని ముఖ్యమంత్రి ఉంటే.. ఇంతకంటే ఏం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఆర్ఆర్ టాక్స్‌తో దోపిడీ జరుగుతుందని ఆరోపణలు గుప్పించారు. రెండేళ్ళల్లో రూ.3.48వేల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. పార్టీ ఫిరాయింపుల విచారణ సందర్భంగా సందర్శకులు, మీడియాపై నిషేధం సరికాదని అన్నారు. ఇది అసెంబ్లీ స్పీకర్, ముఖ్యమంత్రి రేవంత్ సొంత వ్యవహారం కాదని చెప్పుకొచ్చారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఉంది వ్యవహారం అంటూ కామెంట్స్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు , మాజీ ఎంపీలు మాజీ ఎమ్మెల్సీలకు ప్రవేశాన్ని నిషేధించడం ఏంటని ప్రశ్నించారు. కేసు వాదిస్తున్న అడ్వకేట్లను సెల్ ఫోన్‌లు తీసుకురావద్దని హుకుం జారీ చేయటం సరికాదన్నారు. స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టులో ఫుల్ బెంచ్ వాదనలు జరిగినప్పుడు కూడా సెల్ ఫోన్లు అనుమతిస్తారని తెలిపారు. తక్షణమే బులెటిన్ ఎత్తి వేయాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఫిరాయింపు విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్ష్యంగా వీక్షించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వాదనల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యలు చేశారు.

## రైతుల సమస్యలపై కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సమస్యలపై కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సోయాబీన్ ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు వచ్చాయి. NAFED, NCCF సంస్థలకు పంటల నాణ్యత సడలింపు ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారని, ఎకరాకు 7.62 క్వింటాళ్ల సగటు దిగుబడి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడంతో 14,519 మంది రైతులకు లాభం చేకూరిందని మంత్రి తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు NAFED, NCCF సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి అనేది రైతులకు నష్టం చేకూరుస్తుందని, ఆ పరిమితిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి సూచించారు. పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధర.. 10 గ్రాములు రూ.1.30 లక్షల పైకి

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కొలొచ్చాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి ధర ఒక్కరోజే దాదాపు రూ.3 వేలకు పైగా పెరిగి రూ.1,31,500కు చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర ధర రూ.1,17,150 పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10వేలకు పైగా పెరిగి రూ.1,71,300కు చేరింది. అంతర్జాతీయంగా మార్కెట్‌లో పసిడి ధర ఔన్సు మళ్లీ 4200 స్థాయిని దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. దీంతో ఆర్థిక కార్యకలాపాలు ఎప్పటిలానే యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఎకనామిక్ డేటా వెలువడనుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు మార్గం సుగమం కానుంది. ఈ కారణంతోనే బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి కొనుగోళ్లు ఎప్పటిలానే కొనసాగుతుండడం కూడా పసిడి డిమాండ్‌కు కారణమని పేర్కొంటున్నారు.



చురకలు



# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌లో లుకలుకలు

## తాజాగా బసవపున్నయ్య బహిష్కరణ

చురకలు ప్రతి నిధి హైదరాబాద్, నవంబర్, 13 : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ లో అనేక అక్రమాలకు అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్న ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య సంఘ ద్రోహి అని, అతనిని ఫెడరేషన్ యూనియన్ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు పలువురు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, వ్యవస్థాపక సభ్యులు ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయకుమార్, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు,కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడి బాపురావు, సీనియర్ జర్నలిస్టులు, వ్యవస్థాపక సభ్యులు ఎం.యాదగిరి, కే. సారంగపాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడినైన మామిడి సోమయ్యతో పాటు మరో నలుగురు సీనియర్ నాయకులు, వ్యవస్థాపక సభ్యులను సంఘం నుంచి బహిష్కరించినట్లు బసవపున్నయ్య ప్రకటించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర కార్యవర్గం జరగకుండానే జరిగినట్లు అబద్ధపు వార్తలు సృష్టించి ప్రకటన చేయటం హాస్యాస్పదమని, బైలా ప్రకారం సంఘం అధ్యక్షుడిని, ఇతర ఆఫీస్ బేరర్లను బహిష్కరించేందుకు కార్యవర్గానికి గానీ, సంఘ ప్రధాన కార్యదర్శికి గానీ ఎటువంటి హక్కు లేదని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ కాలపరిమితి ముగిసిందని,కొత్త కమిటీని ఎన్నుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయకుండా, విస్తృత సమావేశం ఏర్పాటు చేయాలన్న అధ్యక్షుడి విజ్ఞప్తిని పట్టించుకోకుండా తన పదవిని కాపాడుకునేందుకు బసవ పున్నయ్య అడ్డదారులు తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ఇప్పటికే ఆయనకు లీగల్ నోటీస్ కూడా జారీ చేయటంతో పాటు లీగల్ నోటీసు సంబంధించి పబ్లిక్ నోటీస్ కూడా వార్తాపత్రికల్లో ప్రచురించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో బెంబేలెత్తి పోయిన బసపున్నయ్య హడావిడిగా ఈ ప్రకటన జారీ చేశారని అన్నారు. ఇది చెల్లదని, ఒకవేళ సంఘంలో జరుగుతున్న పరిణామాలకు ఆయన సమాధానం చెప్పదలుచుకుంటే లీగల్ నోటీస్ కు సమాధానమిచ్చి లేబర్ కమిషనర్ కు తెలియజేసి, తన వాదనను వినిపించాలని అన్నారు. సంఘం ఎవరిదో... దాంట్లో ఎవరికి ఏమేమి హక్కులున్నాయో...వాటిని సాధించుకోవచ్చుని, అది చేయకుండా మతిభ్రమించి... సంఘం కోసం, జర్నలిస్టుల హక్కుల కోసం కృషి చేస్తున్న నాయకులను, బహిష్కరిస్తున్నామని ప్రకటించడం దుర్మార్గమని అన్నారు. మహాసభ నిర్వహించే గడువు దాటిపోయి సంవత్సరం అవుతున్నా, తర్వాత కూడా మహాసభ నిర్వహించకుండా కాలయాపన చేస్తూ, అతనే సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పునాదులు వేసి, సమావేశాలు నిర్వహించకుండా, బాధ్యత రహితంగా ప్రవర్తిస్తూ, అధ్యక్షునితో ఏ విధమైన సంబంధాలు లేకుండా, మాట్లాడకుండా, శత్రువుగా తయారై... ఈ అక్రమ చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు. సంఘం ఆర్థిక లావాదేవీల విషయంలో పదేళ్లుగా బసవపున్నయ్య అనేక అక్రమాలకు పాల్పడి సభ్యులకు లెక్కలు చెప్పకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడిందే కాకుండా ప్రత్యారోపణలు చేస్తూ మొండిగా, మూర?ంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. అంతేకాకుండా సంఘాన్ని బలోపేతం చేయకుడా, కార్యక్రమాలు నిర్వహించకుండా సంఘాన్ని కుంటుపరిచాడని అన్నారు. సంఘం విచ్చిన్నం కావడానికి బాధ్యుడు బసవపున్నయ్యనే అని, ఆయనపై చర్యలు తీసుకునేందుకు, సంఘం బాధ్యతల నుండి తప్పించేందుకు సభ్యులంతా ఆలోచిస్తున్న తరుణంలో ఈ చర్యలకు పాల్పడి సంఘాన్ని ఆబాసు పాలు చేయడానికి పూనుకున్నాడని అన్నారు. రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని అధ్యక్షుడు చేసిన విజ్ఞప్తిని, లిఖిత పూర్వకంగా పంపిన నోటీసులను ఖాతరు చేయకుండా, ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని అన్నారు. ఇది చాలా పెద్ద తప్పిదమని, ఫెడరేషన్‌లో 18 ఏళ్ళు ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రిక ప్రతినిధిగా బసవపున్నయ్యకు పెద్దపీట వేసామని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధ్యక్షులుగా, తెలంగాణలో ప్రధాన కార్యదర్శి గా, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా అతనికి అవకాశం ఇచ్చామని అన్నారు. 18 ఏళ్ళు సభ్యులను మోసం చేశాడని, సంఘంలో ఏ ఒక్క జర్నలిస్టుకు న్యాయం చేయలేదని అన్నారు. గత రాష్ట్ర మహాసభలో ప్రజాస్వామ్య బద్ధంగా ఫెడరేషన్ కు ఎన్నికలు జరగాలని కోరినా వినకుండా దుర్మార్గంగా వ్యవహరించాడని అన్నారు.18 ఏళ్ళ పదవీ కాలంలో "తొండ ముదిరి ఊసరవెల్లి" అయినట్లు అధికార దాహం పట్టుకుని, ఫెడరేషన్ ను నిర్మాణం చేసిన వారి మీద గర్జించడం ప్రారంభించాడని అన్నారు. చివరికి రాష్ట్ర కమిటీని తనే రాసుకునే స్థాయికి ఎదిగాడని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన రాష్ట్ర మహాసభలను గడిచిన పదకొండేళ్ళలో కేవలం ఒక సారి మాత్రమే మహాసభను నిర్వహించాడని చెప్పారు.

**అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న పున్నయ్య...** టీడబ్ల్యూజేఎఫ్‌కు సేవకుడుగా కాకుండా, పెత్తనం చేసే వ్యక్తిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఆయన వ్యవహారం, పనితీరుపై పలుమార్లు ఆయన పనిచేస్తున్న సంస్థ అధిపతులకు, పెద్దలకు కూడా వివరిస్తూ లిఖితపూర్వకంగా తెలియజేసినప్పటికీ ఏ విధమైన మార్పు రాలేదని అన్నారు. ఈ గందరగోళ పరిస్థితుల పట్ల సంఘం సభ్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, దీనిపై ఇప్పటికే చర్చించేందుకు విస్తృతస్థాయి సమావేశం ఈనెల 15వ తేదీన హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అన్ని విషయాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకుపోయేందుకు మహాసభలు జరగని జిల్లాల్లో మహాసభలు జరపడం జరుగుతుందన్నారు. అదే విధంగా సంఘాన్ని విచ్చిన్నం చేస్తూ, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర వ్యవస్థాపక సభ్యులు యాదగిరి, సీనియర్ జర్నలిస్టు సారంగపాణి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి బాపురావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి వివక్షత పై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

## నవంబర్ 14...ఆర్. విద్యాసాగర్‌రావు జయంతి



వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టుల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ,ప్రాజెక్టులపై జరిగిన అన్యాయంపై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయంపై ఎలుగెత్తి చాటారు. నీటిపారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపులపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్నుదన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది.. "జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహానుభావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939 %–% 2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలి సారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవ రావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధి లో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరింగులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజినీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజనీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్సరాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహిం చడంతో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగాహన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబరులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించబడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారతదేశం) ఆయనను "లీడింగ్ ఇంజనీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీత ను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాలన్నింటినీ కలిపి.. 'నీళ్లు–నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యుడిగా, సెంట్రల్ వాటర్ కమిషన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీశం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంత కాలం అనారోగ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగతులైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**



# సీఎం చంద్రబాబుతో తైవాన్ బృందం భేటీ

విశాఖపట్నం: తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖకు వచ్చిన తైవాన్ బృందం సీఎంతో భేటీ అయింది.

తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని బృందం చంద్రబాబును కలిసింది. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని తైవాన్ బృందానికి సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు.

ఇండో–తైవాన్ ఇండస్ట్రియల్ పార్కును కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు సిద్ధమని సీఎంకు వెల్లడించింది.




# స్త్రీ శక్తి పథకానికి నిధులు మంజూరు చేసిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. వైసీపీ విధ్వంస పాలనలో కుంటుపడిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తోంది. ఎన్నికల హామీ మేరకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేతృత్వంలోని కూటమి సర్కార్ కృషి చేస్తోంది. రాష్ట్రానికి వరసగా పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా సూపర్స్ సిక్స్‌లోని ప్రతి హామీని అమలు చేసి ఔరా అనిపించింది. సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని గత ఆగస్టు నెల నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకూ ఈ పథకానికైన ఖర్చును ఏపీఎస్ ఆర్టీసీకి చెల్లిస్తూ కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. మహిళల జీరో ఫేర్ టికెట్ల ఖర్చుకు సంబంధించిన రూ.400 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది చంద్రబాబు సర్కార్. రెండున్నర నెలల్లో మహిళలకు టికెట్లు జారీ చేసిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్త్రీశక్తి పథకం కోసం ఆర్టీసీకి నిధులు విడుదల చేయడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ, అలాగే ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫెడరేషన్ ద్రోహి బసవపున్నయ్య...

## -సంఘం నుంచి శాశ్వత బహిష్కరణ -15న రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం



చురకలు ప్రతినిధిహైదరాబాద్, నవంబర్ 13:తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ లో అనేక అక్రమాలకు అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్న ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య సంఘ ద్రోహి అని, అతనిని ఫెడరేషన్ యూనియన్ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తున్నట్లు పలువురు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, వ్యవస్థాపక సభ్యులు ప్రకటించారు. గురువారం హైదరాబాద్ లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయకుమార్, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు,కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడి బాపురావు,సీనియర్ జర్నలిస్టులు, వ్యవస్థాపక సభ్యులు ఎం.యాదగిరి, కే. సారంగపాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అశోక్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడినైన మామిడి సోమయ్యతో పాటు మరో నలుగురు సీనియర్ నాయకులు, వ్యవస్థాపక సభ్యులను సంఘం నుంచి బహిష్కరించినట్లు బసవపున్నయ్య ప్రకటించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర కార్యవర్గం జరగకుండానే జరిగినట్లు అబద్ధపు వార్తలు సృష్టించి ప్రకటన చేయటం హాస్యాస్పదమని, బైలా ప్రకారం సంఘం అధ్యక్షుడిని, ఇతర ఆఫీస్ బేరర్లను బహిష్కరించేందుకు కార్యవర్గానికి గానీ, సంఘ ప్రధాన కార్యదర్శికి గానీ ఎటువంటి హక్కు లేదని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ కాలపరిమితి ముగిసిందని,కొత్త కమిటీని ఎన్నుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయకుండా, విస్తృత సమావేశం ఏర్పాటు చేయాలన్న అధ్యక్షుడి విజ్ఞప్తిని పట్టించుకోకుండా తన పదవిని కాపాడుకునేందుకు బసవ పున్నయ్య అడ్డదారులు తొక్కుతున్నారని ధ్వజమెత్తారు.దీనిపై ఇప్పటికే ఆయనకు లీగల్ నోటీస్ కూడా జారీ చేయటంతో పాటు లీగల్ నోటీసు సంబంధించి పబ్లిక్ నోటీస్ కూడా వార్తాపత్రికల్లో ప్రచురించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో బెంబేలెత్తి పోయిన బసపున్నయ్య హడావిడిగా ఈ ప్రకటన జారీ చేశారని అన్నారు. ఇది చెల్లదని, ఒకవేళ సంఘంలో జరుగుతున్న పరిణామాలకు ఆయన సమాధానం చెప్పదలుచుకుంటే లీగల్ నోటీస్ కు సమాధానమిచ్చి లేబర్ కమిషనర్ కు తెలియజేసి, తన వాదనను వినిపించాలని అన్నారు. సంఘం ఎవరిదో... దాంట్లో ఎవరికి ఏమేమి హక్కులున్నాయో...వాటిని సాధించుకోవచ్చుని, అది చేయకుండా మతిభ్రమించి... సంఘం కోసం, జర్నలిస్టుల హక్కుల కోసం కృషి చేస్తున్న నాయకులను,బహిష్కరిస్తున్నామని ప్రకటించడం దుర్మార్గమని అన్నారు. మహాసభ నిర్వహించే గడువు దాటిపోయి సంవత్సరం అవుతున్నా, తర్వాత కూడా మహాసభ నిర్వహించకుండా కాలయాపన చేస్తూ, అతనే సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడని ఆరోపించారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పునాదులు వేసి, సమావేశాలు నిర్వహించకుండా, బాధ్యత రహితంగా ప్రవర్తిస్తూ, అధ్యక్షునితో ఏ విధమైన సంబంధాలు లేకుండా, మాట్లాడకుండా, శత్రువుగా తయారై... ఈ అక్రమ చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు. సంఘం ఆర్థిక లావాదేవీల విషయంలో పదేళ్లుగా బసవపున్నయ్య అనేక అక్రమాలకు పాల్పడి సభ్యులకు లెక్కలు చెప్పకుండా నిధుల దుర్వినియోగానికి పాల్పడిందే కాకుండా ప్రత్యారోపణలు చేస్తూ మొండిగా, మూర?ంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. అంతేకాకుండా సంఘాన్ని బలోపేతం చేయకుడా, కార్యక్రమాలు నిర్వహించకుండా సంఘాన్ని కుంటుపరిచాడని అన్నారు. సంఘం విచ్చిన్నం కావడానికి బాధ్యుడు బసవపున్నయ్యనే అని, ఆయనపై చర్యలు తీసుకునేందుకు, సంఘం బాధ్యతల నుండి తప్పించేందుకు సభ్యులంతా ఆలోచిస్తున్న తరుణంలో ఈ చర్యలకు పాల్పడి సంఘాన్ని ఆబాసు పాలు చేయడానికి పూనుకున్నాడని అన్నారు. రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించాలని అధ్యక్షుడు చేసిన విజ్ఞప్తిని, లిఖిత పూర్వకంగా పంపిన నోటీసులను ఖాతరు చేయకుండా, ఎటువంటి సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని అన్నారు. ఇది చాలా పెద్ద తప్పిదమని, ఫెడరేషన్ లో 18 ఏళ్ళు ప్రజాశక్తి, నవతెలంగాణ పత్రిక ప్రతినిధిగా బసవపున్నయ్యకు పెద్ద పీట వేసామని గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధ్యక్షులుగా, తెలంగాణలో ప్రధాన కార్యదర్శి గా, రాష్ట్ర అక్రిడిటేషన్ కమిటీ సభ్యులుగా అతనికి అవకాశం ఇచ్చామని అన్నారు. 18 ఏళ్ళు సభ్యులను మోసం చేశాడని, సంఘంలో ఏ ఒక్క జర్నలిస్టుకు న్యాయం చేయలేదని అన్నారు. గత రాష్ట్ర మహాసభలో ప్రజాస్వామ్య బద్ధంగా ఫెడరేషన్ కు ఎన్నికలు జరగాలని కోరినా వినకుండా దుర్మార్గంగా వ్యవహరించాడని అన్నారు.18 ఏళ్ళ పదవీ కాలంలో "తొండ ముదిరి ఊసరవెల్లి" అయినట్లు అధికార దాహం పట్టుకుని, ఫెడరేషన్ ను నిర్మాణం చేసిన వారి మీద గర్జించడం ప్రారంభించడని అన్నారు. చివరికి రాష్ట్ర కమిటీని తనే రాసుకునే స్థాయికి ఎదిగాడని మండిపడ్డారు. రెండు సంవత్సరాలకు ఒకసారి జరగాల్సిన రాష్ట్ర మహాసభలను గడిచిన పదకొండేళ్ళలో కేవలం ఒక సారి మాత్రమే మహాసభను నిర్వహించాడని చెప్పారు.

**అప్రాజస్వామికంగా వ్యవహరిస్తున్న పున్నయ్య...** టిడబ్ల్యూజేఎఫ్ కు సేవకుడుగా కాకుండా, పెత్తనం చేసే వ్యక్తిగా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. ఆయన వ్యవహారం, పనితీరుపై పలుమార్లు ఆయన పనిచేస్తున్న సంస్థ అధిపతులకు, పెద్దలకు కూడా వివరిస్తూలిఖిత పూర్వకంగా తెలియజేసినప్పటికీ ఏ విధమైన మార్పు రాలేదని అన్నారు. ఈ గందరగోళ పరిస్థితుల పట్ల సంఘం సభ్యులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, దీనిపై ఇప్పటికే చర్చించేందుకు విస్తృతస్థాయి సమావేశం ఈనెల 15వ తేదీన హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అన్ని విషయాలపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. సంఘం కార్యకలాపాలను ముందుకు తీసుకుపోయేందుకు మహాసభలు జరగని జిల్లాల్లో మహాసభలు జరపడం జరుగుతుందన్నా రు. అదే విధంగా సంఘాన్ని విచ్చినం చేస్తూ, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, ఓల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర వ్యవస్థాపక సభ్యులు యాదగిరి, సీనియర్ జర్నలిస్టు సారంగపాణి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి బాపురావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చురకలు సంపాదకీయం

## ఎన్డీయే గెలిచినా నితీష్ కి ఛాన్స్ ఎంతవరకు?

బీహార్ సీఎం గా గత రెండు దశాబ్దాలుగా నితీష్ కుమార్ పాలిస్తున్నారు. మధ్యలో కొన్ని నెలలు తప్ప 2005 నుంచి ఆయనే బీహార్ సీఎం గా ఉన్నారు. 2020లో ఎన్డీయే కూటమితో జత కట్టి నితీష్ సీఎం అయ్యారు. ఈసారి కూడా ఆయన ఎన్డీయేతో కలిసే ఎన్నికలకు వెళ్ళారు. అయితే ఈసారి ఎన్నికలు మొదలైన దగ్గర నుంచి నితీష్ మళ్ళీ సీఎం కారు అని విపక్షం ప్రచారం చేస్తూ వచ్చింది. అంతే కాదు రాజకీయ విశ్లేషణలు అలాగే వెలువడ్డాయి. ఇక చూస్తే రెండవ విడత పోలింగ్ ముగిసింది. ఈ నెల 14న ఫలితాలు రానున్నాయి.

**వార్ వన్ సైడేనా :** ఇలా పోలింగ్ ముగిసిందో లేదో ఎగ్జిట్ పోల్స్ సర్వేలు ఒక్కోటిగా బయటకు వచ్చాయి. బీహార్ లో ఎవరు అధికారం చేపడతారు అన్నది చూస్తే కనుక ఎన్డీయేకే అవకాశాలు అన్నీ దాదాపుగా అనేక సర్వే ఏజెన్సీలు గట్టిగానే చెప్పేశాయి. ఒక విధంగా చెప్పాలీ అంటే వార్ వన్ సైడ్ గా సాగింది అని అంటున్నారు. మహా ఘట్ బంధన్ ఈసారి తప్పకుండా పవర్ లోకి వస్తుందని భావించినా ఏ ఒక్క సర్వే కూడా అధికారంలోకి దరిదాపుల్లోకి వస్తుందని తేల్చి చెప్పలేదు. దాంతో ఎన్డీయే గెలుపు ఖాయమని ప్రచారం ఊపందుకుంది.

**కొత్త చర్చ :** ఇక బీహార్ లో ఎవరు సీఎం అవుతారు అన్నది కొత్త చర్చగా ముందుకు వస్తోంది. ఎన్డీయే గెలిస్తే నితీష్ కుమార్ సీఎం అని అంతా అనుకుంటున్నారు. కానీ బిగ్ ట్విస్ట్ ఏమైనా ఉంటుందా అన్నదే ఇపుడు హాట్ డిబేట్ కి కారణం. బీజేపీ అయితే బీహార్ సీఎం పదవి మీద కన్నేసింది అని చాలా కాలంగా చెబుతున్నారు. ఆ పార్టీకి చెందిన ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కీలకంగా ఉన్నారు. ఆయన బీహార్ ఎన్డీయే లో అత్యంత ముఖ్య పాత్ర సైతం పోషిస్తున్నారు. పేరు చెప్పకపోయినా ఆయననే బీజేపీ ప్రొజెక్ట్ చేస్తూ వస్తోంది. ఎన్డీయే ఎన్నికల మ్యానిఫెస్టో సైతం నితీష్ కుమార్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. దాంతో ఆయనకు అవకాశాలు ఉన్నాయా అన్నదే కొత్త చర్చ.

**జేడీయూ బెటర్ పొజిషన్ :** అయితే ఎగ్జిట్ పోల్ సర్వేలు చూస్తే కనుక గతం కంటే ఎన్డీయేకు ఎక్కువ సీట్లు వస్తాయని తేల్చాయి. అందులో బీజేపీతో పాటు జేడీయూ సైతం మంచి పర్ఫార్మెన్స్ చేసిందని కనిపిస్తోంది. ఆ విధంగా విశ్లేషణలు కూడా ఉన్నాయి. అయితే ఈ సర్వేలలో పేర్కొన్న మేరకు ఎన్డీయేకు 160 సీట్ల దాకా వస్తే మాత్రం నితీష్ కుమార్ సీఎం కాకపోవచ్చు అని అంటున్నారు. అపుడు బీజేపీకి చెందిన వారే సీఎం గా ఉంటారు అని అంటున్నారు. జేడీయూలో కొంత అసంతృప్తి ఉన్నా దానిని దాటుకుని ముందుకు వెళ్ళే సంఖ్యా బలం ఎన్డీయేకు ఈ లార్జ్ నంబర్ తో ఉంటుందని అంటున్నారు. అలా కాకుండా నంబర్ ఏ 130 దగ్గరలో ఆగిపోతే మాత్రం నితీష్ కుమార్ కి చాన్స్ రావచ్చు అన్నది మరో చర్చ. మొత్తానికి చూడాల్సి ఉంది. ఎన్డీఏ గెలిస్తే కనుక నితీష్ కుమార్ సీఎం అవుతారా లేక కొత్త సీఎం వస్తారా అన్నది.

## నిశ్శబ్దహంతకి పట్ల అప్రమత్తంగా అనివార్యం- నవంబర్ 14... మధు మేహ దినం

చక్కెర వ్యాధి... ఈ వ్యాధికి పేరులోనే చక్కెర... దాని ఫలితమంతా ఎంతో చేదు. ఆ వ్యాధి వస్తే చక్కెరకు ఇక దాదాపుగా దూరమైపోయినట్లే. షుగర్ వ్యాధిని ఆధునిక యుగపు మహమ్మారిగా భావించవచ్చు. అత్యంత వేగంగా పరుగెడుతున్న కాలంతో పాటే అనివార్యంగా జీవనశైలిలో చోటుచేసుకుంటున్న మార్పులే షుగర్ వ్యాధికి అసలు కారణం. మౌలికంగా ఇది జీవన శైలి సమస్య. వేదకాలంలో మధుమేహ ప్రస్తావన ఉంది. ఆ కాలంలో మధుమేహాన్ని 'అశ్రవ' అనే పేరుతో గుర్తించారు. ఈ వ్యాధి ఎలా వస్తుంది వ్యాధి లక్షణాలు ఏమిటి అని చరక సంహిత, శుశ్రవ సంహిత, నాగభట్ట గ్రంథాలలో వివరించారు. క్రీస్తు శకానికి వెయ్యి సంవత్సరాల కిందటనే ఈ వ్యాధి వర్ణన ఉండడం విశేషం. యజ్ఞ సమయాలలో దేవతలకు సమర్పించే హవిస్సును భుజించడం వలన ఈవ్యాధి వచ్చినట్లు పేర్కొన్నారు. దక్ష ప్రజాపతి చేసిన యజ్ఞంలో హవిస్సు భుజించడం వలన ఈ వ్యాధి వచ్చినట్లు ప్రస్తావన ఉంది. క్రీస్తు శకం ఆరవ శతాబ్దంలో అష్టాంగ హృదయ అనే గ్రంథంలో మధుమేహం అనే పదం వాడబడింది. తేనెను మధువు అని అంటారు కనుక ఈ వ్యాధిగ్రస్థుల మూత్రం తేనెరంగు ఉంటుందని దీనికి ఈ పేరు వచ్చిందని భావన. 1400 సంవత్సరాల క్రితమే ఈ వ్యాధిని పత్యం, ఔషధం, వ్యాయామంతో క్రమపరచవచ్చని పేర్కొన్నారు. దాదాపు ఇప్పటికీ అనుసరిస్తున్న విధానం అదే కావడం గమనార్హం. అంతర్జాతీయ మధు మేహ సమాఖ్య, ప్రపంచ ఆరోగ్య సంస్థలు 1991 నుండి ప్రతి సంవత్సరం నవంబరు 14వ తేదిని మధుమేహ దినంగా పాటిస్తున్నాయి. 1922లో ఇన్సులిన్ హార్మోన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బేంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న మధుమేహ దినంగా పాటిస్తున్నారు. 2006 డిసెంబర్ 20న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లి ఆమోదించిన తీర్మానం ప్రకారం మధుమేహ వ్యాధి ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న, ఆందోళనకర దీర్ఘకాలిక వ్యాధి కాబట్టి 2007నుండి మధుమేహ దినాన్ని ప్రజల్లో అవగాహం , చైతన్యం పెంచే కార్యక్రమాలతో సభ్యదేశాలన్ని అధికారికంగా జరపాలని ఐక్యరాజ్యసమితి పేర్కొన్నది. డయాబెటిస్ ఎలా వస్తుంది , దానివలం వచ్చే ముప్పు ఏమిటి , రాకుండా ఏమి చేయాలి , వచ్చాక ఎలాంటి జాగ్రత్తలు తీలుకోవాలి అనే అంశాలను ప్రచారము చేసే ప్రయత్నమే ఈ దయాబెటిక్ డే ముఖ్య ఉద్దేశము. ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ మారిపోయింది. మధుమేహ సమస్య భారత్‌లో అత్యధికంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచంలో 15 కోట్ల మంది, దేశంలో 4 కోట్ల




మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. 2025 నాటికి భారత దేశంలో ఈ వ్యాధిపీడితుల సంఖ్య 7 కోట్లకు చేరుకోగలదని భావిస్తున్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఈ వ్యాధి మరింత అధికంగా ఉంది. మధుమేహం కారణంగా ప్రతీ నిమిషానికి ఆరుగురు మరణిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతీ 20 మరణాల్లో ఒకటి మధుమేహం కారణంగానే చోటు చేసుకుంటున్నది. మధుమేహం, సంబంధిత వ్యాధుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా 32 లక్షల మంది మరణిస్తున్నారు. మధుమేహం ను నిశ్శబ్దహంతకిగా అభివర్ణిస్తారు. దీన్ని నివారించడం అంత తేలిక కానప్పటికీ, కొన్ని రకాల విధివిధానాలు పాటించడం ద్వారా దీన్ని సమర్థంగా ఎదుర్కోవచ్చు. మధుమేహం లేదా చక్కెర వ్యాధిని వైద్యభాషలో "డయాబెటిస్ మెల్లిటస్" అని వ్యవహరిస్తారు. డయాబెటిస్ అని కూడా వ్యవహరించే ఈ వ్యాధి, ఇన్సులిన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల కలిగే అనియంత్రిత మెటబాలిజం, రక్తంలో అధిక గ్లూకోజ్ స్థాయి వంటి లక్షణాలతో కూడిన ఒక రుగ్మత. అతిమూత్రం (పాలీయూరియా), దాహం ఎక్కువగా వేయడం (పాలీడిప్సియా), అతిగా ఆకలి వేయడము (పాలీ ఫేజియా), మంద గించిన చూపు, కారణం లేకుండా బరువు తగ్గడం, బద్ధకం దీని ముఖ్య లక్షణాలు. మధు మేహం లేదా చక్కెర వ్యాధిని సాధారణంగా రక్తంలో మితి మీరిన చక్కెర స్థాయిని బట్టి గుర్తిస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో అత్యధికంగా ఈ వ్యాధి ప్రబలి ఉన్నది. ఈ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు లేవు. జీవితాంతం తగిన జాగ్రత్తలు తీసుకొన్నట్లయితే దీన్ని అదుపులో ఉంచుకోవడం సాధ్యం. 1921లో ఇన్సున్ అందుబాటులోకి రావడంతో అన్ని రకాలను నియంత్రించడం సాధ్యమయ్యింది. ఆహార అలవాట్ల మార్పు కూడా భాగమయినప్పటికీ, ఇన్సులిన్ ఉత్పత్తి లేని మొదటి రకాన్ని నియంత్రించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్ ఇవ్వటం తప్పనిసరి మార్గం. రెండవ రకం ఆహార అలవాట్ల మార్పు, ఆంటీ డయాబెటిక్ మందుల వాడకం వల్ల, అప్పుడప్పుడు ఇన్సులిన్ వాడకం వల్ల నియంత్రించవచ్చు. చక్కెర శాతం 400 మి.గ్రా. కన్నా ఎక్కువ కావడం...దీనినే డయాబెటిక్ కీటో అసిడోసిస్ అని కూడా అంటారు. ఈ స్థితిలో ఎక్కువగా దాహం, నాలుక తడారి పోవడం, మత్తుగా ఉండడం, వాంతులు, పొత్తి కడుపునొప్పి, తలనొప్పి, తలతిరగడం, విపరీతమైన నీరసం, ఒళ్ళు నొప్పులు లక్షణాలుగా ఉంటాయి. ఈ సమయంలో వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈ దశలో కూడా తాత్సారం చేస్తే మరణానికి దారి తీయవచ్చు. రక్తంలో చక్కెర శాతం 60 మి.గ్రా కన్నా తగ్గడం..షుగర్ లేదా హైపోగ్లైసిమియా అంటారు. మధుమేహ వ్యాధిని రక్త, మూత్ర పరీక్ష ద్వారా నిర్ధారించవచ్చు. సాధారణంగా రక్తంలో చక్కెర శాతం 80 నుంచి 140 మి.గ్రా వరకు ఉంటుంది. ఇంత కన్నా ఎక్కువ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. ఖాళీ కడుపుతో ఉన్న ప్పుడు చక్కెర శాతం 60 నుంచి 90 ఎంజీ / డీఎల్, తిన్న తరువాత 110 నుంచి 140 ఎంజీ / డీఎల్ ఉండాలి. ఇంతకన్నా ఎక్కు వ ఉంటే చక్కెర వ్యాధి ఉన్నట్లే. చక్కెర వ్యాధికి ఆయుర్వేద మందులు కూడా ఉన్నాయి. భారతీయ ఆహారంలో తీపి, ఉప్పు, పులుపు, వగరు, చేదు, కారం లాంటి ఆరు రుచుల గురించి ప్రధానంగా పేర్కొన్నారు. ఆహారంలో తప్పని సరిగా ఆరు రుచులు ఉండాలన్నారు. చక్కెర వ్యాధిగ్రస్తులు కారం, వగరు, చేదు, రసాలు కలిగిన కూరగాయలు బాగా తీసుకోవలసి ఉంటుంది. శక్తిని ఇచ్చే అన్నం ఎక్కువగా తీసు కోకుండా, పొట్టు కలిగిన జొన్నరొట్టె, గోధుమ పుల్కాలు, సజ్జ రొట్టె తీసుకుంటే రక్తంలో చక్కెర శాతం పెరగకుండా ఉంటుంది. అలజడి, కోపం తగ్గించుకొని మానసిక ప్రశాంతత కలిగి ఉండాలి. యోగా, ధ్యానం, నడక లాంటివి చక్కెర వ్యాధి రాకుండా నిరోధిస్తాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**


## బాల లందరికీ విద్య ఉత్త మాటేనా? చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా! - నవంబర్ 14... జాతీయ బాలల దినోత్సవం

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా- దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభు త్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్య త్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హొటళ్ళు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించు కునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధిం చింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1




నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాద నపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**


## "నవభారత నిర్మాత పండిత నెహ్రూ" - నవంబర్ 14... చాచాజీ జయంతి



హిందూ స్త్రీల దాస్య విముక్తికి, సమానత్వ సాధనకు కృషిచేసి సంఘ సంస్కరణ కర్తగా, స్వతంత్ర భారతావని సాంప్రదాయాలు, విధానాల రూపశిల్పిగా, నవభారత నిర్మాతగా, పేరెన్నిక గన్నారు చాచా నెహ్రూ. వివాహం కనీస వయస్సును, 12 నుండి 15 కి పెంచడం, సతులు... పతుల నుండి విడాకులు తీసుకుని ఆస్తి వారసత్వ హక్కు పొందడం, వరకట్న పద్ధతిని చట్టవిరుద్ధం చేయడం, దేశ తొలి ప్రభుత్వాధినేతగా, సమాజ సంస్కరణలలో సఫలీకృతులయ్యారు, జవహర్ లాల్. న్యాయవాదిగా పరిపూర్ణ రాజకీయవేత్తగా, రచయితగా, దేశ స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధానిగా, భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నెహ్రూ - గాంధీ కుటుంబ అ మూలపురుషుడిగా సుపరిచితుడు అయిన నెహ్రూ, నేటి ఉత్తర ప్రదేశ్ లోని అలహాబాద్ నగరంలో కాశ్మీరీ బ్రాహ్మణ వంశంలో, ధనిక కుటుంబంలో, ప్రముఖ న్యాయవాది మోతిలాల్ నెహ్రూ, స్వరూప రాణిల తొలి సంతానంగా నవంబర్ 14, 1989లో జన్మించారు. సోదరీమణులైన కృష్ణ విజయలక్ష్మి పండిట్ లతో పాటు, "ఆనంద భవన్" లో ఆంగ్ల సాంప్రదాయ శిష్ట పద్ధతులలో పెరిగారు. బాల్యంలోనే హిందీ, సంస్కృతాలు, భారత సారస్వత గ్రంథాల పఠనా సక్తులు అయినారు. ఇండియన్ సివిల్ సర్వీసులో అర్హత పొందాలని తండ్రి కోరికను అనుసరించి, ఇంగ్లాండ్ నందలి హార్రో వెళ్ళాడు. పాఠశాల విద్య అక్కడ పూర్తిచేసి, 1907లో, కేంబ్రిడ్జ్ లో ప్రవేశ పరీక్ష రాసి, జీవశాస్త్ర అధ్యయనానికి కళాశాలకు వెళ్లి, 1910లో పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్ర అ అధ్యయనానికి ఇన్నర్ టెంపుల్ వెళ్లి, 1912లో ఉత్తీర్ణుడై అక్కడే న్యాయవాద వృత్తి చేపట్టాడు. వెనువెంటనే భారతదేశానికి తిరిగి రావడం జరిగింది. 1919లో జలియన్వాలా బాగ్ దుర్ఘటనకు ప్రభావితుడై, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, దేశ స్వాతంత్ర్య సంగ్రామానికి ఆకర్షితుడై, సంగ్రామంలో తన శక్తులు లోడ్డుటకు ఉద్యుక్తుడయ్యాడు. మొదట మోతిలాల్ నెహ్రూ కుమారుని నిర్ణయాన్ని వ్యతిరేకించినా, తర్వాత ఆయన సైతం సంగ్రామంలో భాగస్వామి అయినాడు. అనంతరం మహాత్ముని నమ్మిన బంటుగా నెహ్రూ గుర్తింపు పొందాడు. ఆ సమయంలో 9 ఏళ్ళు జీవితం అనుభవించాడు. జీవితం సమయంలోనే 1334 లో "గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ', 1936 లో తన జీవిత చరిత్ర 1946లో "ది డిస్కవరీ ఆఫ్ ఇండియా" రచనలు పూర్తిచేశాడు తొలిసారిగా గాంధీ నాయకత్వ పోరాటంలో, 1929 లో భారత జాతీయ కాంగ్రెస్ నేతగా, లాహెూర్ సమావేశాలకు నాయకత్వం వహించాడు. 1936,1937,1940 లలో, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనాడు. యువకునిగా ఉన్న నాటి నుండే జాతీయ కాంగ్రెస్ లో, వామపక్ష భావజాల ప్రభావితుడై, సంపూర్ణ స్వాతంత్ర్య సముపార్జన ఆసక్తుడై, గాంధీ సలహాలతో, ప్రజాకర్షణ గల నేతగా, సంస్కరణవాదిగా స్వాతంత్ర్య సంగ్రామంలో ముఖ్య భూమిక నిర్వహించి గాంధీ అనంతరం, రెండవ అగ్రశ్రేణి నాయకుడిగా గుర్తించబడి నాడు. 1916లో కాశ్మీరీ బ్రాహ్మణ వంశస్థులు రాలైన కమలా కౌల్ తో వివాహితుడైన నాడు. ఫలితంగా కుమార్తె ఇందిరా ప్రియదర్శిని 19 17 నవంబర్ 19న జన్మించింది. కమలా నెహ్రూ 19 46 లో క్షయ వ్యాధితో మృతి చెందగా, కుమార్తె ఇందిర, సోదరి విజయలక్ష్మిలపై, ఎక్కువగా ఆధార పడడం జరిగింది. 1947 నుండి 64 వరకు దేశ ప్రధానిగా ఉన్న నెహ్రూ, సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపు లో ప్రధాన పాత్ర పోషించి, 1952 లో దేశ తొలి ప్రధాని గా ఎన్నుకొనబడినాడు. 1947 ఆగస్టు 15న స్వతంత్ర్య భారత పతాకాన్ని ఎగరవేసిన తొలి భారతీయుడిగా, గౌరవం దక్కించుకున్న ఘనత ఆయనది. పార్లమెంటరీ తరహాలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛావాదం, పేద అణగారిన వారి పట్ల అనురాగం, ప్రధానిగా ఆయన రూపొందించిన విధానాలపై ప్రభావం చూపాయి. 1964 మే 27న తన 74వ ఏట పరమపదించాడు. పంచశీల సూత్ర అనువర్తిగా, అలీనోద్యమ స్థాపనకులలో ఒకరిగా, యుద్ధానంతర కాల అంతర్జాతీయ ప్రముఖుడిగా, గౌరవసూచకంగా "పండిట్" గా పిలువబడిన నెహ్రూ, సుదీర్ఘ పదవీకాలం అనుభవాన్ని రంగరింప చేసుకున్న కూతురు ఇందిర, మనమడు రాజీవ్, ప్రధాని పదవులు పొందడానికి స్ఫూర్తి పొందా రనాడంలో, రవంతైనా అతిశయోక్తి లేదు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

## భారత క్రికెట్ జట్టు తొలి కెప్టెన్ సి. కె. - నవంబర్ 14...సి. కె. నాయుడు వర్ధంతి

ఆయన భారత జట్టు క్రికెట్ కు ఆడిన వారిలో "విజ్డెన్" పత్రిక "క్రికెటర్ ఆఫ్ ది యియర్"గా ఎంపికైన మొదటి వ్యక్తి. ఫస్ట్ క్లాసు క్రికెట్లో యాభై ఏళ్ళ వయసు దాటాక కూడా డబుల్ సెంచరీ చేసిన అతి కొద్ది మంది ఆటగాళ్ళలో ఒకరు. క్రికెట్ చరిత్రలో 48 సంవత్సరాల సుదీర్ఘమైన కెరీర్ ఉన్న వారు మరొకరు లేరు. 1916లో మొదటి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ప్రారంభించి, అరవై రెండేళ్ళ వయసులో ఆఖరు మ్యాచ్ ఆడిన అరుదైన క్రికెటర్ ఆయన. ఆయనే భారత టెస్ట్ క్రికెట్ జట్టు తొలి కెప్టెన్ సి. కె.నాయుడు. సి. కె. నాయుడుగా పేరు గాంచిన కొట్టారి కనకయ్య నాయుడు 1933లో విస్డెన్ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అందుకున్నాడు. పద్మ భూషణ పురస్కారం అందుకొన్న తొలి క్రికెట్ ఆటగాడు, 1955లో భారత ప్రభుత్వం నుండి పద్మభూషణ్ అందుకున్నాడు. భారత క్రికెట్ చరిత్రలో రెండు దశాబ్దాలు (1916–1936) నాయుడు యుగంగా ప్రసిద్ధి గాంచాయి. నాయుడు 1895, అక్టోబర్ 31న నాగపూర్లో ఒక తెలుగు కుటుంబములో పుట్టి పెరిగిన ఆయన పాఠశాల రోజులనుండే క్రికెట్ ఆటలో ఎంతో ప్రతిభ కనపరిచాడు. ఆయన ప్రథమ శ్రేణి క్రికెట్ ఆటలో ప్రవేశము 1916లో హిందూ జట్టులో, యూరోపియన్ జట్టుకు వ్యతిరేకముగా జరిగింది. ఆయన ఆ ఆటలో తమ జట్టు 79 పరుగులకు 7 వికెట్లు పడిన పరిస్థితిలో 9వ ఆటగాడిగా బ్యాటింగుకు దిగాడు. మొదటి మూడు బంతులు అడ్డుకొని, నాలుగో బంతిని సిక్సర్ కొట్టాడు. ఇలా మొదలైన ఈయన ప్రాబల్యం తన క్రీడాజీ వితపు చివరినాళ్ల వరకు చెక్కు చెదరలేదు. సి.కె.నాయుడు పూర్వీకులు కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన నాయుడు వర్గంవారు. రెండు తరాలకి ముందే వాళ్ళ కుటుంబం హైదరాబాదుకి తరలిపోయింది. నారాయణస్వామి నాయుడు తాత నిజాం నవాబు వద్ద దుబాసీగా పనిచేసారు. తరువాత వారి మకాం ఔరంగాబాద్ కు మారింది. చివరికి సి.కె.నాయుడి తండ్రి సూర్యప్రకాశరావు నాయుడు హెూల్కర్ సంస్థానంలో న్యాయ మూర్తిగా ఉంటూ, నాగపూరులో స్థిరపడ్డారు. సి.కె.నాయుడు అక్కడే పుట్టి పెరిగాడు. సి.కె.ప్రతిభను గౌరవిస్తూ, హెూల్కర్ సంస్థానా ధీశుడు 1923లో ఆయనకి తన సైన్యంలో అత్యున్నత పదవినిచ్చి, ఇండోర్ రావలసిందిగా ఆహ్వా నించాడు. తన ఆఖరు రోజుల వరకూ సి.కె. అక్కడే స్థిరనివాసం ఏర్పర్చుకున్నాడు. సి.కె. ఇంట్లో తెలుగు వాతావరణమే ఉండేదని ఆయన పిల్లలు ఆయన గురించి రాసిన పుస్తకాలలో రాసారు. తెలుగు సంప్రదాయాలను పాటిస్తూ, తెలుగు పత్రికలు చదవడం, తెలుగు వస్త్రధారణలో ఉండటం నాయుడి కుటుంబంలో కొనసాగాయి. నలభై ఎనిమిదేళ్ళ సుదీర్ఘ ఫస్ట్ క్లాసు కెరీర్ లో సి.కె. మొత్తం 344 మ్యాచ్ లు ఆడి 11825 పరుగులు చేశాడు, 411 వికెట్లు తీసుకున్నాడు. సి.కె. కెరీర్ లో ఆడిన మ్యాచ్ లలో సగానికి పైగా ఆయనకి నలభై ఏళ్ళు దాటాక ఆడినవే. ఏడు అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ లు ఆడిన సి.కె. 350 పరుగులు చేశాడు, తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. ఆరు దశాబ్దాలపాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడిన కొద్దిమంది క్రీడాకారులలో సి. కె. నాయుడు ఒకరు. 1956–57 రంజీ ట్రోఫీలో తన 62 వ యేట ఆయన చివరిసారి ఆడాడు. ఆ మాచ్‌లో 52 పరుగులు చేశాడు. రిటైర్ అయ్యాక కొన్నాళ్ళు జట్టు సెలెక్టర్ గా, రేడియో వ్యాఖ్యాతగా ఆటతో తన అనుబంధం కొనసాగించాడు. ఆయన 1967, నవంబర్ 14న ఇండోర్‌లో మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**



## ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

మల్యాల: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా తెల్ల బియ్యం పంపిణీ చేస్తుండగా అప్పటికే మిగిలిపోయిన దొడ్డు బియ్యాన్ని తీసుకోకపోవడంతో ముక్కిపోయి పిండిగా మారుతోంది. జిల్లావ్యాప్తంగా మండలాల పరిధిలో 592 రేషన్ దుకాణాలున్నాయి. వాటి ద్వారా ప్రతి నెలా 6,400 నుంచి 6,500 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆరు నెలల కిందటి వరకు డీలర్లకు సరఫరా చేసిన దొడ్డు బియ్యంలో మిగిలిన నిలువలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. దీంతో ఆరు నెలలుగా సంచుల్లోనే ముక్కిపోతున్నాయి. కొన్ని దుకాణాల్లో పిండిగా మారుతున్నాయని డీలర్లు పేర్కొంటున్నారు. పౌరసరఫరాల మల్యాల గోదాంలో దాదాపు 600 సంచుల దొడ్డు బియ్యం సంచులు మిగిలిపోయాయి.

**ఒక్కో దుకాణంలో 10 క్వింటాళ్లు**



జిల్లాలో ఒక్కో డీలర్ వద్ద 5-10 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిలువలు మిగిలిపోయాయి. వాటిని వేలం వేయడం గానీ, ఎఫ్‌సీఐకి అప్పగించడం గానీ చేయకపోవడంతో ముక్కిపోతున్నాయి.

ప్రస్తుతం సరఫరా చేస్తున్న సన్న బియ్యం బస్తాల్లోనూ కొన్ని నాణ్యత లోపించిన దొడ్డు బియ్యం సంచులుంటున్నాయని కొందరు డీలర్లు తెలిపారు. వాటిని వినియోగదారులకు పంపిణీ చేయకుండా పక్కన పెట్టినట్లు పేర్కొంటున్నారు. చాలా గ్రామాల్లో బినామీ వ్యక్తులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం డీలర్ల నియామకం చేపట్టకపోవడంతో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే దుకాణాలు నడుపుతున్నారు. రేషన్ దుకాణాలకు ఎలాంటి బియ్యం సరఫరా అవుతోంది. వినియోగదారులకు పూర్తి స్థాయిలో పంపిణీ జరుగుతోందా? అన్న విషయమై అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికీ గ్రామాల్లో కొందరు రేషన్ వినియోగదారులు సన్న బియ్యాన్ని విక్రయిస్తున్నా అధికారుల నిఘా కొరవడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

జిల్లాలోని రేషన్ దుకాణాలతో పాటు, పౌరసరఫరాల గోదాముల్లో దొడ్డు బియ్యం సంచుల నిల్వలున్నాయి. వాటిని ఏం చేయాలన్న విషయమై ప్రభుత్వం మాకు ఆదేశాలు జారీ చేస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటాం. -జితేందర్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరా అధికారి

## 'ఆదా'య 'సౌర'భం

జగిత్యాల : సంప్రదాయ విద్యుత్తు వాడకంతో ప్రతి నెలా రూ.వేలల్లో బిల్లు చెల్లించే వారికి పీఎం సూర్యఘర్ పథకం వరంగా మారనుంది. ఏడాది కిందటే పథకం అందుబాటులోకి రాగా జిల్లాలో పలువురు ఇళ్లపై సౌర ఫలకల ఏర్పాటు చేసుకొని డబ్బులు ఆదా చేసుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 3,21,776 గృహ విద్యుత్తు కనెక్షన్లున్నాయి. ప్రతి నెలా రూ.2-4 వేల బిల్లులు చెల్లించే వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్తు తయారీపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో వివిధ కేటగిరీలు కలిపి 474 మంది వినియోగదారులు ఫలకలు ఏర్పాటు చేసుకోగా అందులో 312 గృహ కనెక్షన్లున్నాయి. వాణిజ్య కనెక్షన్లలో 131, కేటగిరీ 3లో 10, కేటగిరీ 7లో 21 మంది సౌర విద్యుత్తు ప్యానెళ్లు ఏర్పాటు చేసుకున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సుదర్శన్ తెలిపారు.

వాడకాన్ని బట్టి ప్యానళ్లు

అధీకృత కంపెనీ ద్వారానే సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవాలి. టాటాతో పాటు ఇతర ప్రముఖ కంపెనీలు పీఎం సూర్యఘర్ కింద ప్యానెళ్లు బిగిస్తున్నాయి.

ఎన్ని కిలోవాట్ల విద్యుత్తు అవసరమో ముందుగా ఎలక్ట్రీషియన్‌తో



ఇంటి లోడ్‌ను లెక్కించాలి. నెలకు 200-300 యూనిట్లు వినియోగించుకునే 2 నుంచి 3 కిలోవాట్ల ప్యానళ్లు ఏర్పాటు చేసుకోవాలి. భవిష్యత్తులో ఏసీ బిగించాలనుకొనేవారు 4 కిలోవాట్ల ప్యానళ్లు బిగించుకోవడం మేలు. ఆసక్తి కలవారు పీఎం సూర్యఘర్ పథకం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

**పూచీకత్తు లేకుండా రుణాలు**

సౌర ఫలకల ఏర్పాటుకు స్వశక్తి సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఇతరులకు కూడా ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.2 లక్షల వరకు ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ సౌర ఫలకలు ఏర్పాటు చేయడమే పీఎం సూర్యఘర్ పథకం ఉద్దేశం. ఇందుకోసం మా శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులను ప్రోత్సహిస్తున్నాం.
-సుదర్శన్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

## గుట్టలు మాయం.. ప్రకృతికి గాయం

ధర్మపురి: ధర్మపురి, బుగ్గారం మండలాల్లో కొందరు గుట్టలను కొల్లగొడుతున్నారు. ఎలాంటి మైనింగు, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఎర్ర, ఇతర విలువైన మట్టిని దూర ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతోపాటు, ప్రకృతి సహజ సంపద తరలి పోతుందని స్థానికులు వాపోతున్నారు. ప్రతి గ్రామం సరిహద్దుల్లో ఒక చిన్న గుట్ట ఉంది. ఈ గుట్టలు సహజ సంపదతోపాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. వీటిని సంరక్షించాల్సిన అధికారులు మిన్నకుంటున్నారనే విమర్శలున్నాయి.

కార్యాలయాల ఎదుట నుంచే..అధికారుల కార్యాలయాల ముందు నుంచే ఎర్ర మట్టిని తరలిస్తున్నా.. అధికారుల్లో ఏమాత్రం చలనం ఉండటం లేదని పల్లె ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటుక బట్టీలకు కచ్చితంగా సర్వే నంబర్, రెవెన్యూ, మైనింగ్ ధ్రువీకరణ పత్రాలను స్వీకరించిన తర్వాతే తరలించాల్సి ఉంటుంది. ఇలా కాకుండా ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అలాగే ధర్మపురి పరిధి మారుమూల గ్రామాలైన తీగల ధర్మారం, దొంతాపూర్, మగ్గిడి, జైన, ఆరెపల్లి ప్రాంతాల్లోని గుట్టలను గుత్తేదార్ల దాహానికి మాయమవుతున్నాయి.

రాత్రిళ్లు గుట్టుగా..నేరెళ్ల, వెల్గొండ ప్రాంతాల్లోని గుట్టల వద్ద లభ్యమయ్యే ఎర్రమట్టిని రాత్రిళ్లు జేసీబీలు పెట్టి వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు, నిఘా పెట్టడంలేదు. రహదారుల నిర్మాణానికి, ఇతర ప్రభుత్వ, ప్రజా అవసరాలకు వినియోగించినా పర్వాలేదు. అయితే వ్యక్తిగత స్వలాభానికి విక్రయిస్తున్నారు.

# రుణాలకు.. కొత్త మెలిక

రాయికల్ : దేశ ఆర్థిక వ్యవస్థలకు వెన్నుముకగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎమ్ఎస్ఎమ్ఈ) అభివృద్ధికి కేంద్రం తీసుకువచ్చిందే ఉద్యమ్ రిజిస్ట్రేషన్. వ్యాపారవేత్తలు తమ సంస్థలకు సులభంగా, ఉచితంగా, పేపర్‌లెస్ విధానంలో అధికారిక గుర్తింపు పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌తో ఎమ్ఎస్ఎమ్ఈలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆర్థిక, చట్టపరమైన, పరిపాలనపరమైన ప్రోత్సాహకాలు పొందుతారు.

**తక్కువ వడ్డీ ప్రయోజనాలు**

దీనివల్ల ప్రభుత్వ పథకాల ద్వారా హామీ లేని రుణాలు, వడ్డీ రేట్లలో రాయితీ లేదా తక్కువ వడ్డీ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ అనేది ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ ద్వారా అందించబడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ. ఈ ప్రక్రియ ఆధార్, పాన్‌కార్డు అనుసంధానంపై ఆధారపడి ఉండగా.. రిజిస్ట్రేషన్ పూర్తయిన అనంతరం ఆయా సంస్థలకు ఒక శాశ్వత ప్రత్యేక గుర్తింపు సంఖ్య, ధ్రువీకరణ పత్రం లభిస్తుంది. బల్దియా పరిధిలో నమోదైన స్ట్రీట్ వెండర్స్‌కు, ముద్ర రుణాల దరఖాస్తుదారులు, వ్యాపారం కోసం పీఎంఈజీపీ వంటి పథకాల్లో బ్యాంకు రుణాలు తీసుకునేవారికి ఉద్యమ్ ఆధార్ తప్పనిసరిగా కలిగి ఉండాలని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు.

**ఆన్‌లైన్ నమోదు విధానం**

%https:///www.udyamregistration.gov.in/Governm ent-India/Ministry-MSME-registration.htm% అనే హోమ్ పేజీలో 'ఫర్ న్యూ ఎంటర్‌ప్రెన్యూర్స్ హూ ఆర్ నాట్ రిజిస్టర్డ్ యెట్ యాస్ ఎమ్ఎస్ఎమ్ఈ' అనే ఆప్షన్ ఎంచుకొని ఆధార్ నంబర్, పేరు నమోదు చేసి జనరేట్ ఓటీపీ బటన్ ఎంచుకోవాలి. రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చిన ఓటీపీని నమోదుచేసి వాలిడేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి.

వ్యాపార సంస్థ రకాన్ని ఎంచుకొని పాన్ నంబర్ నమోదు చేయగానే ధ్రువీకరణ జరుగుతుంది. అనంతరం చరవాణి నంబర్, మెయిల్ ఐడీ, సామాజిక వర్గం, జెండర్, వ్యాపార సంస్థ పేరు, చిరునామా, సంస్థ రిజిస్ట్రేషన్ వివరాలు, నిక్(నేషనల్ ఇండస్ట్రియల్ క్లాసిఫికేషన్) కోడ్, పెట్టుబడి వివరాలు తదితర నమోదు చేయాలి. అన్ని వివరాలు సరి చూసుకున్న తర్వాత సబ్మిట్ అండ్ గెట్ ఫైనల్ ఓటీపీ బటన్‌పై క్లిక్ చేయాగానే వచ్చిన ఓటీపీ నమోదు చేసి క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి. అనంతరం దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు సమర్పించగానే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ నంబర్(యుఆర్ఎన్) చూపిస్తోంది. నమోదుచేసిన మెయిల్ ఐడీకి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వస్తుంది.

# ఇకనైనా కుక్కల సమస్య తీరేనా?



కరీంనగర్ : 'విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, క్రీడా మైదానాలు, ఆసుపత్రులు తదితరల జన రద్దీ ఉండే బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను సంచరించకుండా చేయాలి. వాటిని ప్రత్యేక షెల్టర్లకు తరలించండి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలకు ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవి.. జిల్లాలోని నగర, పురపాలికల పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. ఏ సమయంలో ఇవి దాడికి దిగుతాయో తెలియకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎనిమిల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) నిబంధనల ప్రకారం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ద్వారా శునకాలకు శస్త్రచికిత్సలు చేసి సంతానోత్పత్తి తగ్గించాల్సి ఉండగా, పలు ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిలిపివేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ థియేటర్, క్యాటిల్ సక్రమంగా లేదనే ఫిర్యాదుతో ఆగిపోయింది. మరో వైపు జన సమూహ ప్రాంతాల నుంచి వీటిని తరలించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయగా ఏమేరకు సమస్యను పరిష్కరిస్తారో తెలియకుండా మారింది. పురపాలికల పరిధిలో షెల్టర్లు లేవు. వాటిని నిర్మించి శునకాలను తరలిస్తారా లేదా చూడాలి మరి.

**పెరుగుతున్న ఫిర్యాదులు**

పుర, నగరపాలికల్లో శునకాల గుంపులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలకు పెద్దలు తోడుగా వెళ్లాల్సి వస్తోంది.

రాత్రిపూట నడిరోడ్లపై ఉంటూ రాకపోకలు సాగించే వాహనదారుల వెంట పడుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

వీధి కుక్కలను తరలించాలని జిల్లాలో ఫిర్యాదులు పెరుగుతుండగా.. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

ఎక్కడ పడితే అక్కడ వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో కొందరు ఆహారం పెట్టడంతో శునకాలన్నీ అక్కడికి చేరుకుంటున్నాయి.

**షెడ్డు నిర్మిస్తేనే శస్త్రచికిత్సలు**

కరీంనగర్‌లో రామగుండం బైపాసు రోడ్డులో జంతు సంరక్షణ కేంద్రం కోసం షెడ్డు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శ్లాబ్ దశకు చేరింది.

కోర్టు ఆదేశాల మేరకు షెడ్డు నిర్మిస్తే తప్ప శునకాలకు శస్త్ర చికిత్స చేసే అవకాశం లేదు.

వీధికుక్కల శస్త్రచికిత్స కోసం థియేటర్, క్యాటిల్ షెడ్డు వంటి సౌకర్యాలు అక్కడ ఏర్పాటు చేయనున్నారు.

**వేగంగా నిర్మాణ పనులు**

నగరానికి సంబంధించి జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. శునకాల తరలింపు విషయంపై మార్గదర్శకాలు రావాలి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిర్ణయముంటుంది.

దుర్గాప్రసాద్‌రెడ్డి, పశు వైద్యాధికారి, బల్దియా

# సేవాలోపాల్లో 'అందరూ బాధ్యులే'




కరీంనగర్ :వినియోగదారులకు విక్రయించే ఉత్పత్తులకి సంబంధించి సేవాలోపాలుంటే తయారీదారులతో పాటు విక్రయదారులు, డీలర్లు సైతం బాధ్యులేనని తాజా తీర్పులు వెల్లడిస్తున్నాయి. సేవా లోపముంటే ప్రతి దశలో పరిష్కారం దిశగా ప్రయత్నించాలని పేర్కొంటున్నాయి. తాజాగా ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విక్రయించిన కేసులో తయారీదారుదే పూర్తి బాధ్యత అంటూ అమెజాన్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. సేవాలోపం ఉందని గుర్తించి పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసినందుకు బాధ్యులను చేస్తూ పరిహారం చెల్లించాలని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పు వెలువరించింది.

**లోపాలు జరుగుతున్నాయిలా..**

ఆరోగ్య సేవలు - రోగ నిర్ధారణలో తప్పులు, శస్త్ర చికిత్సలో నిర్లక్ష్యం, హాస్పిటల్ బిల్లు ఎక్కువ చూపించడంబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు - ఏటీఎం నుంచి డబ్బు రాలేదు కానీ ఖాతాలో ఉపసంహరించడం, రుణానికి ఆమోదం ఇచ్చి తర్వాత తిరస్కరించడం, బీమా క్లెయిమ్ తిరస్కరణ్య టెలికాం, ఇంటర్నెట్ సేవలు - రీఛార్జ్ చేసినా డేటా రాకపోవడం, బిల్లింగ్ లోపం (ఎక్కువ బిల్), ఇంటర్నెట్ స్పీడ్ హామీ ఇచ్చి తక్కువ ఇవ్వడం ప్రయాణాలు, ఆతిథ్య సేవలు - విమాన ప్రయాణం రద్దుపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, హోటల్ బుక్ చేసి గది ఇవ్వకపోవడం, టూర్ ప్యాకేజీలో హామీ ఇచ్చిన స్థలాలు లేకపోవడం

ఈ కామర్స్, డెలివరీ సేవలు - ఆర్డర్ ఇచ్చిన మోడల్‌కు బదులుగా వేరేవి రావడం, డెలివరీ ఆలస్యం, రిటర్న్ పాలసీ ప్రకారం రీఫండ్ ఇవ్వకపోవడం

గ్యాస్ సిలిండర్ లీక్, సేఫ్టీ చెక్ చేయకపోవడం, నీటి సరఫరా నిలిపివేత (సమాచారం ఇవ్వకపోవడం).

**జిల్లా కమిషన్లలో కేసులు..**

రాజధాని పరిధిలో నిత్యం రూ.కోట్ల వ్యాపారం జరుగుతోంది. తక్కువ ప్రచార ఖర్చులో విక్రయాలు పెంచుకోవడానికి కొంత మంది అనుచిత వ్యాపార పద్ధతులను అవలంభిస్తున్నారు. అందించాల్సిన సేవలను విస్మరిస్తున్నారు. ఈ క్రమంలో లోపం ఉందని తెలిసి ఉత్పత్తులు విక్రయిస్తూ, నాణ్యత పట్టించుకోకపోవడం లేదు. ఈ తరహా కేసులు రాజధాని పరిధిలోని 4 జిల్లా వినియోగదారుల కమిషన్లలో ప్రతినెలా 150కిపైగా నమోదవుతున్నాయి.

**తయారీదారు బాధ్యతలివీ..**

ఉత్పత్తి సురక్షితం, నాణ్యత కలిగి ఉండాలి.- వారంటీ, గ్యారంటీ ప్రకారం సేవలు అందించాలి.- లోపం తెలిస్తే రీకాల్ చేయాలి.- ప్రమాదకరమైన ఉత్పత్తులు (ఉదా: ఆటోమొబైల్స్, ఔషధాలు) గుర్తిస్తే హెచ్చరికలు ఇవ్వాలి.

**విక్రయదారు/ డీలర్‌లవి**

లోపం ఉన్న ఉత్పత్తి విక్రయించకూడదు. తెలిసినా తెలియకపోయినా బాధ్యులే. తప్పుడు ప్రకటనలు చేయకూడదు.

వారంటీ ప్రకారం సేవలు అందించాలి. లేదా తయారీదారుకు పంపాలి. బిల్, వారంటీ కార్డు ఇవ్వాలి. వినియోగదారుడు విక్రేతకు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.

సేవా ప్రదాత.. సేవా ఒప్పందం, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి అనుచిత వాణిజ్య పద్ధతులు అవలంబించకూడదు

ధర, నాణ్యత, రిస్కుల గురించి స్పష్టంగా చెప్పాలి.

# ఆధునిక వసతులు.. ఆటపాటల తరగతులు

కరీంనగర్ : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలలకు మహర్దశ చేకూరనుంది. అయిదేళ్లలోపు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్న ఈ పాఠశాలలకు బోధనాభ్యసన సామగ్రిని సమగ్ర శిక్షా అధికారులు సమకూరుస్తున్నారు. ఆటపాటలతో చిన్నారులకు బోధన చేసేందుకు ఈ సామగ్రి ఉపయోగపడనుంది. వీటితోపాటు తరగతి గదులకు రంగులు, బాలలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. ప్రైవేటుకు ధీటుగా అధునాతన వసతులతో చిన్నారులనే కాకుండా వారి తల్లిదండ్రులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు.

**జిల్లాలో 22 బడులు ఏర్పాటు**

ఈ ఏడాది అక్టోబరులో జిల్లాలో 22 ప్రీప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేశారు. వీటికి ఒక ఇన్‌స్ట్రక్టర్, చిన్నారులను చూసుకోవడానికి ఆయాను విద్యాశాఖ నియమించింది. ప్రస్తుతం 150 మంది బాలలు చేరగా యూకేజీ తరగతులు బోధిస్తున్నారు. అయితే సాధారణ రీతిలో బోధన చేస్తుండటంతో చిన్నారులు ఆకర్షితులు కావడం లేదని తెలుస్తోంది. కిడ్స్ కేర్ పాఠశాలలను తలపించేలా ఈ పాఠశాలల్లో అధునాతన వసతులు, ఆటపాటలతో కూడిన బోధనా పద్ధతులతో తీర్చిదిద్దే విషయంపై సమగ్ర శిక్షా అధికారులు దృష్టి నిలిపారు.

**ఒక్కోదానికి రూ.1.70 లక్షలు**


జిల్లాలోని ఒక్కో ప్రభుత్వ ప్రీప్రైమరీ పాఠశాలకు రూ.1.70 లక్షల నిధులు కేటాయించి తీర్చిదిద్దుతున్నారు. సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి అందించనున్నారు. ఇప్పటికే ఇవి జిల్లాకు చేరడంతో శనివారం ఎంఈవోల ద్వారా పాఠశాలలకు పంపిణీ చేశారు. పాఠశాల తరగతి గదులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు రూ.50 వేలతో రంగులు వేయిస్తున్నారు. రూ.20 వేలతో బాలలకు దుస్తులు, స్టేషనరీ సమకూరుస్తున్నారు. ఆటపాటలతో అభ్యసనాన్ని సాగించేందుకు పలు రకాల వస్తువులు, ఆట బొమ్మలు, రంగురంగుల ఆకారాలు వంటివి అందించనుండటంతో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపిస్తారని, ఈ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు, ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

## అంతా ఏకమై.. అన్నదాతకు శాపమై..!

సూర్యాపేట : అకాల వర్షాలు, మొంథా తుపాను వరి రైతులపై అదనపు భారాన్ని మోపాయి. వానలతో నిలిచిన వరికోత పనులకు వాతావరణం ప్రస్తుతం అనుకూలించడంతో ఒకేసారి పొలాలు కోతకు వచ్చాయి. దాంతో యంత్రాల నిర్వాహకులు, వాటి మధ్యవర్తులు అన్నదాతల అవసరాన్ని ఆసరా చేసుకుని ధరలను పెంచారు. అయినా ముందుకొస్తే హార్వెస్టర్ల కొరత నెలకొంది. రెండు రోజులు ఆలస్యమైనా.. తమ పొలాన్ని నూర్పిడి చేయాలంటూ రైతులు యంత్రాల నిర్వాహకుల, మధ్యవర్తులు చుట్టూ తిరుగుతున్నారు. వాన భయంతో కొన్ని ప్రాంతాల్లో ముందస్తు చెల్లింపులు చేస్తూ బుకింగ్ చేయించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయి.

**50 శాతం పూర్తి..**

ఉమ్మడి జిల్లాలో 11.82 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా.. అత్యధికంగా ఎన్ఎస్పీ, ఎస్సారెస్పీ, మూసీ పరివాహకంలోనే సాగైంది. ప్రస్తుతానికి 50 శాతం కోతలు కాగా మరో 50శాతం కోయాల్సి ఉంది. ఇందులో దిగుబాటు పొలాలే ఎక్కువగా ఉండటంతో చైన్ హార్వెస్టర్లను ఆశ్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫోర్ వీల్ యంత్రాలతో నూర్పిడి చేయిస్తున్నారు. చైన్ల యంత్రాల నిర్వాహకులు గతంలో ఎకరం పొలాన్ని గంట సమయంలో కోసేవారు. అందుకు రూ.3 వేల చొప్పున తీసుకునే వారు. ఇప్పుడు యంత్రాల కొరత, నూర్పిడికి డిమాండ్ ఉండటంతో గంటకు రూ.500 ధర పెంచి రూ.3,500 తీసుకుంటున్నారు. ఫోర్‌వీల్ గతంలో గంటకు రూ.2,500 తీసుకుంటే ఇప్పుడు



రూ.3 వేలు తీసుకుంటున్నారు.

మొంథా తుపాను ప్రభావంతో చాలా పొలాలు నేలవాలడంతో ఎకరం విస్తీర్ణాన్ని 1:30 గంటల నుంచి 2 గంటల పాటు కోయాల్సి వస్తుందని యంత్రాల నిర్వాహకులు చెబుతున్నారు. ఈ లెక్కన ఒక రైతు ఎకరం పొలం కోయించడానికి రూ.5,250 నుంచి రూ.6 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అదే 10 ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతు రూ.52,500 నుంచి రూ.60 వేలు వెచ్చిస్తున్నారు.

వానాకాలం వరి కోతలు సాధారణంగా రాత్రి 8 గంటల సమయం వరకు చేస్తారు. కారణం మంచు పడి కోత చేస్తే వడ్లు నేలరాలి నష్టపోతామని రైతులు వద్దనే వారు. కానీ, ప్రస్తుతం యంత్రాల కొరత కారణంగా దాదాపు రాత్రి 11 గంటల దాకా కోత పనులు చేస్తున్నారు.

రూ.5 వేల అదనపు భారం: బోసు, పాలవరం, అనంతగిరి మండలం ఎనిమిదెకరాల్లో వరిసాగు చేశా. హార్వెస్టర్‌కు గతేడాది గంటకు రూ.3 వేలు ఉండగా.. ఈ దఫా ఒక్కో గంటకి రూ.3,500 వసూలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈసారి కోత పనులకు రూ.5 వేల అదనపు భారం పడింది.

## అక్షరమే ఆయుధం.. విజయ వికాసం

మిర్యాలగూడ : చదువుతోనే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని మేధావులు ఏనాడో చెప్పారు. చదువు అనగానే ప్రతి ఒక్కరికి ఉద్యోగం, వేతనం మాత్రమే గుర్తుకు వస్తుంది. కానీ అసలు చదువు అంటే విజ్ఞానం. విజ్ఞానం పొందిన వారు మంచి భవిష్యత్తుతో పాటు సమాజంలో కీర్తి ప్రతిష్ఠలు సైతం అందుకుంటారు. దేశంలో ఉన్నత విద్యకు ఆజ్యం పోసిన భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఏటా నవంబరు 11న 'జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..** ప్రస్తుత రోజుల్లో చదువుకోవడానికి అవకాశాలు ఉన్నప్పటికీ అనేక మంది నిర్లక్ష్యం చేస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చదువు విలువ తెలిసిన వారు ఎలాంటి అవకాశాలు లేకపోయినా ఉన్న కొద్దిపాటి వనరులనే సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి కొలువుదీరిన వారు సైతం ఉన్నారు.

**చదువు విలువ తెలిసి...**

సైదులు, ఎక్సైజ్ ఎస్సై, వెంకటాద్రి పాలెం, మిర్యాలగూడ మండలం. అమ్మానాన్నలు భిక్షం, ఎల్లమ్మ గీత కార్మికులు. కుటుంబ పోషణ కోసం ఆరో తరగతి లోనే చదువు మానేసి పనిలో చేరాను. ఐదేళ్ల తర్వాత చదువు విలువ తెలిసి దూరవిద్య ద్వారా పదో తరగతి, డిగ్రీలో చేరాను. పరీక్షల్లో అనేక సార్లు ఫెయిల్ అయినప్పటికీ గ్రామానికి వచ్చిన అధికారులు, వారికి ప్రజలు ఇచ్చే గౌరవాన్ని చూసి నేను కూడా అదే స్థాయి గౌరవం పొందాలని నిశ్చయించుకున్నాను. ఎంతో కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. అనంతరం బీఈడీ సైతం పూర్తి చేసి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీజీ సెట్‌లో ఎనిమిదో ర్యాంకు సాధించి, ఎంఏ ఎకనామిక్స్‌లో సీటు పొందాను. పొలిటికల్ సైన్స్‌లో సైతం పీజీ పూర్తి చేసి ఉద్యోగానికి సన్నద్ధమయ్యాను. 2016లో గ్రూప్-2లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకుతో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం ధూల్‌పేటలో పని చేస్తున్నాను.

**తాళ్లెక్కుతూ.. కల్లు విక్రయిస్తూ...** పల్స నాగరాజుగౌడ్, సూర్యాపేట. మాది సాధారణ పేద వ్యవసాయ, గీత కార్మిక కుటుంబం. అమ్మానాన్నలు పల్స రాములు-సత్తెమ్మలు కష్టాలు పడి నన్ను, అక్క, చెల్లిని పోషించే వారు. నేను చదువుకునే వయసులోనే పొలం పనులకు, కల్లు విక్రయాలకు వెళ్లే వాడిని. పాఠశాల, కళాశాల విద్యలన్నీ ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తి చేశాను. డిగ్రీ చదువుతున్న రోజుల నుంచే తాళ్లెక్కడం, కల్లు గీయడం, విక్రయించడం వంటి పనులు చేసే వాడిని. డిగ్రీ, బీఈడీ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమయ్యాను. ఈ క్రమంలో ఏడాది కాలంలోనే ఎస్సైగా ఉద్యోగం సాధించాను. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పని చేశాను. ప్రస్తుతం హయత్‌నగర్ సీఐగా పని చేస్తున్నాను.

చురకలు



## కన్నీటి కట్టలకు.. లెక్కలు కట్టరా?

నల్గొండ : మొంథా తుపాను ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్లో కొందరు పరిహారానికి దూరమవుతున్నారు. పంట నష్టం వివరాల నమోదులో జాప్యమే దీనికి కారణం. తుపానుతో పంటలు దెబ్బతిన్నాయి. ఈ వివరాలను సర్వే చేసి నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తొలుత ప్రాథమిక అంచనా మేరకు జిల్లాలో 61511 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. వరదలు తగ్గాక క్షేత్రస్థాయిలో పర్యటించి సాగు విస్తీర్ణంలో 33 శాతం దెబ్బతిన్న పొలాలకే పరిహారానికి అర్హత ఉన్నదిగా నిర్ధారించాల్సి ఉంటుంది.

**ఇప్పుడే కొనుగోళ్లు..!**

వ్యవసాయశాఖలో ఐదు వేల ఎకరాలను ఒక క్లస్టర్‌గా విభజించి ఏఈవోను నియమించారు. వీళ్లే ఇప్పుడు పంట నష్టం నమోదు విధులు నిర్వర్తించాల్సి ఉంది. ఇదే సమయంలో పంటల విక్రయాలు జరుగుతుండటంతో టోకెన్ల జారీ, పంట నాణ్యత ధ్రువీకరణ విధులు కూడా వీరే చేయాల్సి ఉంది. కొన్ని క్లస్టర్లకు ఏఈవో పోస్టులు ఖాళీగా



ఉన్నాయి. వివిధ కారణాలతో సర్వే ఆలస్యమవుతుంది.

**డిజిటల్ క్రాప్ డ్యామేజ్ సర్వే..**

పంట నష్టం జరిగిన క్షేత్రాన్ని ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ డిజిటల్ క్రాప్ డ్యామేజ్ సర్వే ప్రారంభించి వారం దాటినా ఇంకా పూర్తి కాలేదు. నేలవాలిన పంట మొలకలు వస్తుండటంతో ఆలస్యంగా చేస్తే చేతికివచ్చేది కూడా పాడవుతుందని యంత్రాలు పెట్టి అందినకాడికి కోయిస్తున్నారు. రైతు ఆలోచన మంచిదే అయినా.. నిబంధన మేరకు సిబ్బంది క్షేత్రస్థాయికి వచ్చే నాటికి పంట కోయిస్తే వివరాలు నమోదుకు నిరాకరిస్తున్నారు.

**త్వరలో పూర్తి చేస్తాం**

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

పంట నష్టం చిత్రాలను తీసి యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఈ మేరకు సర్వే త్వరలో ముగుస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నాం.

## పాఠాలకు తెర లేస్తోంది

మిర్యాలగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ పాఠ్యాంశాల బోధనకు టీచర్లను నియమించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలో కంప్యూటర్లు ఉన్న పాఠశాలలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఐదు కంటే ఎక్కువ కంప్యూటర్లు ఉన్న పాఠశాలలకు మొదటగా ఉపాధ్యాయులను నియమించాలని నిర్ణయించారు. జిల్లాలో 180 పాఠశాలల్లో ఐదు కంటే ఎక్కువ కంప్యూటర్లు ఉన్నట్లుగా ప్రాథమికంగా గుర్తించారు. పొరుగుసేవల విధానంలో తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా నియమించనున్నారు. వీరికి గౌరవ వేతనం నెలకు రూ.15 వేలు ఇవ్వనున్నారు. సమగ్ర శిక్షణ ప్రాజెక్టు కింద ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు కేటాయించి ఒప్పంద విధానంలో ఐదేళ్ల పాటు కంప్యూటర్ టీచర్లను నియమించారు. ఆ తర్వాత వారిని కొనసాగించకపోవడంతో నాటి కంప్యూటర్లు వినియోగం



లో లేకుండా పోయాయి. చాలా చోట్ల కార్యాలయ అవసరాలకు వీటిని ప్రధానోపాధ్యాయులు వినియోగిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలలకు పది కంప్యూటర్లను పంపిణీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా పలు పాఠశాలల్లో గ్రీన్ బోర్డు కమ్ టీవీగా వినియోగించే డిజిటల్ సామగ్రిని కూడా ఏర్పాటు చేయించారు.

ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల మేరకు కంప్యూటర్ బోధకులను నియమిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతికి తెలిపారు. జిల్లాలో పాఠశాలల విద్యార్థులు ప్రాథమిక 1126

ప్రాథమికోన్నత 128 ఉన్నత 229 విద్యార్థులు 89106

## నో షేవ్ నవంబరు..

హైదరాబాద్: నో షేవ్ నవంబర్.. ఈ నెలలో యువకులలో ఎక్కువగా చర్చకు వచ్చే అంశం. ఎవరిదైనా గడ్డం కాస్త పెద్దగా కనిపించిందంటే.. 'నో షేవ్ నవంబరు పాటిస్తున్నావా? బ్రో..' అనేస్తుంటారు. ఈ నెలలో ఎక్కువ మంది గుబురు గడ్డాలతో కనిపిస్తుంటారు. వాటిని చూసి 'స్టైల్' అనుకుంటే పొరబడినట్లే. దాని వెనుక సదుద్దేశంతో పాటు సామాజిక బాధ్యత దాగి ఉంది. 15ఏళ్ల క్రితమే విదేశాల్లో ఈ ట్రెండ్ ప్రారంభమైంది. ఈ నెలంతా షేవింగ్, ట్రిమ్మింగ్ జోలికెళ్లరు. ఆదా డబ్బును క్యాన్సర్ రోగులకు అందజేస్తారు. ఈ ట్రెండ్ ప్రపంచమంతా విస్తరించింది. **గడ్డం చేయించుకోవడం లేదు**

నగరంలో 12 ఏళ్లుగా క్షౌరశాల నిర్వహిస్తున్నా. గతంలో ఈ ట్రెండ్ లేదు. నగరంలో మూడేళ్ల నుంచి ఈ పోకడ కనిపిస్తోంది. ఈ ఏడాది మరింత పెరిగింది. ఇటీవల సెలూన్‌కి వచ్చిన యువకులు హెయిర్ కట్ మాత్రమే చేయించుకుని వెళ్తున్నారు. గడ్డం జోలికి పోవద్దని చెబుతున్నారు. రాజునాయక్, సెలూన్ యజమాని, బోడుప్పల్

# అతివలకు ఆర్థిక భరోసా!



కరీంనగర్ : స్వశక్తి సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతను ఇచ్చేందుకు ప్రభుత్వం పలురకాల రుణాలు అందించి ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని ఒక నగరపాలక, మూడు పురపాలికల పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు ఏటా రుణాలు అందిస్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి (మార్చి నెలాఖరుకు) అర్హత ఉన్న 909 సంఘాలకు రూ.132.21 కోట్ల రుణ లక్ష్యాన్ని విధించారు. ఇప్పటివరకు 453 స్వశక్తి సంఘాలకు రూ.71.89 కోట్లు మంజూరు చేశారు. దాదాపు సగం మేర రుణాలు ఇవ్వడం పూర్తయ్యింది.

**ఉపాధి అవకాశాలు మెరుగు**

బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకొని మహిళలు పంచుకోకుండా సమష్టిగా ఉపాధి అవకాశాలు మెరుగు పర్చుకునే వారున్నారు. కొందరు వ్యక్తిగతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. క్యాంటీన్లు, సూపర్‌మార్కెట్లు, డెయిరీలు, కిరాణం, టైలరింగ్, దుస్తుల విక్రయం, వ్యవసాయం, పాడి పశువుల పెంపకం, టిఫిన్ సెంటర్లు, ఇంటి వంటకాలు, పచ్చడి అమ్మకాలు వంటి వాటిలో పెట్టుబడి పెట్టి లాభాలు గడిస్తున్నారు.

**రూ.75 వేలు నుంచి 20 లక్షల వరకు**

ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపు చేసిన మహిళా సంఘాలకు రూ.75 వేల నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందే వీలుంది. ప్రతి సంఘం ఆరు నెలల వరకు సక్రమంగా చెల్లిస్తే రూ.75 వేలు బ్యాంకు లింకేజీ రుణం వస్తోంది. ఆ తర్వాత సంఘాల అర్హతను బట్టి రూ.లక్ష నుంచి మొదలుకొని రూ.20 లక్షల వరకు రుణ మొత్తం పెరుగుతుంది. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తే బ్యాంకులు మళ్లీ ఇచ్చేందుకు ముందుకొస్తాయి.

**గతేడాది శతశాతం పైగా రుణాలు**గత ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ కింద రుణాలు అందించడంలో శత శాతం దాటారు. మొత్తం 847 స్వశక్తి సంఘాలకు రూ.104.24 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, 914 సంఘాలకు ఇచ్చి రూ.182.01 కోట్లు రుణాలు అందించి 107.91 శాతం సాధించారు. ఈ లెక్కన పరిశీలిస్తే బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు మహిళలు క్రమం తప్పకుండా చెల్లించి లక్ష్యాన్ని అధిగమిస్తున్నారు.

## అక్రమిద్దాం.. అమ్మేసుకుందాం



కోరుట్ల : స్థిరాస్తి వ్యాపారులు యథేచ్ఛగా అక్రమంగా వెంచర్లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ భూములు, ఎస్సారెస్పీ కాలువలు, నాలాలు, రోడ్లను ఆక్రమిస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ శివారులోంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. దానికున్న డీ-36 కాలువ ద్వారా పెద్దాపూర్, చింతలపట, కిషన్‌రావుపల్లె, తిమ్మాయిపల్లె, కోరుట్ల పట్టణ శివారు ప్రాంతం గుండా ప్రవహించి వ్యవసాయ భూములకు 40 ఏళ్లకుపైగా సాగు నీరందిస్తుంది. కోరుట్ల పట్టణం కల్లూర్‌రోడ్ వద్దకు చేరిన డీ-36 కాలువకు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములను కొంతకాలంగా స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లను ఏర్పాటు చేశారు.

**చదునుచేసి కలిపేసుకొని**

ఎస్సారెస్పీ కాలువకు ఇరువైపులా 33 అడుగుల వెడల్పుగల భూమిని చదును చేసి కలిపేసుకున్నారు. ప్లాట్లుగా విభజించి అమ్మకాలు చేపట్టారు. కొన్నిచోట్ల కాలువ భూమిలో పునాదులు, ప్రహరీ నిర్మించారు. కాలువకు ఇరువైపులా ఉన్న 33 అడుగుల వెడల్పు రోడ్డు పూర్తిగా కుంచించుకుపోయి రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. కల్లూర్ రోడ్డులోని రహదారి నుంచి పాతమాదాపూర్ రోడ్డు వరకు సుమారు కిలోమీటరు పొడవునా కాలువ నామరూపాలు లేకుండా పోయింది.

**నీరంతా వృథా**

మూడేళ్ల క్రితం డీ-36 కాలువను ఆధునీకరించడంతో కాలువలో సమృద్ధిగా నీరు కింది ప్రాంతానికి ప్రవహించేది. కల్లూర్‌రోడ్ వద్ద ఎస్సారెస్పీ నీరు ప్రవహించేందుకు కాలువ లేకపోవడంతో ఇరువైపులా ఉన్న ఖాళీ భూముల్లో వృథాగా పారుతోంది. కాలువకు దగ్గర్లోనున్న ఓ కాలనీల్లోకి ఎస్సారెస్పీ నీరు చేరి రోడ్లు జలమయం కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పంట కాలువలో నీరు ప్రవహించిన రోజులు.. సాగు నీరు వృథాగా పోవడంతోపాటు రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆక్రమణకు గురైన ఎస్సారెస్పీ కాలువను యథావిధిగా తీయించి, ఇరువైపులా భూమిని రోడ్డుగా మార్చాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

## 'తప్పు'టడుగులకు నాన్నే మధ్యవర్తి

మిర్యాలగూడ : పదో తరగతి, ఇంటర్ నుంచే అనేక మంది ధూమపానం, మద్యం తాగడం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారు. ఈ చెడు వ్యసనాలకు అలవాటు పడేందుకు ఇంట్లోని ఆ అలవాట్లు ఉన్న తండ్రి, ఇతర కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు సైతం ప్రధాన కారకులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పట్టుబడుతున్న అనేక గంజాయి కేసుల్లో యువతే అధికంగా ఉంటున్నారు.

**తండ్రి బాటలో..**

చిన్నతనంలో తనను అనుసరిస్తున్న కుమారుడిని చూసి తండ్రి ఎంతో సంతోషిస్తాడు. అయితే తాను చేసే ప్రతి పనిని తన కుమారుడు గమనిస్తాడని, ఒక వయసు వచ్చాక అది కూడా చేసేందుకు ప్రయత్నిస్తాడని తండ్రులు ఆలోచించరు. అందుకే ఎలాంటి ఆలోచన లేకుండా పిల్లల ముందే సిగరెట్లు కాల్చడం, మద్యం తాగడం వంటివి చేస్తుంటారు. మరికొందరు పిల్లలతోనే సిగరెట్లు, మద్యం వంటివి తెప్పిస్తారు. ఈ చర్యల వల్ల పిల్లలు సైతం ఆ అలవాట్ల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి నిత్యం మద్యం తాగడంతో పాటు సిగరెట్లు సైతం కాలుస్తూ ఉండేవాడు. అప్పుడప్పుడు సిగరెట్లు, మద్యాన్ని తొమ్మిదో తరగతి చదువుతున్న తన కుమారుడితో సైతం తెప్పించుకునేవాడు. అలా ఆ అబ్బాయి ఇంటర్‌కు వచ్చే సరికి సిగరేట్ కాలుస్తూ తండ్రికి కనిపించే సరికి ఇంటికి వచ్చిన తర్వాత కుమారుడిని నిలదీశాడు. నువ్వు తాగితే లేని తప్పు నేను తాగితే వచ్చిందా.. అని అబ్బాయి ప్రశ్నించే సరికి ఆ తండ్రి వద్ద సమాధానం లేదు.

**పెద్దలను అనుకరించడం మామూలే...**


పోకల వెంకటేశ్వర్లు, సైకాలజిస్టు, మిర్యాలగూడ.

పిల్లలు చిన్నప్పటి నుంచి పెద్దలను అనుకరించడం, వారు చేసినట్లుగా చేయాలని ప్రయత్నించడం సర్వ సాధారణమే. అయితే ఇటీవల కాలంలో ఇది శృతి మించి చెడు అలవాట్లకు దారి తీస్తుంది. అనేక మంది తండ్రులు పిల్లల చేత సిగరెట్లు, మద్యం, గుట్కాల వంటివి తెమ్మని పిల్లలను పురమాయిస్తారు. అయితే ఇవి తీసుకొచ్చే క్రమంలో వీటి రుచి ఎలా ఉంటుందో చూడాలనే కుతూహలం ఉంటుంది. కొందరు భయపడి మానేసినా ఎక్కువ మంది పిల్లలు తమ స్నేహితులతో కలిసి వాటిని రుచి చూసేందుకు ప్రయత్నిస్తారు.

## అత్యాధునిక హంగులు.. వేగంగా అడుగులు

హైదరాబాద్: వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అధునాతన సికింద్రాబాద్ స్టేషన్ ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకున్న దక్షిణ మధ్య రైల్వే పక్కా ప్రణాళికతో ముందుకుపోతోంది. ఇప్పటికే 50శాతం పనులు పూర్తి కాగా మరో 13 నెలల్లో అంతర్జాతీయ విమానాశ్రయ తరహా హంగులతో అందుబాటులోకి రానుందని అధికారులు వెల్లడించారు. వచ్చే నెలలో దక్షిణం వైపు బేస్‌మెంట్ పనులతో పాటు మల్టీలెవల్ కార్ పార్కింగ్ అందుబాటులోకి రానుందన్నారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా.. ప్రస్తుతం రైల్వేస్టేషన్‌లో నిత్యం లక్షా 97వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. రద్దీ సమయాల్లో గంటకు 23 వేల మంది వరకుంటున్నారు. 2060 నాటికి ఈ సంఖ్య 2 లక్షల 70 వేలకు చేరుకోనుంది. అదే రద్దీ వేళల్లో గంటకు 25 వేల మంది, పండగల సమయాల్లో 32,500కి చేరుకోనుంది. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇందుకోసం 1.65లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం ఉ



త్తరం వైపున్న భవనం 8,027 చదరపు మీటర్లుండగా దాన్ని 22,516 చదరపు మీటర్ల విస్తీర్ణం మేర పెంచారు. దక్షిణం వైపు భవనాన్ని 3,400 చదరపు మీటర్ల నుంచి 14,792 మీటర్లకు విస్తరించారు. 26,604 చదరపు మీటర్ల విస్తీర్ణంతో 3 వేల మంది కూర్చునేలా అభివృద్ధి చేస్తున్నారు.

వివిధ పనుల పూర్తికి నిర్దేశించుకున్న లక్ష్యాలివి..

ఎయిర్ కాన్‌కోర్స్ – ఆగస్టు

ఉత్తరం వైపు ప్రధాన భవనం – సెప్టెంబరు

కవర్ ఓవర్ ప్లాట్‌ఫామ్ – నవంబరు

నాంపల్లి వైపు ఫుట్ ఓవర్ బ్రిడ్జి – జులై

దక్షిణం వైపు ప్రధాన భవనం – జనవరి

## వందేళ్ల చరిత.. దిగుడు బావి ఘనత

సంజీవరెడ్డినగర్: ఒకప్పుడు గ్రామాలతోపాటు నగరంలోనూ పలు ప్రాంతాల్లో బావులు ఉండేవి. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి. సనత్‌నగర్ డివిజన్ మోడల్‌కాలనీలోని పూజిత అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఉన్న పురాతన దిగుడు బావిని పరిరక్షించుకుంటూ సత్ఫలితాలు పొందుతున్నారు నిర్వాహకులు. తమ అవసరాలకు ఈ బావి నీటిపైనే ఆధారపడుతున్నారు. ఈ బావి కారణంగా పరిసరాల్లోని అపార్టుమెంట్లలో కూడా భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయి.

1920లో తవ్వకం: ఈ అపార్ట్‌మెంటును నిర్మించిన నాలుగు ఎకరాల స్థలం ఒకప్పుడు వ్యవసాయ భూమిగా ఉండేది. 1920లో వ్యవసాయం కోసం ఈ బావిని తవ్వారు. మూడు దశాబ్దాల కిందట ఇక్కడ 126 ఫ్లాట్లతో మూడు బ్లాకులుగా అపార్టుమెంట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఇక్కడ ఉన్న బావిని మాత్రం నిర్వాహకులు అలాగే ఉంచి దాని పరిరక్షణపై ప్రత్యేక దృష్టి నిలిపారు. బావిలోకి దిగేందుకు మెట్లను



ఏర్పాటు చేశారు. చుట్టూ మట్టి పడిపోకుండా రాళ్లతో గోడ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ బావిలోని నీటిని ఈ అపార్ట్‌మెంట్ వాసులు ఇప్పటికీ వాడుతున్నారు. ఇక వర్షం పడితే అపార్టుమెంట్ ప్రాంగణంలోని నీరంతా ఈ బావిలోకి వెళ్లేలా పైపులైను ఏర్పాటు చేశారు. ప్రాంగణంలోనే మరో రెండు భారీ ఇంకుడుగుంతల నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో తమ అపార్టుమెంట్‌కు ఇప్పటి వరకు నీటి సమస్య తలెత్తలేదని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.సింగం శ్రీనివాస్‌రావు, భానుకరిణ్, కోశాధికారి సదాశివయ్య తెలిపారు.

## ఘుమఘుమలు పాయె.. దుర్గంధం మిగిలె

హైదరాబాద్: అన్ని రకాల వంటకాలను ఒకేచోట అందిస్తూ.. నగరంలోని వేర్వేరు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న 'ఫుడ్ స్ట్రీట్' ప్రాజెక్టు నీరుగారిపోతోంది. అభివృద్ధికి అవకాశాలు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో దుకాణాలు మూతపడుతున్నాయి. నష్టాలు వస్తుండటంతో వ్యాపారులు తాళం వేసి వెళ్లిపోతున్నారు. నిర్వహణ లేకపోవడంతో ఫుడ్ స్ట్రీట్‌లు బహిరంగ మూత్ర విసర్జన, చెత్తకుప్పలకు నిలయంగా మారుతున్నాయి. శిల్పారామం ఎదురుగా అయ్యప్ప సొసైటీ కూడలి అండర్‌పాస్ పక్కన రహదారిపై 2020లో జీహెచ్‌ఎంసీ మొదటిసారి ఫుడ్ స్ట్రీట్‌ను అభివృద్ధి చేసింది. రూ.కోటి ఖర్చుతో 50 దుకాణాలు ఏర్పాటవగా ప్రారంభించిన




రోజే ప్రాజెక్టు నిలిచింది. బల్దియా ఫుడ్ స్ట్రీట్‌ను అభివృద్ధి చేసిన భూమి తనదంటూ ప్రైవేట్ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో వ్యాపారాలు నిలిపేయాల్సి వచ్చింది.

వెండింగ్ జోన్ల పేరుతో సనత్‌నగర్‌లో నిర్మించిన 18, అమీర్‌పేటలో నిర్మించిన 12 దుకాణాలు ఫలితమివ్వట్లేదు. చిరువ్యాపారులకు కాకుండా రాజకీయ నేతలకు కేటాయించారనే ఆరోపణలున్నాయి. వారు వ్యాపారాలు నిర్వహించకుండా ఎక్కువ అద్దె అడుగుతుండటంతో వ్యాపారులు ఆసక్తి చూపట్లేదు.

ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. నిర్లక్ష్య ఇంజినీర్లు అదే రోడ్డును ఫుడ్ స్ట్రీట్ అభివృద్ధికి ఎంచుకున్నారు. కాలిబాటలపై ఇరువైపులా 12 దుకాణాలు నిర్మించారు. ఇక్కడ దుకాణాలను రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులకు కేటాయించడం, రహదారి రద్దీగా ఉండటంతో ప్రారంభించిన కొన్ని రోజులకే మూతపడ్డాయి.

## ప్రయాణం.. అ'గమ్య'గోచరం!

తాండూరు : డిపోనకు చెందిన అద్దె బస్సు మహబూబ్‌నగర్‌కు బయలుదేరింది. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ కూడలి వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్డు బోల్టు ఊడిపోయింది. వేగంగా వెళుతుండగా ఊడిపోయి ఉంటే ఘోర ప్రమాదమే చోటుచేసుకునేది.

పరిగి డిపోనకు చెందిన బస్సుకు బ్రేకు ఫెయిల్ కావడంతో సంస్థ ఉద్యోగి ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఇటీవల చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు దుర్ఘటనలో 19 మంది మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబాలు ఇంకా ప్రమాదా షాక్ నుంచి తేరుకోలేదు.

ఆర్టీసీ అంటేనే ప్రజలకు ఓ నమ్మకం. గమ్యస్థానాలకు క్షేమంగా చేరుస్తుందన్న విశ్వాసం. సంస్థ పలు రికార్డులను సొంతం చేసుకుంది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆర్టీసీకి నిర్వహణలో లోపాలు అశనిపాతంగా మారాయి. ముఖ్యంగా కాలం చెల్లిన బస్సులను వినియోగిస్తున్నారన్న అపప్రదను మూటగట్టుకుంటోంది. ఆయా డిపోల పరిధిలో 20కిపైగానే ఉంటాయని ఉద్యోగులు చెబుతున్నారు. పనిభారంతోనూ ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు.

**చాలీచాలని సర్వీసులు..**

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించింది. దీంతో నిత్యం మూడు డిపోల పరిధిలో సుమారు లక్ష వరకు ప్రయాణిస్తున్నారు. అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెరగడం లేదు. దీంతో ఉన్నవాటినే నడుపుతున్నారు. కొత్తవి కొంటున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నా.. ఆచరణకు నోచుకోలేదు. పల్లెవెలుగు బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. వాటికే ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి తిప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి. అద్దె బస్సులపై అధికారుల నియంత్రణ కరవైంది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు తిరుగుతున్నారని ప్రైవేటు ఆపరేటర్లు చెబుతున్నారు. ప్రమాదాల నివారణకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు. కొత్త బస్సులు కొనాలి..సంస్థ కాంట్రాక్టు పద్ధతిన అద్దె బస్సులు నడపుతోంది. ఇక్కడే అసలు సమస్య వస్తోంది. సంస్థలో కి.మీ.వారీగా షెడ్యూలు ప్రకారం మెయింటె నెన్సు ఉంటుంది. అద్దె బస్సుల వారు చేస్తారో.. చేయరో తెలియదు.

చురకలు



# పెరిగిన భారం.. మెరుగవని సామర్థ్యం..

కరీంనగర్ :ఈ చిత్రంలోని నియంత్రిక కరీంనగర్ సీతారాంపూర్‌లోనిది. ఈ నియంత్రికపై ఓవర్ లోడ్ ఉందంటూ అదనపు మీటర్ల కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్తు సిబ్బంది తిరస్కరిస్తున్నారు. ఈ ప్రాంతం నగరంలో విలీనమై ఆరేళ్లవుతోంది. పెరుగుతున్న పరిస్థితుల దృష్ట్యా సామర్థ్యం ఎక్కువున్న త్రీఫేజ్ నియంత్రికలను ఏర్పాటు చేయడంలేదు.

గ్రామాల్లో వినియోగించే సింగిల్ ఫేజ్ నియంత్రికలనే ఇప్పటికీ నగరంలో విలీనమైన ప్రాంతాల్లోనూ కొనసాగిస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేయడానికి ముందుకొస్తుంటే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఒప్పుకోవడంలేదు. వినియోగదారులు అదనపు అవసరాలకు విద్యుత్తు సరఫరా కోసం ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో విలీన గ్రామాల్లోనే ఈ పరిస్థితి నెలకొంది.

**విలీన గ్రామాల్లోనే...**

కరీంనగర్ నగరపాలక సంస్థ 2019లో రేకుర్తి, సీతారాంపూర్, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, అల్గునూర్, సదాశివపల్లి, పద్మనగర్, ఆరెపల్లి



గ్రామాలను విలీనం చేసుకుంది. తిరిగి 2025లో కొత్తపల్లి పురపాలక సంఘం, చింతకుంట, మల్కాపూర్-లక్ష్మీపూర్, బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్ గ్రామాలను కలిపారు. అయితే వీటిలో పద్మనగర్ మినహా అన్ని ప్రాంతాల్లో సింగిల్ ఫేజ్ నియంత్రికలనే వినియోగిస్తున్నారు.

**కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి**

సింగిల్ ఫేజ్ నియంత్రికల సామర్థ్యం 15 కేవీఏ నుంచి 25 కేవీఏ ఉంటుంది. ఇందులో 15 కేవీఏపై లోడ్ ఎక్కువైతే 25 కేవీఏ ఏర్పాటు చేస్తారు. దీని సామర్థ్యం మించితే 66 కేవీఏ, 100 కేవీఏ నియంత్రికలు ఏర్పాటు చేయాలి. సాధారణంగా 2 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న మీటర్లు జారీ చేయాలి. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కరీంనగర్‌లో 3 కిలోవాట్ల సామర్థ్యం గల కొత్త మీటర్ కనెక్షన్ జారీ చేస్తున్నారు. అధికారిక రికార్డుల ప్రకారం తక్కువ కనెక్షన్లున్న నియంత్రికపై లోడ్ ఎక్కువగా పడుతోంది. మరి కొన్ని చోట్ల లోడ్ తక్కువగా ఉన్నా వాడకం ఎక్కువగా ఉండి నియంత్రిక సామర్థ్యం మించిపోతోంది. ఏ రకంగానూ కొత్త కనెక్షన్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. దీనికి పరిష్కారంగా అధిక సామర్థ్యం ఉన్న త్రీఫేజ్ నియంత్రికలు ఏర్పాటు చేస్తే వినియోగదారుల ఇబ్బందులు తొలగిపోతాయి.

**మా దృష్టికి రాలేదు** ఇప్పటివరకు నియంత్రిక సమస్య నా దృష్టికి రాలేదు. నేను వచ్చిన నాటి నుంచి ఎవరికీ ఓవర్‌లోడ్ ఉందంటూ మీటర్లు నిలిపివేయలేదు. నియంత్రికల ఏర్పాటును స్థానికులు అడ్డుకుంటున్న మాట వాస్తవమే. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతాం. రఘు, ఏడీఈ కరీంనగర్ రూరల్

# రైతుపైనే రవాణా భారం

గరిడేపల్లి: నియంత్రికల రవాణా ఛార్జీల చెల్లింపు వ్యవహారంపై గందరగోళం ఏర్పడింది. నిధులు ఉన్నా వినియోగించు కోవడం లేదని అధికారులు చెబుతుండగా.. తాము అన్నీ ఇచ్చినా నిధులు జమ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నా నియంత్రిక తీసుకెళ్లిన రవాణా ఛార్జీ నగదు జమ కాలేదని వారు పేర్కొంటున్నారు.

**రవాణా ఛార్జీ ఇలా..**వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్తు నియంత్రిక(ట్రాన్స్‌ఫార్మర్) కాలిపోతే దాన్ని మరమ్మతు కేంద్రానికి విద్యుత్ శాఖ వాహనంలోనే తీసుకెళ్లి తీసుకురావాలి. వాహనాలు లేకపోవడం, ఉన్న ఒక్క వాహనాన్ని శాఖ కార్యాలయ అవసరాలకు వాడుకుంటుండటంతో రైతులు స్వయంగా ట్రాక్టర్లలోనే తరలిస్తున్నారు. సీజన్‌లో నియంత్రిక కాలిపోతే దాన్ని ఎస్‌పీఎం (నియంత్రికల మరమ్మతు కేంద్రం)కు తీసుకెళ్లడానికి ట్రాక్టర్‌లు దమ్ముల్లో ఉంటాయి. ఆ సమయంలో కిరాయి పెట్టి తీసుకు వెళ్తుంటారు. ఇది రైతుకు భారం కావడంతో అప్పటి ప్రభుత్వం రవాణా ఛార్జీలు ఇవ్వడానికి ముందుకు వచ్చింది.ఎస్‌పీఎం ఉన్న మండలంలోని ఏ గ్రామం నుంచి నియంత్రిక తీసుకువచ్చినా రూ.750 చెల్లిస్తారు. ఇతర మండలాల నుంచి తెస్తే రూ.1000 ఇస్తారు. రైతు తాను తెచ్చిన నియంత్రికకు సంబంధించిన టీ నోటు, రైతు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ ఎస్‌పీఎంల వద్ద ఇచ్చి నమోదు చేయిస్తే చాలు. రెండు నెలల్లో ఆ రైతు ఇచ్చిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. నిధులు సైతం స్థానిక డివిజన్ అధికారుల వద్దే ఉంటాయి. వారే మంజూరు చేస్తారు. ప్రభుత్వం ముందుగానే (నియంత్రికల వివరాలు రాగానే) అధికారులకు రూ.లక్ష వరకు నిధులు జమ చేస్తుంది. అవి పూర్తయితే మరో రూ.లక్ష ఇస్తుంది.**ఎక్కడ లోపం..**రైతులు చాలా మంది నియంత్రిక తెచ్చి, టీ నోట్ ఇచ్చి అక్కడ సిబ్బందికి ఎంతో కొంత ఇచ్చి వెంటనే నియంత్రిక తీసుకెళ్తున్నారు. కొద్దిమంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్సులు ఇచ్చి వెళ్తున్నారు. వాటిని అక్కడి సిబ్బంది ఆన్‌లైన్ చేయకపోవడం, సరైన వివరాలతో డీఈలకు పంపకపోవడంతో సమస్య తలెత్తుతుంది. డీఈలకు అందిన వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. అంటే ఎన్ని నియంత్రికలు వచ్చినా రైతుల వివరాలు అందిన వాటికే రెండు నెలల్లోగా నిధులు జమ చేస్తామని డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య తెలిపారు. ఇప్పటికైనా ఆధార్, బ్యాంకు ఖాతా ఇచ్చి నమోదు చేయించుకోవాలని సూచించారు.

# పట్టణ రోడ్లు నడ్డి విరుస్తున్నాయ్!



కోరుట్ల : కోరుట్ల పురపాలక సంఘం పరిధిలోని దారులన్నీ గుంతలమయంగా మారాయి. మొత్తం 33 వార్డుల పరిధిలో జనాభా దాదాపు 90 వేలు. ఏటికేడు గృహాలు, జనాభా పెరుగుతున్నా ఆ స్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి రావడం లేదు. ఏళ్ల తరబడి రహదారులు, మురుగుకాలువల నిర్మాణం జరగక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా చోట్ల సీసీ రోడ్లు కాలం చెల్లిపోగా అయిదేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకం కింద సుమారు 200 కి.మీ.మేర సీసీ, మట్టి రోడ్లను తవ్వి పైపులైన్ వేసి, ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లన్నీ దెబ్బతినగా నాసిరకం మరమ్మతులతో మమ అనిపించారు. గుంతల రోడ్లపై రాత్రి వేళ ఇబ్బందులు తీవ్రమయ్యాయి.

**సర్కారు మారి నిధులు వెనక్కి**

పట్టణంలో ఏ వార్డుకు వెళ్లినా గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయి. గుంతలు, కంకర తేలిన రోడ్లపై ద్విచక్రవాహనదారుల ఒళ్లు హూనమవుతోంది. ప్రకాశంరోడ్, టీచర్స్‌కాలనీ, ఇందిరారోడ్, రథాలపంపు, అయిలాపూర్‌రోడ్, మార్కెట్‌రోడ్, శ్రీనివాసరోడ్, వివేకానందరోడ్, చిన్నతోటవాడ రోడ్లు పట్టణంలో కీలక మార్గాలు. అన్ని చోట్లా కంకర తేలి అధ్వానంగా మారాయి.పట్టణంలోని 33 వార్డుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు మూడేళ్ల క్రితం నాటి ప్రభుత్వం టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.15 కోట్లు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే ఆర్భాటంగా భూమిపూజలు చేశారు. ఇంతలో 2023 చివరలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రద్దయ్యాయి. అప్పటి నుంచి పట్టణంలోని అధ్వాన రహదారులు అభివృద్ధికి నోచుకోకుండా మిగిలిపోయాయి.

చిత్రంలో కనిపిస్తోంది కోరుట్ల పట్టణంలోని ప్రకాశంరోడ్ ప్రధాన మార్గం. గతంలో తారు ఉండగా 2001-02లో సీసీ నిర్మించారు. డిగ్రీ కళాశాల, రెండు జూనియర్ కళాశాలలు, పలు ప్రైవేటు పాఠశాలలు, ఓ కల్యాణ మంటపం, రెండు ఆసుపత్రులకు, రైల్వే స్టేషన్, పలు కాలనీలకు వెళ్లేందుకు ఏకైక ప్రధాన దారిది. 24 ఏళ్లవుతుండటంతో పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది.

**పట్టణంలో ఇలా..**

మొత్తం రహదారుల విస్తీర్ణం: 184.03 కి.మీ.

సీసీ: 100.96 కి.మీ.

బీటీ: 17.06 కి.మీ.

మట్టి: 66.27 కి.మీ.

దెబ్బతిన్నవి: 5.50 కి.మీ. సీసీ రోడ్లు

గడిచిన మూడేళ్లలో నిర్మాణం: 11.50 కి.మీ.

సీసీ నిర్మాణ ప్రతిపాదనలు:

టీయూఎఫ్‌ఐడీసీ కింద రూ.15 కోట్లు

ఎస్‌డీఎఫ్ కింద రూ.4.50 కోట్లు

**ప్రతిపాదనలు పంపించాం**

పట్టణంలో దెబ్బతిన్న సీసీ రోడ్లను గుర్తించాం. సీసీ నిర్మాణాల కోసం సుమారు రూ.20 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే రోడ్ల నిర్మాణాలు చేపడతాం .సురేశ్, మున్సిపల్ డీఈ, కోరుట్ల

# గుట్టను తవ్వి.. జాగాపై కన్నేసి!



ధర్మపురి : ధర్మపురి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పల్లెల శివారులోని గుట్టలు మాయం చేసి ఆ భూమిని ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులు నిఘా పెట్టకపోవడంతో తవ్వకాలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి. ఈ మట్టి దోపిడీతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని స్థానికులు వాపోతున్నారు. ధర్మపురి, బుగ్గారం, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు బహిరంగంగానే కొనసాగుతున్నాయి. స్థానికులు, ఇటుకబట్టీల యజమానులు కలిసి నిత్యం గ్రామాల సరిహద్దునున్న గుట్టలను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పొక్లెయిన్‌తో గుట్టల బండరాళ్లను పగులగొట్టడం, తర్వాత మట్టిని తొలగించడం చేస్తున్నారు.

**పది వరకు మాయం**

ధర్మపురి శివారుతోపాటు నేరెళ్ల, దొంతాపూర్, జైన, తీగలధర్మారం, దోనూర్, రాయపట్నంలో పదేళ్లుగా జోరుగా మట్టి దందా కొనసాగుతోంది. నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో సుమారు 10 గుట్టలు మాయమయ్యాయి. నేరెళ్ల, వెల్గొండ గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో ఎర్రమట్టి గుట్టలున్నాయి. ఈ గుట్టలన్నీ అటవీశాఖ భూముల్లో ఉండగా రాత్రిళ్లు పొక్లెయిన్‌లను పెట్టి తవ్వేస్తున్నారు. ఈ ఎర్రమట్టి ట్రాక్టర్‌కు రూ.6-8 వేలకుపైగా ధర పలుకుతోంది. పునరావాస గ్రామాల్లోని 3 గుట్టలను తోడేయగా మిగిలిన ఈ భూమిని ఆక్రమించుకుంటున్నారు. ధర్మపురి, బుగ్గారం మండలాల్లో సిరికొండ, మద్దునూర్, యశ్వంతరావుపేట, బుగ్గారం, చిన్నాపూర్, గోపులాపూర్‌లోని గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ అక్రమంగా మట్టి తరలిస్తున్నారు.

**పథకం ప్రకారం..**మగ్గిడి, దొంతాపూర్ ప్రాంతాల్లో విలువైన మిగులు భూములున్నాయి. పథకం ప్రకారం పొక్లెయిన్‌తో మట్టిని తవ్వేసి ఆ తర్వాత గుట్టల కింది భూములను ఆక్రమిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. అనుమతులు లేకుండా తరలించే ఈ మట్టి తవ్వకాలపై పూర్తి స్థాయిలో దృష్టి నిలపాల్సిన అవసరం ఉంది.ఈ విషయమై ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్‌ను సంప్రదించగా అక్రమ మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే అక్కడక్కడా అనుమతి ఇస్తున్నామన్నారు. మామూలుగా మట్టి తవ్వకాలకు అనుమతించడం లేదని పేర్కొన్నారు.

# రూ.కోట్ల ఆదాయం.. వసతులు గగనం



మల్యాల : రాష్ట్రంలోనే ప్రసిద్ధ క్షేత్రం.. ఏటా రూ.25 కోట్ల ఆదాయం.. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకొనే కోవెల.. దాతలు అందజేసిన రూ.కోట్ల డిపాజిట్లు, కిలోలకొద్దీ బంగారం, క్వింటాళ్ల కొద్దీ వెండి బ్యాంకుల్లో భద్రం.. అయినా భక్తులకు కనీస వసతులు కల్పించడంలో విఫలం.. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో తరచూ చోటుచేసుకుంటున్న ఘటనలు, భద్రతా లోపంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ సమీపంలోని కల్యాణకట్ట భవనం పక్కన గురువారం విద్యుదాఘాతంతో భక్తురాలు మృతి చెందిన ఘటన.. నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతోంది. ఆలయంతో పాటు పరిసరాల్లో పలుచోట్ల వేలాడుతున్న విద్యుత్తు తీగలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. స్తంభాలకు, ఆలయంలోని సాలార మండపంలోని సీలింగ్, గోడల నుంచి వేలాడుతున్న తీగలు భక్తులకు తగిలే ప్రమాదం ఉన్నా సరిచేయడానికి చర్యలు తీసుకోవడం లేదు.

**ప్రమాదాలు అరికట్టలేరా!**ఆలయంలో ప్రతి సంవత్సరం జరిగే హనుమాన్ పెద్ద, చిన్న జయంతి ఉత్సవాల సమయంలో విద్యుత్తు లైటింగు, ఇతర సామగ్రి కోసం రూ.25 లక్షల వరకు ఖర్చు చేస్తారు. దీంతో పాటు ఏటా విద్యుత్తు సామగ్రి కొనుగోలు కోసం దాదాపు రూ.3 లక్షల వరకు వెచ్చిస్తారు. అయినప్పటికీ పరిసరాల్లో రక్షణ లేని విద్యుత్తు డబ్బాలు, వేలాడే తీగలే కనిపిస్తాయి. కోతుల కారణంగా తీగలు తెగిపోతున్నట్లు అధికారులు చెబుతున్నా సకాలంలో మరమ్మతు చేయించి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను అరికట్టే వీలున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.**నలుగురికి మెమోలు** కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన గోదావరిఖనికి చెందిన వెనుగంటి రాజేశ్వరి గురువారం కల్యాణకట్ట భవనం పక్కన విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం విదితమే. ఈ సమయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై ఆలయంలో పని చేస్తున్న ఓ సూపరింటె ఒడెంట్‌కు నోటీసు, ఎలక్ట్రీషియన్, సెక్యూరిటీ ఉద్యోగి, కల్యాణకట్టలో తలనీలాలు తీసే నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడికి మెమోలు జారీ చేసినట్లు ఈవో శ్రీకాంతరావు తెలిపారు.

# శిథిల భవనాలతో 'భయం.. భయం'

బోధన్ : ప్రతిరోజూ వందలాది మంది ప్రజలకు సేవలందిస్తున్న బోధన్ మున్సిపల్, ప్రభుత్వ దవాఖానా భవనాలు శిథిలావస్థకు చేరాయి. 30 ఏళ్ల కిందట వీటిని నిర్మించారు. ప్రస్తుతం ఇవి వర్షం పడితే ఉరుస్తున్నాయి. ఫలితంగా రెండు భవనాలకు వచ్చే ప్రజలు, రోగులతో పాటు విధులు నిర్వహించే అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బందికి అవస్థలు తప్పడం లేదు. రెండింటిలోనూ సేవలందించడం ఇబ్బందికరంగా మారింది.

**ఇదీ పరిస్థితి..**

బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా దవాఖానాకు నిత్యం 600 వరకు ఓపీ.. 60కి పైగానే ఐపీ ఉంటుంది. ఆసుపత్రిలోని పైఅంతస్తులో ఉన్న గదుల్లోని పైకప్పు పెచ్చులూడి పడుతుండటంతో గతంలోనే వీటిని మూసేశారు. ఉన్న గదుల్లోనే రోగులకు వైద్యం అందిస్తున్నారు. దీంతో కాలానుగుణ వ్యాధుల సమయంలో సరిపడా రూములు లేక ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందించిన పరిస్థితి ఉంది. ఇటీవల ఇంజినీర్లు భవన పరిస్థితిని పరిశీలించారు. వారు



తమ నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఇక మున్సిపల్ కార్యాలయం వర్షం పడితే చిత్తడిగా మారుతోంది. నేలగా తడిగా అవకుండా సిబ్బంది బకెట్లు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు గోడలూ తేమగా మారుతున్నాయి. కొన్నేళ్లుగా వర్షాకాలంలో ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదు. కార్యాలయాన్ని మరో చోటుకు మార్చేందుకు పలు భవనాలను పరిశీలించారు. అవి కార్యకలాపాలు సాగించడానికి వీలుగా లేవని అధికారులు తేల్చడంతో ప్రస్తుతం ఉన్న భవనంలోనే సేవలు కొనసాగిస్తున్నారు. కొత్త భవనాలను నిర్మిస్తే మెరుగైన సదుపాయాలతో కూడిన సేవలందించే అవకాశముంది.

**అధికారులు ఏమన్నారంటే..**

మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరిన విషయాన్ని 'న్యూస్‌టుడే' కమిషనర్ జాదవ్ కృష్ణ వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మరో చోటుకు కార్యాలయాన్ని మార్చేందుకు అనువైన భవనాలు లేవన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిత్ మాట్లాడుతూ.. ఇటీవల ఇంజినీర్లు ఆసుపత్రిని పరిశీలించి అందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేశామన్నారు. భవనానికి మరమ్మతులు చేస్తారా?, కొత్త భవనానికి నిధులు మంజూరు చేస్తారా? అనేది తేలాల్సి ఉందన్నారు.

# పంట చెడి.. గుండె తడి

బోధన్: వరస ముంపునకు గురైన పంట చేలు చేతికి రాకుండా పోయాయి. నియోజకవర్గంలోని బోధన్, సాలూర, నవీపేట్, రెంజల్ మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పది రోజుల కిందట అల్పపీడన ప్రభావంతో ఎగువన మహారాష్ట్రలో కుండపోత వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో గోదావరి పరీవాహకం, శ్రీరామసాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు పోటెత్తాయి. పలు మండలాల్లో వరి, సోయా, పత్తి పైర్లు నీట మునిగాయి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా గత గురువారం రెండోసారి పైర్లు ముంపు బారినపడ్డాయి. నాలుగైదు రోజులు నీట మునగడంతో పైర్లు కుళ్లిపోయాయి. కళతప్పిన చేలను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు.

ఉమ్మడి బోధన్ మండలంలోని కొప్పర్గ, హంగర్గ, ఖండ్‌గాం, బిక్నెల్లి, సిద్దాపూర్, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్సా, మందర్న, రెంజల్ మండలంలోని కందకుర్తి, బోర్గాం, నీలా, తాడ్‌బిలోలి, నవీపేట్ మండలంలోని అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ, యంచ, బినోలా నాళేశ్వర్, తుంగిని గ్రామాల్లో వేల ఎకరాలు జలమయం అయ్యాయి. వరి పొట్ట దశలో ఉండగా, సోయా కాయలు పాలు పోసుకుంటున్నాయి. పత్తి కాయ కాస్తోంది. వరుసగా రెండుసార్లు ముంపునకు గురవగా, చేతికందాల్సిన పైర్లన్నీ కుళ్లిపోయాయి. వరద తగ్గిన తర్వాత చేలకు వెళ్లిన రైతులు వాటిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. సుమారు 5 మండలాలపై తీవ్ర ప్రభావం ఉండగా, 26 వేల ఎకరాల్లో పూర్తినష్టం వాటిల్లింది. అరటి, కూరగాయలు 330 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

**ఒక్క ఎకరా మిగల్లేదు..: ఇర్వంత్‌రావు, హంగర్గ**



ఈ ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో సోయాబీన్ వేశా. ఎకరాకు రూ.25 వేల పెట్టుబడి పెట్టా. పైరు కాయ దశకు రాగా గోదావరి వరదలు, ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో పైరంతా మునిగింది. ఒక్క ఎకరా మిగల్లేదు. పెట్టుబడి, పంట ఆదాయం కలిపి మొత్తం రూ.20 లక్షల నష్టం వాటిల్లింది. మా కుటుంబం ఇప్పట్లో కోలుకునే పరిస్థితిలో లేదు.

**అప్పుల్లో కౌలు రైతులు: లక్ష్మణ్, హంగర్గ**

భూమి కౌలుకు తీసుకుని మూడెకరాల్లో సోయా, రెండెకరాల్లో వరి వేశా. ఒక ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టా. రెండు పంటలూ వరద పాలయ్యాయి. ఖరీఫ్‌లో పంట చేతికందితేనే రబీలో పంట సాగు చేసే పరిస్థితి. పూర్తి పంట నష్టంతో అప్పులే మిగిలాయి. బ్యాంకులో, ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చి పెట్టుబడి పెట్టా. శ్రమంతా నీటిపాలైంది. ప్రభుత్వం పరిహారమివ్వాలి. యాసంగికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి.

## ఇంటి వద్దకే కార్గో సేవలు

నంద్యాల : రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) కార్గో సేవల ద్వారా పార్సిళ్లు, సరకులను తక్కువ ధరకు రవాణా చేస్తోంది. ప్రైవేటు కొరియర్ సేవలతో పోలిస్తే ఈ సేవలు చౌకగా ఉంటాయి. ఇంటి వద్దకే డెలివరీ, బీమా సౌకర్యం వంటి అదనపు సౌకర్యాలు అందిస్తుంది. బస్సుల ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తూ ఆదాయం ఆర్జిస్తున్న ఆర్టీసీ.. ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల పెంపుపై దృష్టి సారించింది. నష్టాలను పూడ్చుకోవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా కార్గో సేవలను విస్తరిస్తోంది.

**2017లో ప్రారంభం**

ఆర్టీసీ సంస్థ 2017లో సరకు రవాణాకు శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని నంద్యాల, డోన్, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు డిపోల్లో డోర్ డెలివరీ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే మిగతా డిపోలకూ ఈ సేవలు విస్తరించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కార్గో సేవలపై ప్రజలు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతోంది. ఈ సేవలకు ప్రభుత్వరంగ సంస్థలు, విభాగాలు సహకరిస్తుండడంతో పార్సిల్ సర్వీసు విజయవంతమవుతోంది.




**ఇతర రాష్ట్రాలకు సైతం**

ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బళ్లారి, రాయచూరు వంటి ఇతర రాష్ట్రాలకు విత్తనాలు, విడిభాగాలు, ఔషధాలు, పూలు, పండ్లు, కూరగాయలు, టైర్లు, అరటి ఆకులు వంటి సరకులను వేగవంతంగా సరఫరా చేస్తూ కార్గో ప్రత్యేకత సంతరించుకుంది. మనం పంపిన పార్సిల్‌ను ట్రాకింగ్ చేసుకునే అవకాశం ఉంది. పార్సిల్ ఎక్కడ ఉందో, ఎప్పుడు డెలివరీ అవుతుందో ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు.

## గుట్టల్లో 'భూ'చోళ్లు

కదిరి : పట్టణ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. స్థలాలకు విలువ పెరుగుతోంది. దీంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు వాలిపోతున్నారు. గుట్టలు, శ్మశానవాటికలను సైతం వదలట్లేదు. రాత్రికి రాత్రి చదును చేస్తున్నారు. తెల్లారేసరికి తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. ఎవరైనా ప్రశ్నించినా.. అడ్డుకున్నా దాడులకు తెగబడుతున్నారు. వాటికి పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారు. ఈ దందా జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతున్నా.. సంబంధిత అధికారులు కేవలం నోటీసులు, హెచ్చరికలతో సరిపెడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తాయి.

**ఆక్రమణలు ఎక్కడెక్కడంటే..**

నల్లచెరువు మండలం అల్లుగుండు పంచాయతీ సర్వేనంబరు 01లో కదిరికి చెందిన ఓ వ్యక్తి పందికోన వద్ద వాగును చదును చేసి రెండెకరాల్లో మామిడి మొక్కలు నాటారు. అధికారులు నోటీసు ఇచ్చి సరిపెట్టేశారు. కదిరి మండలం సున్నపుగుట్టతండా వద్ద అదే గ్రామానికి




చెందిన ఓ వ్యక్తి సర్వేనంబరు 148లో ఎకరా భూమిని ఆక్రమించుకుని పండ్ల మొక్కలు, ఉలవ పంట సాగు చేశాడు. ఆయన్ను కార్యాలయానికి పిలిపించి హెచ్చరించి పంపేశారు. ఆ తరువాత అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో మళ్లీ పంటలు సాగు చేస్తున్నాడు. తాజాగా సర్వేనంబరు 148-2లో దాదాపు మూడెకరాలు ఉన్న గుట్టను ఆదివారం రాత్రి చదును చేసి ప్లాట్లు వేసేందుకు ఓ వ్యక్తి సిద్ధమయ్యాడు. స్థానికులు అడ్డుకోవడంతో పరారయ్యారు. ఈ ప్రాంతంలో ఎకరా భూమి కోటి రూపాయలకుపైనే పలుకుతోంది.

**అన్యాక్రాంతం కాకుండా చర్యలు**

ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత గ్రామరెవెన్యూ అధికారులు, తహసీల్దార్లపై ఉంది. సర్కార్ భూములను గుర్తించి, అవి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలి. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాలు, వాటిని అడ్డుకోవడానికి తీసుకున్న చర్యలపై నివేదిక పంపాలని తహసీల్దార్లను ఆదేశిస్తాం. ఆక్రమణలను అడ్డుకోవడానికి తీసుకుంటున్న చర్యలను తెలియజేయాలని సూచిస్తాం.

సూర్యనారాయణరెడ్డి, డీఆర్ఓ, పుట్టపర్తి

## ఆస్తులతో సెల్‌గాటం



చిత్తూరు : సదుం మండలం జోగివారిపల్లిలో 470 ఆస్తులు గుర్తించారు. అందులో 360 ఆస్తులకు ఒకే సెల్ నంబరు నమోదు చేయడంతో ఆ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. - చౌడేపల్లి మండలం పెరికిదొనలో 447లో 306 ఆస్తులకు ఒకే చరవాణి నమోదు చేశారు. గుడిపాల మండలం పానాటూరులో 418, యాదమరి మండలం 12 కమ్మపల్లిలో 252, పూతలపట్టులో 562 ఆస్తులకు ఒకే నంబరు నమోదు చేయడంతో కార్యదర్శులకు నోటీసులిచ్చారు. గ్రామీణ ప్రజల ఆస్తులతో కొందరు పంచాయతీ కార్యదర్శులు చెలగాటమాడుతున్నారు. స్వర్ణ పంచాయతీ యాప్‌లో ఒకరి ఆస్తులకు మరొకరి ఫోన్ నంబర్లు జోడించారు. కార్యదర్శులు తప్పుడు నంబర్లు నమోదు చేసిన విషయం వాస్తవమేనని, తప్పులు సరి చేస్తున్నట్లు డీపీవో సుధాకర్‌రావు తెలిపారు. కార్యదర్శులు ఆస్తి యజమానితో మాట్లాడి ఫోన్ నంబరు, ఆధార్ తీసుకోవాలి. అయితే కొందరు కార్యదర్శులు ఒకే చోట కూర్చుని ఇష్టం వచ్చినట్లు మ్యాపింగ్ చేయడంతో పరిస్థితి తలెత్తింది.

# శునకాలు.. ఇక షెల్టర్లకే



పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, తిరుపతి నగర పాలికలు, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, నగరి, కుప్పం, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో 27,350 కుక్కలు ఉన్నాయి. ఏటా నగరపాలక, పురపాలికల అధికారులు వాటి సంతతి పెరగకుండా వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేపడుతున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే నగరాలు, పట్టణాల్లో వీటి సంతతి మాత్రం తగ్గకపోగా పెరుగుతోంది.

తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో గతేడాది డిసెంబరు 19న విష్ణుమహల్ థియేటర్ నుంచి కార్వేటినగరం రోడ్డు వరకు 27మందిని పిచ్చికుక్క కరిచింది. కుక్కకాటుకు గురైన వారంతా ఆస్పత్రికి వచ్చి ఏఆర్‌వీ, హిమినోగ్లోబిన్ ఇంజెక్షన్లు వేయించుకున్నారు. కొందరికి గాట్లు పెద్దవి కావడంతో రెండు, మూడు కుట్లు వేశారు.

తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలం కయ్యూరు ఎస్టీ కాలనీకి చెందిన రెండేళ్ల బాలుడు సుమన్ ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడి చేశాయి. ముఖంపై గాట్లు పడటంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం.

చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలో రోజుకు నాలుగైదు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నారు.

దేశ అత్యున్నత న్యాయస్థానం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్సు, రైల్వేస్టేషన్‌లోకి శునకాలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఆయా సంస్థల ప్రాంగణంలోకి అవి చొరబడకుండా కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. నోడల్ అధికారులు క్రమం తప్పక తనిఖీలు నిర్వహించి సమస్య తలెత్తకుండా చూడాలని ఉత్తర్వులు ఇచ్చింది. నోడల్ అధికారుల వివరాలు ఆయా ప్రాంగణాల్లో ప్రవేశ ద్వారం వద్ద ప్రదర్శించాలని సూచించింది. అదే సమయంలో జన సమర్థ, బహిరంగ ప్రదేశాల్లో సంచరించకుండా చూడాలని ఆదేశాలిచ్చింది.

**మందులు పర్వాలేదు..**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు ఉన్నాయి. ఒక్కో సమయంలో కుక్క కాటు అధికంగా జరిగిన సందర్భంలో పక్కనున్న ఆసుపత్రుల నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

నగరాలు, పురపాలికల్లో కుక్కల వివరాలు

చిత్తూరు జిల్లా: 9,250

తిరుపతి జిల్లా: 18,100

**విధిగా పాటించాల్సిందే..**

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి అన్ని నగర, పురపాలికలు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని నగర, మున్సిపాలిటీల్లో పునరుత్పత్తి జరగకుండా స్టెరిలైజేషన్ ప్రక్రియ కోసం కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే అన్ని కేంద్రాల్లో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

నాగరాజు, ఆర్డీ, అనంతపురం

# అక్షరం.. ఆకట్టుకునే అందం



శ్రీకాళహస్తి: ఉపాధ్యాయులకు చేతిరాత శిక్షణ అని వినగానే కాస్తంత ఆశ్చర్యం వేస్తోంది కదూ. నిజమే ఓ విద్యార్థి తన చేతిరాత మెరుగుపరుచుకుంటే అతనొక్కడే లబ్ధి పొందుతాడు. అదే ఓ ఉపాధ్యాయుడు నేర్చుకుంటే వందమంది విద్యార్థుల చేతిరాతలో మార్పు తీసుకువచ్చే అవకాశముంది. దీన్ని గమనించిన బాబుఅగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి ఆమె నేర్చుకోవడంతో పాటు పురపాలక సంఘం పరిధిలోని సహచర ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణకు సంకల్పించారు. ఇందుకు 70 మంది హాజరవడం విశేషం.

**చేతిరాత బాగలేక సిగ్గుపడ్డా**

మాది గుంటూరు. గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నా. 2016 జాతీయ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందా. అయినా నా చేతిరాత పిల్లలకు అంతగా అర్థమయ్యేది కాదు. దీంతో సిగ్గుపడ్డా. దీనిపై పలు దఫాలుగా పరిశోధనలు చేయడం, చేతిరాత మెరుగు పరుచుకునేందుకు ఎంతో శ్రమించడంతోపాటు ఆ కష్టాన్ని పుస్తకరూపంలోకి తీసుకువచ్చా. పలు జిల్లాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి మార్పు తీసుకువచ్చా. ఇప్పటి వరకు 77 వేల మందికి శిక్షణ ఇచ్చా.

వి.రామ్మోహన్‌రావు, చేతిరాత శిక్షకులు, గుంటూరు

**నా వంతు బాధ్యత**

దసరా సెలవుల్లో గుంటూరులో రెండ్రోజుల శిక్షణ తీసుకున్నా. ఎంతో మార్పు వచ్చింది. ఇదే శిక్షణ పిల్లలకు ఇస్తున్నా. శిక్షణ ఉపాధ్యాయులకు ఇస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని గుర్తించా. ఉపాధ్యాయుల సహకారం, కుటుంబీకుల ప్రోత్సాహంతో దాదాపు రూ.80 వేల వ్యయంతో శిక్షణకు సిద్ధపడ్డా. గుంటూరు నుంచి శిక్షకులను పిలిపించడంతో పాటు వసతులు కల్పించా.

శ్రీదేవి, హెచ్‌ఎం, పురపాలక పాఠశాల

**అక్షరాలు అందంగా ఉండాలి**

అక్షరాలు అందంగా ఉంటే ఆ గుర్తింపు వేరే విధంగా ఉంటుంది. నా అక్షరాలు బాగుంటాయని భావిస్తూ వచ్చా. శిక్షణ తీసుకున్నాక నేనే నమ్మలేని విధంగా మార్పు వచ్చింది. ఉపాధ్యాయుల అనుమతితో ఈ శిక్షణలో పాల్గొన్నా.

శాంతి, ఏవో, ఆర్డీవో కార్యాలయం

# నిబంధనలకు పాతరేసి.. ప్రమాదాలకు తెరతీసి!



అనంతపురం: ధనార్జనే ధ్యేయంగా జిల్లాలోని పలు క్వారీల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. పేలుడు పదార్థమైన అమ్మోనియం నైట్రేట్‌ను అత్యంత ప్రమాదకర రీతిలో అక్రమ రవాణా చేస్తున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా రసాయనాన్ని ఎక్కడికెక్కడ నిల్వ ఉంచుతున్నారు. చౌకగా క్వారీల్లో పేలుళ్లు చేపట్టడానికి నిర్వాహకులు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా హైదరాబాద్ నుంచి జాతీయ రహదారిపై టన్నుల కొద్దీ అమ్మోనియం నైట్రేట్‌ను బొలేరో వాహనాల్లో తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో ఏమాత్రం ప్రమాదం జరిగినా ప్రాణనష్టం సంభవిస్తుంది. పామిడి మండలంలోని ఓ కంకర క్రషర్‌లో నిల్వ ఉంచిన 5 టన్నుల అమ్మోనియం నైట్రేట్‌ను పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. బాధ్యులను అదుపులోకి తీసుకుని విచారించగా జిల్లాలోని చాలా క్వారీలకు అక్కడి నుంచే పేలుడు పదార్థాన్ని సరఫరా చేస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

**తమిళనాడు కంపెనీ పేరుతో..**

అమ్మోనియం నైట్రేట్‌ను వినియోగించాలంటే ముందుగా పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నుంచి అనుమతులు తీసుకోవాలి. లైసెన్సు ఉన్న వాళ్లు మాత్రమే విక్రయించాలి. అనుమతులు ఉన్న తమిళనాడు కంపెనీ పేరుతో అమ్మోనియం నైట్రేట్‌ను కొనుగోలు చేసి జిల్లాలో నిల్వ చేస్తున్నారు. ఇందుకుగాను సదరు కంపెనీకి పెద్దమొత్తంలో కమీషన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. తాడిపత్రికి చెందిన ఓ క్వారీ నిర్వాహకుడు తెలంగాణ నుంచి అమ్మోనియం నైట్రేట్‌ను తీసుకొస్తున్నారు. పామిడిలో నిల్వ చేసి రాత్రి వేళల్లో ఇతర క్వారీలకు సరఫరా చేస్తున్నారు.

లైసెన్సు ఉండి అనుభవం ఉన్న వ్యక్తుల ఆధ్వర్యంలో కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉంటుంది. కొందరు క్వారీల నిర్వాహకులు వంద అడుగుల వరకు రంధ్రాలు చేయించి.. అందులో అమ్మోనియం నైట్రేట్‌ను నింపి పేలుళ్లకు పాల్పడుతున్నారు. దీనివల్ల చుట్టుపక్కల భూమి కంపించడంతో పాటు వాయుకాలుష్యానికి దారి తీస్తోందని సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఆంక్షలు ఉన్నా..**

సాధారణంగా అమ్మోనియం నైట్రేట్‌ను ఎరువుల తయారీలో ఉపయోగిస్తారు. అలాగే మైనింగ్, భవన నిర్మాణ రంగాల్లో పేలుళ్ల కోసం వాడతారు. కొనుగోలు, రవాణా, వినియోగంపై కఠిన ఆంక్షలున్నాయి. తయారీకి పలు అనుమతులు కావాలి. జనావాసాల్లో నిల్వ చేయకూడదు. ఇతర రసాయనాలతో కలిస్తే చాలా ప్రమాదకరం. జిల్లాలోని పామిడి, వజ్రకరూరు, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లోని పలు కంకర క్వారీల్లో పేలుళ్ల కోసం భారీగా ఉపయోగిస్తున్నారు.

## వారు రమ్మంటారు.. వీరు రామంటారు!

ఉంగుటూరు : ఉపాధి పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి.. పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. శ్రామికులు తప్పనిసరిగా ఈకేవైసీ చేపట్టాలని ఆదేశించాయి. జిల్లాలో కొన్నాళ్ల కిందట ప్రక్రియ ప్రారంభం కాగా, నేటికీ మందకొడిగా సాగుతోంది. ఉంగుటూరులో అత్యధికంగా 89.01 శాతం, నూజివీడులో అత్యల్పంగా 72.28 శాతం పూర్తయింది.

**దొంగ మస్తర్లకు చెక్**

ఇప్పటి వరకు పని ప్రదేశంలో శ్రామికులను గ్రూపుగా ఫొటో తీసి హాజరు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ ఆధారిత హాజరు(ఫేషియల్ రికగ్నైజ్డ్ అటెండెన్స్) వేయాలని నిర్ణయించింది. తద్వారా జాబ్ కార్డులన్నింటికీ ఈకేవైసీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. త్వరలో ఈకేవైసీ పూర్తయితేనే పని కల్పిస్తారు. ఆపై దొంగ మస్తర్లకు అవకాశం ఉండదు.



**వేధిస్తున్న సహాయకుల కొరత**

ఉపాధి హామీ పథకంలో కీలకంగా వ్యవహరించే క్షేత్ర సహాయకుల (ఫీల్డ్ అసిస్టెంట్లు) కొరత వేధిస్తోంది. పలువురు అవకతవకలకు పాల్పడి సస్పెండ్ కాగా.. మరికొందరు నిర్దేశిత లక్ష్యాలు పూర్తి చేయలేక విధులకు దూరమయ్యారు. ఇంకొందరు వ్యక్తిగత కారణాలతో మానేశారు. దీంతో చాలా చోట్ల ఖాళీలు ఏర్పడ్డాయి. ఆయా ఖాళీలను మేట్లతో భర్తీ చేశారు. దీంతో ఈకేవైసీ ప్రక్రియ నెమ్మదించింది. జాబ్‌కార్డు ఉండి పనులకు రానివారు ఈకేవైసీకి ఆసక్తి చూపడం లేదు. అలాగని జాబ్‌కార్డు అవసరం లేదని అంగీకార పత్రమివ్వడానికీ ముందుకు రావడం లేదు. జాబ్‌కార్డున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని డ్వామా పీడీ సుబ్బారావు స్పష్టం చేశారు.

**జిల్లా వివరాలిలా..**

మొత్తం శ్రామికులు: 6,49,871

ఈకేవైసీ పూర్తి: 4,91,063

క్రియాశీలకం: 5,34,144

పూర్తి: 4,40,675

## ఆసుపత్రులు.. కొన్ని గంటలే సేవలు!

అనంతపురం : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీ) కొందరు వైద్యులు కొన్ని గంటల మాత్రమే విధులు నిర్వహించి వెళ్తున్నారు. కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పని చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల ఉదయం 10, 11 గంటలైనా రావటం లేదు. మరికొందరు 9 గంటలకు వచ్చినా రెండు లేదా మూడు గంటలు ఉండి ఓపీకి వచ్చిన రోగులను చూసి వెళ్లిపోతున్నారు. ఇదే తీరుగా సిబ్బంది సైతం వెళ్తున్నారని రోగులు వాపోయారు అనంత నగరంలోని కొన్ని కేంద్రాలను పరిశీలించగా ఈ పరిస్థితి నెలకొంది. ఆయా కేంద్రాల్లో వివిధ పరీక్షలు నిర్వహించే కిట్లు, వారికి అందజేసే మందులు అందుబాటులో లేకపోవటం గమనార్హం.

అనంతపురంలోని నాయక్‌నగర్ యూపీహెచ్‌సీలో వైద్యురాలు ఉదయం 10.30 గంటలైనా రాలేదు. హమాలీకాలనీలోని కేంద్రంలో ఉదయం 10.40 గంటలకు వచ్చారు. అక్కడి సిబ్బంది రోగులతో మాట్లాడి వారి సమస్యలను బట్టి ఔషధాలు ఇవ్వడం కనిపించింది.

కొన్ని కేంద్రాల్లో వైద్యులు రాలేదని ఆరా తీస్తే డీఎంహెచ్‌వో కార్యాలయానికి, క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారని సిబ్బంది చెప్పడం గమనార్హం. చాలా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది.

దివ్యాంగులు, వృద్ధులకు చక్రాల కుర్చీలు అందుబాటులో లేవు. కొన్నిచోట్ల కొత్తవి వచ్చినా మూలకు ఉంచారు.

నగరంలో కేంద్రాల సంఖ్య : 10

రోజు వారీగా ఓపీకి వస్తున్నవారు: 40 నుంచి 80



**ఇవి అందుబాటులో ఉండాలి**

కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు చేయాలి. రోగులకు అవసరమయ్యే 174 రకాల ఔషధాలు అందుబాటులో ఉంచాలి.

కొన్ని చోట్ల రక్తపోటు నియంత్రణ మందులు అందుబాటులో లేవు. కామెర్ల పరీక్ష చేసేందుకు అవసరమైన కిట్లు ఉండకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**విచారించి.. చర్యలు తీసుకుంటాం**


డాక్టర్ ఈ.బి.దేవి, డీఎంహెచ్‌వో

వైద్యులు, సిబ్బంది విధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉండాలి. సమాచారం లేకుండా కేంద్రాల్లో లేకపోతే చర్యలు తప్పవు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుటాం.

## స్మార్ట్ కార్డు తీసుకున్నారా?

పాయకరావుపేట: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఇందులో భాగంగా కొత్తగా స్మార్ట్ కార్డులను మూడు నెలల కిందట అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి పంపిణీ బాధ్యతను గ్రామ సచివాలయాల సిబ్బందికి, రేషన్ డీలర్లకు అప్పగించారు. మూడు నెలలు దాటుతున్నా.. ఇప్పటికీ వేల సంఖ్యలో కార్డులు ఉండిపోయాయి. వీటిని తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాలేదు. వలస వెళ్లిన వారు కార్డులు తీసుకోవడం ఇబ్బందిగా మారుతోంది.

అనకాపల్లి మండల పరిధిలో అత్యధికంగా 4,220 మంది లబ్ధిదారులు కార్డులు తీసుకోలేదు. అచ్యుతాపురంలో 2,168, ఎలమంచిలిలో 1,740, చోడవరంలో 1,632, నర్సీపట్నంలో 1,466, పాయకరావుపేటలో 1,302, మాడుగులలో 1,228, రావికమతంలో 1,117, బుచ్చెయ్యపేటలో 1,112, పరవాడలో 1,092, రాంబిల్లిలో




1,073, కోటవురట్లలో 1,053, గొలుగొండలో 1,015, కశింకోటలో 1,004, నాతవరంలో 996, నక్కపల్లిలో 935, కె.కోటపాడులో 883, ఎస్.రాయవరంలో 813, రోలుగుంటలో 701, చీడికాడలో 655, దేవరాపల్లిలో 544, మునగపాకలో 443 మంది నేటికీ కార్డులు తీసుకోలేదు. కార్డుదారులు ఉన్నారా.. లేరా అని అధికారులు ఆరా తీస్తున్నారు. కార్డులు తీసుకోవాలంటే లబ్ధిదారుల్లో ఎవరైనా ఒకరు వచ్చి బయోమెట్రిక్ వేసి ఓటీపీ చెప్పాలి. తద్వారా బోగస్ కార్డులుంటే బయటపడుతుంది. పంపిణీ కాకుండా ఉండిపోయిన కార్డులను తహసీల్దారు కార్యాలయాల్లో అందజేయాలన్న ఆదేశాలు వచ్చాయి. నెలాఖరులోగా తీసుకోకుంటే వెనక్కు పంపేస్తామని పౌరసరఫరాల జిల్లా అధికారి మూర్తి చెప్పారు.

## వద్దన్నా వినరే

పాయకరావుపేట: తాండవ నది ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. పోలవరం కాలువ తవ్వకాల్లో వచ్చిన గ్రావెల్ తీసుకొచ్చి నది ఒడ్డున గుట్టలుగా వేస్తున్నారు. అయిదేళ్ల క్రితం ఎడమ కాలువ తవ్వకంలో భాగంగా గ్రావెల్‌ను తీసుకొచ్చి పట్టణంలోని తాండవ చక్కెర కర్మాగారం సమీపంలోని భూమి ఆనకట్టకు కొద్దిదూరంలోనే నదిలో గ్రావెల్‌ను గుట్టలుగా వేశారు. దీంతో ఆనకట్ట ముందు భాగంలో నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గింది. భూమి కాలువలోకి నీరు సకాలంలో చేరడం లేదు. నది వెడల్పు బాగా తగ్గిపోయింది. కొన్నేళ్ల నుంచి ఇదే సమస్య రైతులను వేధిస్తోంది. ఇటీవలే హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి రైతులు, జల వనరుల శాఖ అధికారులు తీసుకెళ్లారు. దీనిపై ఆమె భూమి ఆనకట్ట వద్ద గ్రావెల్ తొలగించాలని, భవిష్యత్తులో ఇక్కడ గ్రావెల్ వేయవద్దని పోలవరం గుత్తేదారులకు ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ ఏమాత్రం మార్పు రాలేదు. తాజాగా కొన్ని రోజుల నుంచి కొండలను తవ్వగా వచ్చిన గ్రావెల్‌ను లారీలపై తీసుకొచ్చి ఇక్కడే వేస్తున్నారు. దీంతో నదిలో మరింత పూడిక పెరిగే అవకాశముందని అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. భూమి ఆనకట్ట ఎగువభాగం పూర్తిగా పూడికతో నిండిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై జల వనరుల శాఖ డీఈ ఎంవీ సురేష్‌కుమార్‌ను వివరణ



కోరగా గ్రావెల్ నది ఒడ్డున వేయకుండా చూస్తామని పేర్కొన్నారు.

**మారేడిపూడిలో ఆగని దందా**

మారేడిపూడిలో గ్రావెల్ దందాకు అడ్డుకట్ట పడలేదు. సర్వే నంబరు 353లోని గెడ్డ పోరంబోకు స్థలంలో ఉన్న గ్రావెల్‌ను కొద్దిరోజులుగా రాత్రివేళల్లో ఇష్టానుసారంగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. కొంతమంది ముఠాగా ఏర్పడి చీకటిపడగానే యంత్రాలు, వాహనాలతో వాలిపోతున్నారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్ తవ్వేసి తరలించేస్తున్నారు. గ్రామస్థులు పలుమార్లు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. వీఆర్వోకు సమాచారం ఇస్తే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి గస్తీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## దశ తిరగనున్న పర్యాటకం

విశాఖపట్నం: గూగుల్ సిటీగా, ఏఐ నగరంగా విశాఖ రూపుమారనుంది. ఇదే తరుణంలో పర్యాటకంగానూ ఎన్నో సొబగులు పెరగనున్నాయి. విశాఖలో ఈ నెల 14, 15న 'సీఐఐ భాగస్వామ్య సదస్సు'లో ఆతిథ్య, పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు వస్తాయని అంచనా. విశాఖ కేంద్రంగా రూ.పది వేల కోట్ల ప్రాజెక్టుల ఆరంభించాలన్నది లక్ష్యం. జిల్లాలో పెట్టుబడులకు అనువైన అంశాలపై పర్యాటకశాఖ ప్రధాన కార్యాలయంలో పెట్టుబడిదారులు సంప్రదిస్తున్నారు. ఎక్కువగా భీమిలి నియోజకవర్గం, ఆర్‌కే బీచ్ ప్రాంతాలపై దృష్టిసారించారు. గమ్య నగరం విశాఖ సహజసిద్ధ వనరులకు పెట్టింది పేరు. చుట్టూ కొండలు, అనువైన సముద్ర తీరం పర్యాటకానికి ఊతమిస్తుంది. నగరీకరణ పోకడల నేపథ్యంలో ఆ తరహా ప్రాజెక్టుల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారు. పర్యాటకశాఖ అధికారులు అందుకు అనువైన స్థలాలు ఎంపిక చేసి నివేదికలను కలెక్టరుకు అందించారు. ప్రస్తుతం 300 ఎకరాలుదాగా.. మరో 300 ఎకరాలు అదనంగా అవసరమవుతున్నాయి. భీమిలి మండలం అన్నవరంలో రూ.వందల కోట్లతో ఇప్పటికే ఒబెరాయ్, మేఫెయిర్ ప్రాజెక్టులు సాగుతున్నాయి. వీటితో పాటు మరికొన్ని సొబగులు రానున్నాయి. భీమిలి మండలం కొత్తవలస కొండపై రూ.1000 కోట్ల పెట్టుబడితో భారీ పర్యాటక ప్రాజెక్టు రానుంది. దీనికి సీఐఐ సదస్సులో ఒప్పందం జరగనుంది.

ఉజ్వల భవిష్యత్తు: విశాఖ కేంద్రంగా గూగుల్ డేటా సెంటర్, ఏఐ సెంటర్లు, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల కార్యకలాపాలు విస్తరిస్తే పర్యాటక రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పర్యాటక, ఆతిథ్యరంగంలో భారీ పెట్టుబడులను ఆశించొచ్చు. ఆ దిశగానే ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుంది. అందుకు తగ్గ వనరులు విశాఖలో ఉన్నాయి.

# పొగాకు కొనుగోళ్లలో దళారులు



ఒంగోలు : రైతులు, వ్యాపారులకు మధ్య వారధిగా ఉంటూ పొగాకు పంట ఉత్పత్తికి గిట్టుబాటు ధర వచ్చేవిధంగా బోర్డు క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. తద్వారా బోర్డుకు కూడా వారిద్దరి నుంచి సర్వీసు ఛార్జీ వస్తోంది. సాగు చేసిన పంటను పూర్తిగా వేలం కేంద్రాల ద్వారానే అమ్మేవిధంగా ఒప్పందం ఉంటుంది. పొగాకు పంటను వ్యాపారి కొనాలన్నా..రైతు అమ్మాలన్నా అంతా బోర్డు ద్వారానే జరగాలి. ఇలాంటి నిబంధన ఇతర ఏ పంటలకు ఉండదు. ఏటా రైతు చేతికి పంట ఉత్పత్తి వచ్చే సమయం నుంచే బయట కొనుగోలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు బోర్డు విజిలెన్స్ బృందాలు నియమిస్తోంది. ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న పొగాకు పంటను పట్టుకోవడమే వారి విధి. ఈ ఏడాది ఆరంభం నుంచే దళారులు రైతుల ఇళ్లకెళ్లి అనాధికార కొనుగోళ్లు జరిపారు. ఫిర్యాదులున్నా విజిలెన్స్ అధికారులు అక్రమ కొనుగోళ్లను కట్టడి చేయడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో అమ్మకాలు తుది దశకు చేరుకున్నాయి. గత వారం రోజులుగా దళారులే నేరుగా వేలం కేంద్రాల్లోకి ప్రవేశించారు. రైతుల నుంచి బహిరంగంగా తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యవహారమంతా బోర్డు అధికారులకు తెలిసే జరుగుతున్నా వారు మాత్రం కట్టడి చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలున్నాయి. పైగా ప్రైవేటు కొనుగోళ్ల నిమిత్తం వ్యాపారులను కేంద్రాల్లోకి అనుమతించకూడదు. అయినప్పటికీ అక్రమ కొనుగోళ్లు మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతున్నాయి

**పట్టించుకోని బోర్డు అధికారులు**

ప్రస్తుతం జిల్లాలోని అన్ని కేంద్రాల్లో కిలో కనిష్ఠ ధర రూ.50 నుంచి రూ.60 వరకు వేలం జరుగుతోంది. వేలం చివరి దశకు చేరుకోవడంతో రైతులు కూడా అన్ని రకాల గ్రేడ్లను వేలానికి తీసుకొస్తున్నారు. లోగ్రేడ్‌కు డిమాండు లేదన్న కారణంతో వ్యాపారులు అనాసక్తి చూపుతున్నారు. తద్వారా ప్రతి రోజూ 20 శాతానికిపైగా బేళ్లు నోబిడ్లు అవుతున్నాయి. రైతులు రవాణా ఛార్జీల భారంతో తిరిగి ఇళ్లకు తీసుకెళ్లలేక స్థానికంగా ఉండే బయట వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత ఆధారంగా కిలో రూ.15 నుంచి రూ.40 వరకు అమ్మేస్తున్నారు. బయట కొనుగోళ్లను ప్రోత్సహించడం ద్వారా మార్కెట్‌లోనూ లోగ్రేడ్ ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం అధిక పంట ఉత్పత్తి అమ్మకాలు జరుగుతుండడంతో వాటి ద్వారా వచ్చే అదనపు రుసుం, సర్వీసు ఛార్జీ రూపంలో బోర్డు ఆదాయానికి గండి పడనుంది. టంగుటూరు, ఒంగోలు-1, 2బీ వెల్లంపల్లి, కొండపి కేంద్రాలుగా కొందరు దళారులు అక్రమ కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా బోర్డు, విజిలెన్స్ అధికారులు కేంద్రాల వద్ద జరిగే బయట అమ్మకాలను కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు.

# ధీమా ఇవ్వని వాతావరణ బీమా



పుట్టపర్తి: వాతావరణంలో మార్పుల కారణంగా సంభవించే నష్టాల నుంచి ఊరట లభించేందుకు రైతులు ఆధునికీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ సిస్టమ్) కింద తమ వంతు వాటా చెల్లించారు. జిల్లాలో 2024-25 సంవత్సరానికిగాను రబీలో 2,013 హెక్టార్లలో రైతులు మామిడి సాగు చేశారు. బీమా పథకం కింద హెక్టారుకు రూ.4,500, కేంద్రం వాటా రూ.4,000 చొప్పున అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఏఐసీ)కి చెల్లించారు. 142 మంది రైతులు రూ.5.82 లక్షలను ఇఫ్‌కో కంపెనీకి చెల్లించారు. రబీ ముగిసి ఆరునెలలు దాటుతున్నా సదరు కంపెనీల నుంచి పరిహారం ఊసేలేదు. దీంతో రైతులు ఉద్యాన కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

**మార్పుల ఆధారంగా..:** వాతావరణ ఆధారిత అంశాల ప్రకారం అనగా ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలుల వేగం ఆధారంగా వీటిలో వచ్చే వ్యత్యాసాలకు అనుగుణంగా ఒక్కోదానికి హెక్టారుకు గరిష్ఠంగా రూ.22.50 వేలు చొప్పున పరిహారం ఇవ్వాల్సి ఉంది. మొత్తం హెక్టారుకు గరిష్ఠంగా రూ.90 వేలు ఇవ్వాలన్నది నిబంధన.

**లేఖలు రాసినా స్పందన కరవు:** జిల్లాలో మామిడి పంట స్థితిగతులను పరిశీలించి రైతులకు పరిహారం చెల్లించాలని ఉద్యాన అధికారి చంద్రశేఖర్ ఏఐసీకి ఏప్రిల్‌లో లేఖ రాశారు. ఇదే విషయంపై పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి కూడా లేఖ రాశారు. నేటికీ స్పందన లేదు.

**గణాంకాలు రాలేదన్న కారణంతో..**

వాతావరణ బీమాను మామిడి రైతులకు మండలం యూనిట్‌గా తీసుకున్నారు. ఆయా మండలాల్లో మైనాలుగు అంశాల్లో వాతావరణం నమోదైన గణాంకాల ఆధారంగా రైతుకు ఎంత నష్టం వాటిల్లింది.. ఎంత చెల్లించాలి అన్న విషయాలు నిర్ధారిస్తారు. ఈ గణాంకాలు రాష్ట్రవ్యాప్తంగా బీమా కంపెనీ తీసుకుంటుంది. కొంత డేటా తమకు అందకపోవడం, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా హెక్టారుకు రూ.4,000 చొప్పున జిల్లాకు రూ.87.54 లక్షలు చెల్లించకపోవడంతో బీమా ఇవ్వడంలో ఆలస్యమవుతోందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

జిల్లా: శ్రీసత్యసాయి
మామిడి రైతులు: 2,353
చెల్లించిన మొత్తం: రూ.89.60 లక్షలు
కేంద్రం చెల్లించిన వాటా: రూ.87.54 లక్షలు

**గణాంకాలు అందాల్సి ఉంది**దాస్, ఏఐసీ జిల్లా కోఆర్డినేటర్

వాతావరణానికి సంబంధించి కొంత డేటా రావాల్సి ఉంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వాటా కూడా చెల్లించాల్సి ఉంది. ఇందుకోసం ఉన్నతాధికారులు రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడుతున్నారు. ప్రభుత్వం డేటా, వాటా సొమ్ము అందించిన వెంటనే రైతులకు పరిహారం చెల్లిస్తాం.

# చెత్త గుట్టలిక మాయం!



నర్సీపట్నం : పురపాలక సంఘాల్లో కొన్నేళ్లుగా టన్నుల కొద్దీ పేరుకుపోయిన వ్యర్థాల గుట్టలు కనుమరుగు కానున్నాయి. నర్సీపట్నంలో దశాబ్ద కాలంలో నిల్వ ఉన్న 6,300 మెట్రిక్ టన్నుల చెత్తను సాంకేతిక విధానాలను అనుసరిస్తూ కరిగిస్తున్నారు. ప్రభుత్వం నియమించిన ఓ ప్రైవేట్ కంపెనీ ఈ పనులు చేస్తోంది. ప్రజారోగ్య శాఖ విభాగం ఈఈ దక్షిణామూర్తి, డీఈఈ మహేష్ పర్యవేక్షిస్తున్నారు. పునర్వినియోగానికి పనికొచ్చే వస్తువులను యంత్రాల ద్వారా వేరుచేస్తున్నారు. పనికిరాని వ్యర్థాలను పొడిగా మార్చేసి లోతట్టు ప్రాంతాలను కప్పి పైన మట్టి వేసి చదును చేయనున్నారు. రెండు నెలల్లో చెత్త గుట్టను కరిగించేసి ఆ స్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగించనున్నారు.

ఎలమంచిలిలో కొద్ది నెలల కిందట డంపింగ్ యార్డులో సుమారు 8,700 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరుణ్ అసోసియేట్ కంపెనీ శాస్త్రీయ విధానంలో పూర్తిగా తొలగించింది. మరో యార్డులోని వేల టన్నుల వ్యర్థాలను తొలగించాల్సి ఉంది. ఎంత నిల్వ ఉందో అంచనా వేశాక తొలగించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టనున్నారు. నర్సీపట్నంలో పనులు పూర్తి కాగానే ఎలమంచిలిలో శ్రీకారం చుడతామని అక్కడి కమిషనర్ పేర్కొన్నారు.

జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సంపూర్ణంగా జరగాలి. పోగయ్యే చెత్తను ఏ రోజుకారోజే తడి, పొడిగా వేరుచేసి సేంద్రియ ఎరువు తయారీ, పునర్వినియోగానికి పనికి వచ్చే వస్తువులను వేరు చేయాలి. 75 వేల జనాభా ఉన్న నర్సీపట్నంలో రోజుకు 16 మెట్రిక్ టన్నుల తడి, 14 మెట్రిక్ టన్నుల పొడిచెత్త పోగవుతోంది.

క్యూ-బయో ఎనర్జీ కంపెనీ ప్రతినిధులు రోజూ ఎనిమిది మెట్రిక్ టన్నుల తడి చెత్తను సేంద్రియ ఎరువుగా మారుస్తున్నారు. 14 మెట్రిక్ టన్నుల నుంచి ప్లాస్టిక్, గాజు, తోలు తదితర వస్తువులను వేరు చేస్తున్నారు. రెండో రోజులకోసారి పది మెట్రిక్ టన్నుల వ్యర్థాలను విశాఖలోని విద్యుదుత్పత్తి కేంద్రానికి కాంపాక్టర్ ద్వారా మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది తరలిస్తున్నారు.

మరో కాంపాక్టర్‌కు ప్రతిపాదన... నర్సీపట్నం నుంచి రోజూ కాంపాక్టర్ ద్వారా కాపులుప్పాడలోని విద్యుదుత్పత్తి కేంద్రానికి పొడి చెత్త పంపాలన్నది లక్ష్యం. బ్యాటరీలతో నడిచే కొత్త కాంపాక్టర్ కావాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ను కోరుతున్నాం. ప్రస్తుతం రెండు రోజులకోసారి తరలిస్తున్నాం. వరాహ నది ఒడ్డున డంపింగ్ యార్డు రక్షణ గోడ ఎత్తు పెంచేందుకు రూ.16 లక్షలు ఖర్చు చేయనున్నాం. టెండరు ఖరారైంది. త్వరలోనే పనులు చేపడతాం.- సురేంద్ర, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

## ఐటీకి 'కూటమి'దన్ను

విశాఖపట్నం: ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి కొన్నేళ్లుగా వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిల్లో రూ.125 కోట్లు తాజాగా విడుదల చేసింది. రాయితీలు, ప్రోత్సాహకాలను గత వైకాపా ప్రభుత్వంలో సీఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్ పెట్టారు. ఈ పెండింగ్‌లో ఉన్న వాటిలో 50 శాతం బకాయిలను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చింది.ఐటీకే రూ.60 కోట్లకుపైగా: కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ప్రోత్సాహకాల్లో ఐటీ కంపెనీలకు సంబంధించినవే రూ.60 కోట్లకుపైగా ఉన్నాయి. విశాఖ ఐటీ హిల్స్‌పై చిన్నపెద్దా కంపెనీలు 150 వరకు ఉన్నాయి. గతంలో తెదేపా హయాంలో డిజిగ్నేటెడ్ టెక్నాలజీ పార్కు (డీటీపీ) పాలసీని ప్రవేశపెట్టింది. వైకాపా అధికారంలోకి రాగానే రద్దు చేసింది.

**కట్టు కథలతో నెట్టుకొచ్చిన వైకాపా**

విశాఖ ఐటీ పార్కులో దరఖాస్తు చేసుకునే కంపెనీలకు సగం అద్దెకే భవనాలు ఇవ్వడంతోపాటు, ఇంటర్నెట్, నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించేవారు. ఏడాది పాటు ఒకరి ఉద్యోగం కల్పిస్తే రూ.లక్ష ఆ కంపెనీలకు ప్రోత్సాహకంగా ఇచ్చేవారు. కొవిడ్ సమయంలో కంపెనీలకు విద్యుత్ ఎండీ ఛార్జీలు (హెచ్‌పీకి రూ.450), ప్రాపర్టీ ఛార్జీలు రద్దు చేస్తామని స్వయాన అప్పట్లో జగన్ హామీ ఇచ్చి



వదిలేశారు. ఇప్పుడు ఈ వర్గాల వారందరికీ కూటమి ప్రభుత్వం నిర్ణయంతో ఊరట కలుగుతోంది.

వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రుషికొండ ఐటీ పార్కును నిర్లక్ష్యం చేసింది. ఐటీ హిల్స్‌పై ఉన్న 86 కంపెనీలకు సంబంధించి రూ.22కోట్లు బకాయిలు పెట్టింది. 'ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల విడుదల చేయలేకపోతున్నాం, ఎన్నికలవగానే చెల్లిస్తాం' అంటూ అప్పట్లో మంత్రిగా ఉన్న అమర్‌నాథ్ వాగ్దానాలు చేసి చేతులెత్తేశారు. ఏటా సీఎఫ్‌ఎంఎస్ నెంబరు మార్చడమే తప్ప రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా కట్టు కథలతో నెట్టుకొచ్చారు. ఐటీ కంపెనీల్లో పనిచేసే పరోక్ష సిబ్బందికి ఒక బస్సు ఏర్పాటు చేయమని కోరినా నాడు వైకాపా ప్రభుత్వం దృష్టిసారించలేదు.

చొరవకు కృతజ్ఞతలు: దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ముందుకు రావడం, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాల బకాయిలు చెల్లించడం ఐటీ పరిశ్రమల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. ఇలాంటి నిర్ణయాలు విశాఖను భారత సిలికాన్ కోస్ట్‌గా నిలబెట్టడానికి ఉపయోగపడతాయి. రాయితీలు, ప్రోత్సాహకాల విడుదలకు చొరవ చూపిన మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ కార్యదర్శి కాటంనేని భాస్కర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు.- కొసరాజు శ్రీధర్, ఏపీటీఏ నెట్‌వర్క్ ఛైర్మన్

## విదేశీ కొలువు పలుకు

కర్నూలు : నర్సింగ్, డిప్లొమా అభ్యర్థులను జర్మనీ రారమ్మని పిలుస్తోంది. నెలకు రూ.లక్షల వేతనాలతో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఊరిస్తున్నాయి. ఈ అవకాశాలను యువతకు చేరువ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెలకువలు నేర్పిస్తోంది. కోర్సు పూర్తయ్యాక సర్టిఫికెట్‌తోపాటు ప్రభుత్వమే జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. నర్సింగ్ పూర్తి చేసిన వారికి జర్మనీలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతం తొలి బ్యాచ్ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.

మొత్తం వంద మంది విద్యార్థులను బ్యాచ్‌లుగా విభజించి.. రోజుకు 2 గంటలకు పైగా జర్మన్‌భాష నేర్పిస్తున్నారు. జర్మనీలో ఉద్యోగం చేసేందుకు అవసరమైన నైపుణ్యాలపై ఆరు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలకు వరకు వేతనం లభించే అవకాశం ఉంది.

ఐటీఐ చదివిన వారికి

రెండేళ్ల ఐటీఐ, మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన, 30 ఏళ్లలోపు వయసు, కనీసం రెండేళ్ల అనుభవం కలిగి జర్మనీలో ఉద్యోగం చేసే ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరికి జర్మన్ భాషలో 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ ఇప్పిస్తారు.

జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2600 నుంచి రూ.2,700 యూరోలు (రూ.2.60 లక్షలు నుంచి రూ.2.70 లక్షలు) వేతనం లభిస్తుంది. డిప్లొమా, ఎలక్ట్రీషియన్ కోర్సులు చేసిన వారికి రాజమహేంద్రవరం, గుంటూరు జిల్లాల్లో మూడు, నాలుగు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు.

ఖతార్‌లో ఉద్యోగాలకు..

ఖతార్ దేశంలో ఆయిల్, గ్యాస్ పరిశ్రమల్లో సూపర్‌వైజర్ స్థాయి ఉద్యోగాలు, స్ట్రక్చరల్ వెల్డింగ్, పైప్ ఫిట్టర్, ప్లంబర్, పెయింటింగ్, స్ట్రక్చరల్ ఫిట్టర్, సూపర్‌వైజర్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

అభ్యర్థులకు సంబంధిత ట్రేడ్‌లలో డిప్లొమా, టెక్నికల్ సర్టిఫికెట్ విద్యార్హతలు అవసరం. ఆంగ్లంలో మాట్లాడగలిగే నైపుణ్యం ఉండాలి. 45 ఏళ్లలోపు వయసుండి, పదేళ్ల అనుభవం కలిగిన పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు.

శిక్షణ తర్వాత ఖతార్‌లో ఉద్యోగ అవకాశాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఎంపికైన వారికి భారత కరెన్సీ ప్రకారం రూ.1,94,000-రూ.2,38,000 వేతనం లభిస్తుంది.

దరఖాస్తు ఎలా..“ జర్మనీ, ఖతార్‌లో ఉద్యోగాలు చేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు %naipunyam.ap.gov.in% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు %skillinternational@ap ssdc.in% మెయిల్ ఐడీ, 9640606555, 9988853335, 8909117279 నంబర్లకు సంప్రదించొచ్చని” నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ తెలిపారు.

# పరికరాలున్నాయ్.. సిబ్బందే లేరు

భీమవరం : పేద, మధ్య తరగతి వర్గాలకు అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం ఖరీదైన అధునాతన వైద్య పరికరాలను సమకూర్చింది. వాటిని వినియోగించేవారు లేకపోవడంతో రోగులు ఆర్థిక ఇబ్బంది పడుతున్నారు. వైద్యులు రాసిచ్చిన చీటీ తీసుకుని ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. ల్యాబ్ పరీక్షలన్నా, ఎక్స్‌రే తీయించాలన్నా.. స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నా.. ప్రైవేటుగా రూ.1,200 నుంచి రూ.3,500కు పైగా ఖర్చవుతోంది. జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల వినియోగంపై 'న్యూస్‌టుడే' పరిశీలించగా.. పలు విషయాలు బహిర్గతమయ్యాయి. వీరంతా భీమవరం ప్రాంతీయ ఆసుపత్రిలో ఎక్స్‌రే కోసం వేచి ఉన్నవారు. ఇక్కడకు గాయపడినవారు, ఇతరత్రా కారణాలతో ఎముకలు చిట్లినవారు ఎక్స్‌రే పరీక్షలకు రోజూ 15 నుంచి 23 మంది వస్తున్నారు. ఎక్స్‌రే తీసే రేడియోగ్రాఫర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పరీక్షలు నిలిచిపోయాయి. ఎక్స్‌రే తీసేవారు వస్తారనుకుంటూ నొప్పి భరిస్తూనే ఆశతో రోగులు ఎక్స్‌రే గది దగ్గర ఇలా ఎదురుచూస్తున్నారు.

ప్రాంతీయ ఆసుపత్రిలో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. రేడియాల



జిస్ట్ లేకపోవడంతో గర్భిణులు, ఇతరత్రా సమస్యలతో వచ్చిన రోగులు స్కానింగ్‌కు ప్రైవేటు పరీక్ష కేంద్రాల వైపు వెళ్తున్నారు.

నరసాపురంప్రాంతీయ ఆసుపత్రిలోని వెంటిలేటర్ కొన్నేళ్లుగా ఉపయోగించడంలేదు. సాంకేతికంగా ఉపయోగించే సిబ్బంది లేరంటూ మూలకు చేర్చారు.

**అయిదేళ్లుగా గాలికొదిలేశారు**

గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే ఆయా ఆసుపత్రులకు అధునాతన వైద్య పరికరాలు సమకూర్చారు. వాటి నిర్వహణను వైకాపా హయాంలో విస్మరించారు. పరికరాలు ఉపయోగించాల్సిన వైద్య, సిబ్బంది పోస్టులు ఖాళీ అయితే పట్టించుకోలేదు. సాంకేతిక సమస్యలు వస్తే వాటికి కనీసం మరమ్మతులు చేయించకుండా వినియోగం మరిచారు.

జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రులు- భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు

రోజూ ఆయా ఆసుపత్రులకు వైద్య పరీక్షలకు వచ్చే రోగుల సంఖ్య- 1250కుపైగాల్యాబ్, ఎక్స్‌రే ఇతరత్రా పరీక్షలు అవసరం ఉన్నవారు- 1050 మందికి పైగా**వినియోగంలోకి తీసుకొస్తాం..: డాక్టర్ పి.సూర్యనారాయణ, డీసీహెచ్‌ఎస్**

ప్రాంతీయ ఆసుపత్రుల్లో సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. పరికరాలు వినియోగంపై అనుభవం ఉన్న వైద్యులకు పరికరాల బాధ్యత అప్పగించాలని సూచించాం. మరమ్మతులు వస్తే వెంటనే బాగు చేయించి వినియోగంలో ఉంచాలని ఆసుపత్రుల పర్యవేక్షకులకు చెప్పాం. సిబ్బంది కొరత ఉన్నచోట సమీపంలోని ఆసుపత్రుల నుంచి సర్దుబాటు చేస్తాం.

# అదిగో రబీ.. విత్తన రాయితీ ఏదీ!

కడప : రబీ పంట కాలం అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానుంది. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు రాయితీలో విత్తనాలను పంపిణీ చేయాలని అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అయితే ధరలు ఇంకా ఖరారు చేయలేదు. సేకరణ ప్రక్రియ కూడా ప్రారంభించలేదు. దీంతో అదునులో నాణ్యమైన విత్తనం అందుతుందా అనే అనుమానాలు అన్నదాతల్లో రేకెత్తుతున్నాయి.

**ప్రతిపాదనలతో సరిపుచ్చారు**

ఈ ఏడాది రబీ సీజన్‌లో వ్యవసాయ శాఖ ద్వారా అయిదు రకాల విత్తనాలను కర్షకులకు 45,758 క్వింటాళ్లు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సేకరణ, సరఫరా బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. క్వింటా పూర్తి ధర, రాయితీ శాతం, రైతు ఎంత చెల్లించాలని ఇంకా ఖరారు చేయలేదు. ఇంతవరకు వంగడాలే ఆర్‌ఎస్‌కేలకు చేరలేదు. ముందస్తుగా ఇస్తే సాగుదారులకు



ఉపయుక్తంగా ఉంటుంది.

**అన్నదాతల ఎదురుచూపు**

కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం, ముద్దనూరు, పులివెందుల, పోరుమామిళ్ల డివిజన్ల పరిధిలో నల్లరేగడి, మెట్ట భూములు అధికం. శనగ పంటను ఏటా 75 వేల హెక్టార్లకు పైగా సాగు చేస్తుంటారు. ఆ మేరకు ఇప్పటికే సేద్యపు పనులు ముమ్మరం చేశారు. మినుము, పెసర, వేరుసెనగ, నువ్వు పంటను కూడా ఎక్కువగానే పండిస్తుంటారు. రాయితీ వంగడాల కోసం ఎదురుచూస్తున్నారు.

**విత్తన పంపిణీకి ఇబ్బందులు రానీయం**

రబీలో రాయితీపై విత్తనాలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. సేకరణ, సరఫరా బాధ్యతలను ఏపీ సీడ్స్‌కు అప్పగించాం. ధరలు ఖరారవ్వగానే తెప్పిస్తాం. రైతులు ఆర్‌ఎస్‌కేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలి. ఇబ్బందులు రాకుండా ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం. - చంద్రానాయక్, జిల్లా వ్యవసాయాధికారి

# మేం పట్టించుకోం.. మీరు కట్టేసుకోండి



హిందూపురం : హిందూపురం పట్టణంలోని డి.ఆర్.కాలనీలో రహదారికి అడ్డుగా భవనాన్ని నిర్మిస్తుండటంతో స్థానికులు అడ్డుకొని మున్సిపల్ ఛైర్మన్‌కు, అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. సర్వే చేసిన తరువాత, స్థలం రహదారిది కాదని రుజువైతేనే నిర్మాణం చేపట్టాలని టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారి ఆదేశించారు. అయినా పనులు ఆగలేదు. మరింత జోరుగా సాగుతున్నాయని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.పట్టణంలోని సడ్లపల్లిలో వెంచర్ ఏర్పాటు కోసం దాదాపు మూడు ఎకరాల స్థలం చుట్టూ పెద్ద ప్రహరీ నిర్మిస్తున్నారు. ప్రహరీ వెనుక వైపున పెద్ద గుంతలు తీశారు. వీటి కారణంగా తమకు ఇబ్బందులు వస్తాయని సమీప పొలాల యజమానులు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టణంలోని పైపులైన్ రోడ్‌లో అనుమతులు లేకుండా వెంచర్ వేయడమే కాదు.. ప్లాట్ల అమ్మకాలు జరిగిపోతున్నాయి.

హిందూపురం పట్టణంలోకి తొంగిచూస్తే అనేక కాలనీల్లో ఇలా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే భవన నిర్మాణాలు సాగిస్తున్నారు. మరికొందరు పరిమితికి మించి అంతస్తులు నిర్మించుకొంటున్నారు. పట్టణంలో చిన్నపాటి నిర్మాణాన్ని అయినా సరే, మున్సిపాలిటీ అనుమతి తప్పనిసరి. అయితే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో నిర్మాణాలు ఇష్టారాజ్యంగా చేసుకొంటున్నారు.

**ప్రతి వార్డుకు టీపీ కార్యదర్శులున్నా..**

ప్రతి వార్డుకు టౌన్ ప్లానింగ్ విభాగం కార్యదర్శులు ఉన్నా పట్టించుకొనేవారు కనిపించడం లేదు. ఈ విభాగం ఉన్నతాధికారులు కార్యాలయానికే పరిమితం అవుతున్నారు. అనుమతులు లేకుండా కట్టుకొనేవారిని అడ్డుకొనే పరిస్థితి కనిపించడలేదు. అక్రమ నిర్మాణాలు పెరిగిపోవడంతో పట్టణంలో రహదారులు అడ్డదిడ్డంగా తయారు అవుతున్నాయి. దీంతో పట్టణ రూపురేఖలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

**వెంటనే చర్యలు చేపడతాం- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్**

అనుమతి తీసుకోకుండా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం. ప్రతి ఒక్కరూ, ప్రతి నిర్మాణానికి అనుమతి తీసుకోవాల్సిందే. అనుమతి లేని వాటిని గుర్తించేందుకు చర్యలు చేపడతాం. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవు.

# హెచ్చెల్సీ వంతెనలు.. ప్రమాద ఘంటికలు



కణేకల్లు :హెచ్చెల్సీ ప్రధాన కాలువపై బళ్లారి నుంచి బొమ్మనహాళ్ శివారు గుండ్లపల్లి అంతర్ రాష్ట్ర రహదారిపై చెక్‌పోస్టు వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతంలో ఐరన్‌వోర్ క్వారీలు, ఇతర పరిశ్రమల ఎక్కువగా ఉన్నాయి. వీటివల్ల బళ్లారి, బొమ్మనహాళ్, కణేకల్లు క్రాస్‌మీదుగా కళ్యాణదుర్గంకు భారీ సామర్థ్యం కలిగిన లారీలు, టిప్పర్ల రాకపోకలు ఉంటాయి. వీటివల్ల వంతెన ఎక్కడ కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్ డీఈఈ రవిశంకర్‌రెడ్డితో మాట్లాడుతూ బొమ్మనహాళ్ చెక్‌పోస్టు వద్ద వంతెన మరమ్మతులు, సిమెంటు, తారు రోడ్లు వేయడానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు తెలిపారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో బొమ్మనహాళ్‌లో ప్రవేశించి సుమారు 200 కిలోమీటర్లు ప్రవహించి తాడిపత్రి నుంచి కడప జిల్లాలో ప్రవేశించే తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)పై ఉన్న 52 వంతెనల్లో కొన్ని శిథిలావస్థకు చేరాయి. ఈ కాలువపై పలు ప్రాంతాల్లోని జాతీయ, ఇతర ప్రధాన రహదారుల వద్ద ఉన్న సుమారు 10 వంతెనలకు మాత్రమే మరమ్మతులు చేయగా.. మిగిలిన 42 వంతెనల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక హెచ్చెల్సీ కాలువలో కూలిన, దెబ్బతిన్న యూటీలు, లైనింగ్ పనులకు రూ.35 కోట్లు మంజూరు చేసినా.. పనులు ప్రారంభించాక కాలువలోని నీళ్లు రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి.

మైలాపురం వద్ద హెచ్చెలీ కాలువపై నిర్మించిన వంతెన దెబ్బతింది. ఈ వంతెనను దాటుకుని మైలాపురం ఏళంజి, కానాపురం, కొత్తూరు గ్రామాలకు రాకపోకలు సాగుతుంటాయి. దీనికి మరమ్మతులు చేపట్టాలని గతంలో కోరినా.. గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

గణిగెర వద్ద హెచ్చెల్సీ ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి అప్రోచ్ రోడ్డు సైతం దెబ్బతిని రాకపోకలకు కష్టంగా మారింది. ఈ విషయాన్ని 'హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా గణిగెరవద్ద వంతెన మరమ్మతులకు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు పేర్కొన్నారు.

# వైద్యం 'ఓటీ' మాటలే


కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులకు 'ప్రాణం' పోస్తున్న సర్వజన ఆసుపత్రిలో యూరాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్ విభాగాల్లో ఆపరేషన్ థియేటర్లు(ఓటీ) పనిచేయక రోగులు ఇబ్బంది పడుతున్నారు. విధిలేక ప్రైవేటు ఆసుపత్రులకెళ్తున్నారు. ఒక్కొక్కరిపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు భారం పడుతోంది.ఓర్వకల్లుకు చెందిన మరియమ్మ కింద పడి భుజానికి గాయం కావడంతో కర్నూలు సర్వజన ఆసుపత్రికొచ్చారు. ఈ నెల 9న ఆర్థోపెడిక్ విభాగంలో చేరారు. 13వ తేదీన శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు చెప్పడంతో ముందు రోజు రాత్రి ఆమె ఆహారం తీసుకోలేదు. మరుసటి రోజు ఉదయాన్నే ఆపరేషన్ థియేటరు(ఓటీ)కు తీసుకెళ్లారు. ఓటీలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో శస్త్రచికిత్సను వాయిదా వేశారు. నిరీక్షించలేక ఆమె ఇంటికెళ్లిపోయారు.

**అన్నీ అక్కడే చేయాలట**

యూరాలజీ విభాగంలో శస్త్రచికిత్సలు ఆగిపోవడంతో బాధితులను ఆర్థోపెడిక్ విభాగానికి పంపించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడున్న ఓటీల్లోనూ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఆపరేషన్లు ఆగిపోయాయి. ప్రత్యామ్నాయంగా శుశ్రుత భవన్‌లోని ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలకు పంపిస్తున్నారు. ఇక్కడ ఆర్థోపెడిక్, యూరాలజీ విభాగాల శస్త్రచికిత్సలు మూడు రోజులు, ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీలు మరో మూడు రోజులు చేస్తున్నారు. శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన బాధితులు పెరగడంతో నిరీక్షించాల్సి వస్తోంది.

**నిధులున్నా పనులు చేపట్టరు**

కర్నూలు సర్వజన వైద్యశాలకు నిత్యం మూడు వేల వరకు ఓపీ ఉంటుంది. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచి రోగులు వస్తుంటారు. అవసరమైన వారిని శస్త్రచికిత్సలు చేస్తున్నారు. యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లోని మాడ్యులర్ ఓటీలు (ఆపరేషన్ థియేటర్ జనవరిలో మరమ్మతులకు



గురయ్యాయి. ఈ రెండు విభాగాలను బాగుచేసేందుకు ఆసుపత్రి నిర్వహణ కింద రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఓటీ పనులకు రూ.55 లక్షలు కేటాయించారు.పనులు చేసేందుకు నారాయణరెడ్డి అనే గుత్తేదారుడు ముందుకొచ్చారు. ఆయన ఉప గుత్తేదారుడికి పనులు అప్పగించారు. ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. అయినా ఆసుపత్రి అధికారులు పట్టించుకోవడం లేదు.

**ఆలస్యం అవుతున్న ఆపరేషన్లు**

ఆర్థోపెడిక్, యూరాలజీ విభాగాల్లో ఓపీల్లో వచ్చిన కేసులు.. అత్యవసర విభాగం నుంచి వచ్చిన సీరియస్ కేసులను గుర్తించి వారిని అడ్మిట్ చేసుకుంటారు. ఈ రెండు విభాగాల్లో ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు చేయించుకునేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వార్డులో అడ్మిట్ చేసుకున్న తర్వాత నాలుగు లేదా ఐదు రోజుల్లో శస్త్రచికిత్స చేసేవారు.

ఆర్థోపెడిక్ విభాగంలో నెలకు 120 నుంచి 150, యూరాలజీ విభాగంలో 150 నుంచి 175 వరకు శస్త్రచికిత్సలు చేసేవారు. ఈ లెక్కలు పరిశీలిస్తే ఒక్కో విభాగంలో రోజుకు సరాసరిన 5 ఆపరేషన్లు జరిగేవి. ప్రస్తుతం శుశ్రుత భవన్‌లో ఉన్న ఈఎన్‌టీ, ప్లాస్టిక్ సర్జరీ విభాగాల్లోనే ఆర్థోపెడిక్, యూరాలజీ విభాగాలకు సైతం కేటాయించడంతో శస్త్రచికిత్సలు బాగా ఆలస్యమవుతున్నాయి.

# అలగనూరుకు అడుగులు

నంద్యాల : గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుంగిన అలగనూరు జలాశయం మరమ్మతులకు అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని మట్టి పరీక్షలు చేయిస్తోంది. నిపుణుల కమిటీ సూచనలు మేరకు పలు ప్రాంతాల్లో పరీక్షలు చేసి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. కట్ట కుంగడానికి నేల స్వభావం కారణమా ? పనుల్లో నాణ్యత లేకపోవడమా ? సరైన ప్రదేశంలోనే జలాశయం నిర్మించారా ? తదితర అంశాలను పరిశీలించారు.. జలాశయం కింది భాగంలో 5 మీటర్ల లోతులోనే రాయి ఉన్నట్లు గుర్తించారు. జలాశయం భద్రతకు ఇబ్బందేమి లేదని నివేదిక ఇచ్చారు.

**2018లో కుంగిన కట్ట**

కర్నూలు- కడప (కేసీ) కాల్వ ఆధునికీకరణలో భాగంగా అలగనూరు వద్ద జలాశయాన్ని 2004లో నిర్మించారు. అప్పట్లో రూ.70 కోట్లు వెచ్చించారు. తలముడిపి చెరువును అనుసంధానం చేస్తూ 3,636 ఎకరాల్లో దీని నిర్మాణం చేపట్టారు. ఇందులో 2.95 టీఎంసీల నీరు నిల్వ చేసి అవసరాన్ని బట్టి కేసీ కాల్వకు విడుదల చేస్తూ వచ్చారు. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో కలిపి దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాల్సి ఉంది. ఏటా రెండుసార్లు వరి సాగు చేస్తుంటారు. 2018లో కట్ట కుంగడంతో నీటిని నిల్వ చేయడం ఆపేశారు. అప్పటి నుంచి ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి.

**బిల్లులు ఇవ్వని వైకాపా**

మరమ్మతులకు 2021లో రూ.3.57 కోట్లతో టెండర్లు పిలిచింది. సదరు గుత్తేదారు సంస్థ 18.64 శాతం పనులు పూర్తి చేసింది. నిధులు



విడుదల చేయకపోవడంతో పనులు ఆపేశారు. ఒప్పందం కూడా 2023 డిసెంబరుతో ముగిసింది. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు.. కట్ట మరింత కుంగుతూ వచ్చింది.

అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం జలాశయంపై దృష్టి సారించింది. గతేడాది నిపుణుల బృందం జలాశయాన్ని పరిశీలించింది. చేపట్టాల్సిన పనులపై నివేదిక ఇచ్చారు. 2.5 కి.మీ. నుంచి 2.800 కి.మీ. వరకు బండ్‌ను తిరిగి నిర్మించాలని.. 2.825 కి.మీ. నుంచి 2.925 కి.మీ. వరకు మరమ్మతులు చేపట్టాలని.. 3.025 కి.మీ. నుంచి 3.125 కి.మీ. వరకు మరికొన్ని పనులు చేపట్టాలని సూచనలు నివేదికలో రూపొందించారు.

**రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు**

నిపుణుల బృందం పరిశీలన అనంతరం జలవనరుల శాఖ రూ.36.26 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. దెబ్బతిన్న కట్ట పునర్ నిర్మాణంతోపాటు బండ్ పొడవునా వివిధ చోట్ల చేయాల్సిన మరమ్మతులు, భవిష్యత్తులో ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన పనులపై సమగ్ర నివేదికను రూపొందించింది. దాన్ని పరిశీలించిన ప్రభుత్వం కట్ట మరమ్మతులకు ఆమోద ముద్ర వేసింది. మట్టి పరీక్షలు పూర్తి కావొచ్చాయి.. జనవరిలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అలగనూరులో నీటిని నింపితే తలముడిపి చెరువు పరిధిలో ఉన్న 2,200 ఎకరాలు, 20 కి.మీ. మేర బోరుబావుల కింద మరో ఐదువేల ఎకరాలు పచ్చని పంటలతో కళకళలాడుతుంటుంది. అలగనూరు, రోళ్లపాడు, తలముడిపి, కొర్రపోలూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 600 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. ఏటా రూ.5 కోట్ల మేర చేపల వ్యాపారం జరుగుతుండేది.

# రూ.కోట్లు మింగిన చెరువులు

వడ్డిగూడెం :ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డిగూడెం గ్రామంలోని తాగునీటి చెరువు. 2022లో ఈ చెరువును ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 1,200 పని దినాలతో రూ.2,40,896 వేతనం చెల్లించి అభివృద్ధి చేశారు. చెరువు చుట్టూ ఫలసాయాన్నిచ్చే కొబ్బరి మొక్కలు వేశారు. ప్రస్తుతం చెరువు వినియోగంలో లేదు. గట్లపై పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో లక్ష్యం నీరుగారిపోయింది.తాగునీటి చెరువులను సంరక్షించి గ్రామీణ ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ పథకాన్ని 2022లో తీసుకువచ్చింది. ఈ పథకంలో భాగంగా అధ్వానంగా ఉన్న చెరువుల్లో పూడిక తీత పనులు చేసి గట్లను పటిష్ఠం చేయడంతోపాటు ఫలసాయాన్నిచ్చే మొక్కలు పెంచాలని ఆలోచన చేసింది. చెరువు



గట్లను వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆహ్లాదకర వాతావరణంలో ఆరోగ్యం అందించాలని నిర్ణయించింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధి హామీ పథకంలో అమృత్ సరోవర్ పథకం పేరుతో జిల్లా వ్యాప్తంగా మండలానికి 2 చొప్పున మొత్తం 80 తాగునీటి చెరువులను సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు. పనులు పూర్తి చేసిన తరువాత స్థానిక పంచాయతీలు వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో చెరువులు అధ్వానంగా మారాయి. చెరువుల చుట్టూ వేసిన మొక్కలు చాలా చోట్ల కానరావడం లేదు. పలు గ్రామాల్లో చెరువుల అభివృద్ధి పనులు అసంపూర్తిగా వదిలివేశారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన చెరువుల పర్యవేక్షణ స్థానిక పంచాయతీలదేనని డ్వామా పీడీ కేసీహెచ్. అప్పారావు అన్నారు. అధ్వానంగా ఉన్న చెరువులను భవిష్యత్తులో ఉపాధి నిధులతో అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటానన్నారు.

అభివృద్ధి చేసిన చెరువులు: 80

వెచ్చించిన నిధులు రూ. 3 కోట్లు

# గట్లు గల్లంతు

నంద్యాల : జిల్లాలో కేసీ కాల్వ పొడవునా కబ్జాల పర్వం కొనసాగుతోంది. రక్షణ కోసం ఎత్తుగా వేసిన మట్టి కట్టలను నేలమట్టం చేస్తున్నారు. ఆ స్థలాన్ని పరాధీనం చేసుకొంటున్నారు. కొందరు నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇస్తున్నారు.. మరికొందరు పంటలు చేస్తున్నారు. ఇంకొందరు కౌలుకు ఇచ్చారు. పట్టణ ప్రాంతాల శివారుల్లో కాల్వ శిఖం భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. బండిఆత్మకూరు, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

**ఆక్రమాల సాగు**

బండిఆత్మకూరు–శింగవరం గ్రామాల మధ్య కేసీ కాల్వ వంతెన సమీపంలో ప్రధాన కాల్వను ఆనుకొని 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి వరి సాగు చేస్తున్నారు. రామాపురం శివారులో కేసీ ప్రధాన కాల్వ కట్టపైనే 75 సెంట్లు ఆక్రమించి పంట సాగు చేపట్టారు. రెండేళ్ల కిందటే శిఖం భూమి ఆక్రమణకు గురైనా అధికారులు పట్టించుకోలేదు.

**దాబా పేరిట దాబు**

నంద్యాల మండలం చాబోలు గ్రామంలో సర్వే నంబరు 28-1లో నాలుగెకరాల పొలం ఉంది.. ఇందులో కేసీ కాల్వ వెళ్తోంది. దీన్ని వెడల్పు 10 మీటర్లు. ఇరువైపులా రెండెకరాలు ఆక్రమణకు గురైంది. ఓ వైపు ఆక్రమించి మట్టి తోలి చదును చేశారు. దాబా వేసుకోవడానికి అద్దెకు ఇచ్చారు.

**పంట కాల్వలూ పోయాయి**

దొర్నిపాడు మండలం రామచంద్రాపురం కేసీ ఉప కాల్వ పొడవునా సుమారు 2 కి.మీ.ల వరకు శిఖం భూమిని ఆక్రమించి కంది సాగు చేస్తున్నారు. కాల్వ పొడవునా సుమారు 50 ఎకరాలు ఆక్రమించి కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. చాగలమర్రి మండలం మల్లెవేముల సమీపంలోని కేసీ పంట కాల్వ వెంట అర కి.మీ. పొడవునా ఆక్రమించి కొన్నేళ్లుగా పంటలు సాగు చేస్తున్నారు.



స్థిరాస్తి వెంచర్లకు కల్పతరువు

కేసీ కాల్వ శిఖం భూమిలో పలుచోట్ల స్థిరాస్తి వెంచర్లు వెలిశాయి. నంద్యాలలోని రైతునగరం, ఎస్‌బీఐ కాలనీ, నూనెపల్లె, కాంతినగర్, చాబోలు, కానాల, చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల పరిధిలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

ఆళ్లగడ్డ పట్టణం, శిరివెళ్ల మండలంలోని గోవిందపల్లె, శిరివెళ్లలోనూ కాల్వను కాజేశారు. ఆళ్లగడ్డలో నాలుగేళ్ల కిందట ఓ స్థిరాస్తి వెంచర్‌లో గట్టును తెంపి అక్రమార్కులు పాగా వేసి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో రోజులు తరబడి మట్టిని తోలి కాల్వను ఖతం చేశారు.

**ఎక్కడికక్కడ ఆక్రమణ**

బండిఆత్మకూరు సుంకేసుల పికప్ ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలు గ్రామం వరకు 156 కి.మీ.ల పొడవునా కేసీ కాల్వ విస్తరించి ఉంది.

కర్నూలు–కడప ప్రధాన కాల్వ సుంకేసుల నుంచి రాజోలి వరకు 20 మీటర్ల వెడల్పుతో నిర్మించారు. కొన్నిచోట్ల 19-19.5 మీటర్ల మేర ఉంది. డిస్ట్రిబ్యూటరీ కాల్వలు 2 నుంచి 0.5 మీటర్లు, ఫీల్డ్ ఛానల్ అడుగు నుంచి 2 మీటర్ల వెడల్పులో నిర్మించారు.

ప్రధాన కాల్వకు ఇరువైపులా 10 మీటర్ల వెడల్పులో కట్ట నిర్మాణం చేపట్టారు. డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు ఇరువైపులా ఐదు మీటర్ల మేర గట్లు ఉన్నాయి. వీటిని చెరిపేసి ఆక్రమించేశారు. ప్రత్యేకించి పట్టణాల సమీపంలో ఎక్కువగా ఆక్రమణకు గురయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో ఇరువైపుల ఉన్న రైతులు వీటిని ఆక్రమించి పంటలు సాగు చేపట్టారు.

# వ్యాపార సుగంధం

కడియం: సవాళ్లు ఎన్ని ఉన్నా అధిగమించి అవకాశాలు సృష్టించుకు ంటేనే మనదైన ముద్ర వేయగలం. కడియంకు చెందిన అయిదుగు మహిళలు పూల వ్యర్థాలతో అగరుబత్తీలు తయారు చేస్తూ వ్యాపారంలో తొలి అడుగులు వేస్తున్నారు.

**అడుగులు పడ్డాయిలా..**

యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కడియం మండలానికి చెందిన పలువురు మహిళలు గతేడాది శిక్షణ పొందారు. కుట్టు, అగరుబత్తీల తయారీ, కొబ్బరి పీచుతో మ్యాట్‌ల తయారీ వంటివి నేర్చుకున్నారు. అందులో 12 మంది డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉపాధి, వ్యాపార అవకాశాల గురించి తెలుసుకున్నారు. వివిధ కారణాలతో మిగిలిన వారంతా మధ్యలోనే ఆగిపోయారు. ఆఖరికి అయిదుగురు కలిసి యూనిట్ ఏర్పాటు చేశారు. దీనికోసం విజయనగరం వెళ్లి ప్రత్యేకంగా తర్ఫీదు పొందారు. బ్యాంకు



నుంచి రూ.3 లక్షల రుణం తీసుకున్నారు. అదనంగా మరికొంత సొమ్ము కలిపారు. . కడియం సహజ సిద్ధ అగరబత్తీల అసోసియేషన్ పేరుతో మూడు నెలల క్రితం తయారీ ప్రారంభించారు.

**పూల వ్యర్థాలతో..**

కడియం పూలకు జాతీయస్థాయిలో గుర్తింపు ఉంది. స్థానిక అంతర్రాష్ట్ర మార్కెట్‌లో పూల వ్యర్థాలను వీరు సేకరిస్తున్నారు. వాటిని ఎండబెట్టి, పొడి చేసి ముడి సరకు సిద్ధం చేసుకుంటున్నారు. వాటికి వేర్వేరు పరిమళాలు, తైలాన్ని జోడించి నాలుగు రకాల అగరుబత్తీలు తయారు చేస్తున్నారు.

**ప్రభుత్వ సహకారం కావాలి..**

అగరబత్తీలను మార్కెటింగ్ చేయడంలో అనేక సవాళ్లు ఎదురవుతు న్నాయి. ప్రభుత్వం చేయూత అందిస్తే మాకు మేలు జరుగుతుంది. పరిమిత పెట్టుబడి కారణంగా ముందుకు వెళ్లలేకపోతున్నాం. మరింత రుణం మంజూరు చేస్తే వ్యాపారాన్ని విస్తృతం చేస్తాం. పిల్లా లక్ష్మీబాయి, నిర్వాహకురాలు

# కందిపప్పు వస్తుందా.. కడుపు నింపే మార్గముందా?



అనంతపురం : రేషన్ కార్డులు ఉన్నవారిలో ఎక్కువ మంది పేదలే. వారికి మార్కెట్‌లో నిత్యావసరాలు కొనేంత ఆర్థిక స్తోమత అంతంత మాత్రమే. ఎక్కువగా కడుపు నింపుకొనేందుకు రేషన్ దుకాణాలపైనే ఆధారపడి ఉంటారు. కొన్నినెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. సాధారణంగా కార్డుదారులు ఎదురుచూసే సరకుల్లో కందిపప్పు ప్రధానమైంది. అంతగా ఎదురుచూస్తే వస్తువును కొన్ని నెలలుగా అందివ్వడం లేదు. ఈ నెలలోనే దసరా, దీపావళి పండుగలు రావడం.. కందిపప్పు అందుబాటులో లేకపోవడంతో లబ్ధిదారులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

**మార్కెట్‌లో కిలో రూ.120**

జిల్లాలో చౌకధరల దుకాణాల ద్వారా కొన్నేళ్లుగా కిలో కందిపప్పు పంపిణీ చేస్తున్నారు. మొత్తం 1,645 చౌకధరల దుకాణాల పరిధిలో 6,57,828 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఒక్కో కార్డుకు కిలో చొప్పున పంపిణీ చేయాలా నెలకు 658 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం ఉంది. ప్రభుత్వ దుకాణాల్లో కిలో రూ.68 చొప్పున కార్డుదారులకు పంపిణీ చేసేవారు. అది పూర్తిగా ఆగిపోవడంతో బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.110–120 చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోందని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 నవంబరులో అన్ని రకాల రేషన్ సరకులు అందేలా చర్యలు చేపట్టినప్పటికీ పూర్తిస్థాయిలో సరఫరా చేయలేదు. గత డిసెంబరు, జనవరి నెలల్లో కేవలం 50 శాతం కార్డుదారులకే కందిపప్పు అందించారు. ఆ తర్వాత సరఫరా పూర్తిగా ఆగిపోయింది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నుంచి ఇప్పటికీ పంపిణీపై ఎలాంటి స్పష్టత రాలేదు. ఇది కార్డుదారులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

**నాసిరకం సరఫరా**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో మూడు నెలలకొకసారి కందిపప్పునకు టెండర్లు పిలిచేవారు. నాసిరకం కందిపప్పు అరకొరగా కార్డుదారులకు అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గుత్తేదారులు నాసిరకం సరఫరా చేశారు. ప్రభుత్వం గుర్తించి సరఫరా పూర్తిగా ఆపేశారు. మళ్లీ టెండర్లు పిలిచారు. ఇంకా అదే దశలోనే ఉంది.

**చర్యలు తీసుకుంటాం – వెంకటేశ్వర్లు, డీఎస్‌వో (అనంతపురం)**

కందిపప్పు కొన్ని నెలలుగా సరఫరా ఆగిన విషయం వాస్తవమే. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలవాల్సి ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే డీలర్ల ద్వారా డీడీలు కట్టించుకుని, పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

# పౌష్టికాహారాన్ని అమ్మేశారు

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో కొందరు అధికారులు పౌష్టికాహారాన్ని నల్లబజారుకు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేయాల్సిన పాలు, గుడ్లు, బాలామృతం, బాలసంజీవని కిట్లు.. తదితర పౌష్టికాహారాన్ని దారి మళ్లించి జేబులు నింపుకొన్న తీరు నిజమేనని తేటతెల్లమైంది. ఇందుకు ఉమ్మడి అనంత జిల్లాలో రెండు వేర్వేరు ఘటనలే నిదర్శనం. వైకాపా పాలనలో కొన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సాగిన అవినీతి దందాపై వరుస కథనాలను ప్రచురించింది. స్పందించిన అధికార యంత్రాంగం కొందరిపై తూతూమంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకొంది. అక్రమ, అవినీతి దందాపై సకాలంలో విచారణ చేసి నిర్ధారించడంలో ఉన్నతాధికారులు వైఫల్యం చెందారు. దీని మూలంగా కొందరు ఉద్యోగ విరమణ.. మరికొందరు ఎంచక్కా పదోన్నతులు పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్ కేసులపై వేగంగా విచారణ చేయించింది. దీని పర్యవసానమే కొందరిపై శాఖాపరమైన చర్యలు మొదలయ్యాయి.

**పక్కదారి పట్టించి..**

కదిరి పశ్చిమ ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఆరేళ్ల క్రితం పాలు, గుడ్లు అమ్ముకోవడం, అంగన్‌వాడీ కేంద్రాల అద్దె చెల్లింపులో చేతివాటం ప్రదర్శించారు. బ్యాంకు ఖాతాల్లోకి జమ చేయకుండా నగదు పంపిణీ చేసి అవినీతికి తెరలేపారు. అప్పట్లో పీడీ ప్రాథమిక విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. తర్వాత గతేడాది అక్టోబరు 22న కర్నూలు ఆర్జేడీ విచారణ చేశారు. ఆరు రకాల అక్రమాలపై ఆరోపణలు రాగా.. నాలుగు నిజమేనని తేలాయి. రూ.17.84 లక్షలకు లెక్కలే లేవని నిర్ధారించారు. అప్పటి సీడీపీఓ వరకుమారి, సీనియర్ అసిస్టెంటు పద్మావతిదేవి బాధ్యులుగా తేల్చారు. వీరిపై చర్యలు తీసుకుంటూ తాజాగా జీవో 139 జారీ చేశారు. సదరు సీడీపీఓ ప్రస్తుతం పదవీ విరమణ పొందారు. ఈమెపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేయగా.. పద్మావతిదేవికి రెండు వార్షిక ఇంక్రిమెంట్లు కోత పెట్టారు. ప్రస్తుతం ఆమె హిందూపురం ప్రాజెక్టు కార్యాలయంలో పని చేస్తున్నారు.

**కర్ణాటకకు తరలించి..**

మడకశిర ప్రాజెక్టు పరిధిలో మరో దారుణంగా పౌష్టికాహారాన్ని దిగమింగారు. 2020–21లో లబ్ధిదారులకు నిర్దేశిత పౌష్టికాహారాన్ని ఇవ్వకుండా కొన్నిసార్లు కర్ణాటక ప్రాంతానికి తరలించి అమ్మేసినట్లు.. అవినీతి నిరోధక శాఖ సమగ్ర దర్యాప్తు చేసి నిగ్గు తేల్చింది. సీడీపీఓ పి.విజయకుమారి, గ్రేడ్–1 సూపర్‌వైజర్లు ఎ.లీలా పద్మావతి, జి.అరుణమ్మ, గ్రేడ్–2 సూపర్‌వైజర్ ఎం.నన్నక్క బాధ్యులుగా ప్రాథమికంగా నిర్ధారించారు. సదరు సీడీపీఓ ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పని చేస్తున్నారు. ఎ.లీలా పద్మావతి పదోన్నతి పొంది ప్రస్తుతం అనంత జిల్లాలో సీడీపీఓగా, అరుణమ్మ ఉరవకొండ ప్రాజెక్టు, నన్నక్క మడకశిర ప్రాజెక్టులో పని చేస్తున్నారు. ఈ అక్రమ తంతుపై సమగ్ర విచారణ చేయాలంటూ శ్రీసత్యసాయి పీడీని ఆదేశించారు. ఈమేరకు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జయమ్మకు బాధ్యత అప్పగించారు. ఇందుకు ప్రభుత్వం తాజాగా జీవో 138ను జారీ చేసింది.

# ప్రతినెలా.. లెక్కలన్నీ పక్కా



అనంతపురం : ఏ రోజు లెక్క ఆ రోజే సరి చూసుకొనే అవకాశం మహిళా సంఘాల్లోని సభ్యులకు చేరువ చేస్తున్నారు. గతంలో తీసుకున్న అప్పులు చెల్లించినా, పొదుపు చేసినా అది కట్టారా? లేదా? అన్నది బ్యాంకులకు వెళ్లి చూసుకొనే పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం కేవలం అరచేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు మహిళా సంఘాల సభ్యులు 'మన డబ్బులు- మన లెక్కలు' (ఎమ్‌డీఎమ్‌ఎల్) చూసుకోవచ్చు. ఇప్పటిదాకా బ్యాంకుల్లో స్త్రీనిధి, గ్రూపు లోన్లు తీసుకొని మహిళలు చెల్లించినా బ్యాంకుల్లో కట్టకుండా కాజేసేవారు. నాలుగు, ఐదు సంవత్సరాల తర్వాత తేలినా వాటిని రికవరీ చేసే పరిస్థితి ఉండేది కాదు. తాజాగా ఎమ్‌డీఎమ్‌ఎల్ విధానంతో పారదర్శకతకు శ్రీకారం చుట్టినట్లు అయింది. ఎక్కడైనా కట్టిన రుణం చెల్లించకుండా ఉన్నా, ఏవైనా వ్యత్యాసాలు ఉంటే ప్రశ్నించడానికి అవకాశం ఏర్పడుతుంది. డిసెంబరుకు జిల్లాలోని అన్ని సంఘాల సభ్యులకు యాప్‌పై సంపూర్ణ అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

ప్రత్యేకంగా ఈ-నారీ ఎంపిక ప్రతి పది స్వయం సహాయక సంఘాలకు ఒక ఈ-నారీ పేరుతో ఆండ్రాయిడ్ ఫోను మీద అవగాహన ఉన్న సభ్యురాలిని ఎంపిక చేస్తారు. సంబంధిత గ్రామ సంఘం, సీసీ, వీఓఏ ఆధ్వర్యంలో గ్రామ సంఘం తీర్మానం ద్వారా ఎంపిక చేస్తారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలి. కనీసం 10 వతరగతి అర్హత, శిక్షణ ఇచ్చే నైపుణ్యం ఉండాలి. సభ్యులకు 'మన డబ్బులు మన లెక్కలు' యాప్ దిగుమతి చేసే విధానంపై అవగాహన కల్పిస్తారు. జిల్లాలోని పైలెట్ మొదటి దశలో జులై నుంచి అనంతపురం మండలంలోని పెద్దమ్మ, అరుణోదయ, ప్రశాంతి, భారతమాత, శ్రీభవాని సంఘాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేశారు.

రెండో దశలో సెప్టెంబరులో రాప్తాడు, పామిడి, తాడిపత్రి, గుత్తిలోని ఐదు గ్రామ సంఘాల్లో అమలు చేయడానికి అవగాహన కల్పించారు. అక్టోబరులో 31 మండలాల్లోని 10 గ్రామ సంఘాల్లో అమలు చేయాలని లక్ష్యం నిర్దేశించారు.

నవంబరులో 31 మండలాల్లో 10 గ్రామసంఘాలు

డిసెంబరులో జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామ సంఘాల్లో అమలు చేయబోతున్నారు.

# వ్యూహాత్మకం..చాకచక్యం!



పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ హేమంత్‌కుమార్ సారథ్యంలో ఇంటెలిజెన్స్ బ్యూరో సహకారంతో పోలీసులు రచించిన వ్యూహం ఫలించింది. ధర్మవరం పట్టణానికి చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థల సానుభూతిపరుడు నూర్ అహమ్మద్ ఆగస్టు 16న అరెస్టు కాగా.. సరిగ్గా రెండు నెలలకు మరో ఇద్దరిని పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన తౌసిఫ్ షేక్ అస్లాం, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సాజిద్ హుస్సేన్‌ను అరెస్టు చేశారు.

ధర్మవరంలో ఉగ్రవాద సానుభూతిపరుడు ఉన్నట్లు ఎన్ఐఏ, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. వారం రోజులపాటు రహస్యంగా ఆధారాలు సేకరించిన తర్వాత నూర్ మహమ్మద్‌ను అరెస్టు చేశారు. ఇతడిని ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు ప్రభావితం చేసినట్లు గుర్తించి పూర్తిస్థాయిలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈనెల 10న ధర్మవరం నుంచి రెండు బృందాలు సదరు రాష్ట్రాలకు వెళ్లాయి. 12న డీఎస్పీ హేమంత్‌కుమార్ బృందం ఉత్తర్‌ప్రదేశ్‌కు, ముదిగుబ్బ సీఐ శివరాముడి బృందం మహారాష్ట్రకు చేరుకున్నాయి. పరిస్థితులకు అనుగుణంగా ఉత్తర్‌ప్రదేశ్ బృందం రెండుగా విడిపోయింది. 13వ తేదీ రాత్రి స్థానిక పోలీసుల సహకారంతో ఉగ్రసానుభూతిపరుల వేట ప్రారంభించి.. సాజిద్ హుస్సేన్‌ను పట్టుకుని, గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో 12 బుల్లెట్లు లభించగా.. రెండు వాడినట్లు గుర్తించారు. మహారాష్ట్రలో తౌసిక్ షేక్ అస్లాంను అదుపులోకి తీసుకున్నారు. నిందితులిద్దరూ ఉగ్రవాదులకు దేశంలోని ఆయా ప్రాంతాల సమాచారం ఇవ్వడం, వారితో నేరుగా వీడియోకాల్ మాట్లాడినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. అనుమానిత ప్రాంతాల్లో నిఘాఉగ్రవాద కార్యకలాపాలు సాగించేవారి వాట్సప్, ఇతర సమాచార మాధ్యమాలపై నిఘా ఉంచినట్లు ఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించారు. నెల్లూరు, కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల్లో అనుమానాలున్న చోట్ల నిఘా పెట్టామన్నారు.

# అందని పౌష్టికాహారం.. రక్తహీనత శాపం..!

పుత్తూరు మండలం గొల్లపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఓ మహిళ ప్రసవం కోసం పుత్తూరు ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు రక్తంలో 5 గ్రాముల హిమోగ్లోబిన్ మాత్రమే ఉంది. ప్రసవం చేయడం కష్టంగా భావించి తిరుపతి పంపారు. పుత్తూరులో పదో తరగతి విద్యార్థిని ప్రార్థన సమయంలో కింద పడిపోయింది. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వైద్యపరీక్షలు చేయగా బాలికకు రక్తంలో 6 గ్రాముల హిమోగ్లోబిన్ మాత్రమే ఉందని తేలింది.

పుత్తూరు, న్యూస్‌టుడే: జిల్లాలో రక్తహీనతతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకు ఎక్కువవుతోంది. పేద, మధ్య తరగతి వర్గాల్లో ఈ సమస్య మరీ అధికంగా ఉంటోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న వారు అధికంగా ఉన్నారని వైద్య,



ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరం, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం, పుత్తూరు గ్రామీణ తదితర మండలాల్లో గర్భిణులు అధికంగా రక్తహీనతతో బాధపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రక్తహీనత బాధితుల్లో ముఖ్యంగా మహిళలు, గర్భిణులు, బాలింతలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో గర్భిణులు 40 శాతం పైగా రక్తహీనతతో బాధపడుతుండగా పిల్లలు 18 శాతం, పురుషులు 15 శాతం, మహిళలు 20 శాతం ఉన్నారు. రక్తహీనత తక్కువ ఉంటే పలు వ్యాధులకు గురికావాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

జిల్లా జనాభా: 42.23 లక్షలు

మహిళలు: 22.11 లక్షలు

బాలింతలు: 39,671

గర్భిణులు: 52,440

06లోపు పిల్లలు: 4.60 లక్షలు

# అనుమతి గోరంత.. తవ్వకం దొరికినంత

పలమనేరు జిల్లాలో ప్రస్తుతం క్వారీ నిర్వాహకులు గోరంత అనుమతులతో దొరికినంతగా దోచుకునేందుకు తవ్వకాలు చేపడుతున్నారు. కొండలను పిండిచేసి మరీ బ్లాక్ గ్రానైట్, కలర్‌గ్రానైట్, రెడ్ మినరల్లను తోడేస్తున్నారు. ఇంకొందరు ఒక చోట అనుమతి తీసుకుని మరోచోట తవ్వేస్తున్నారు. వైకాపా హయాంలో వ్యాపారులు క్వారీబండలను లారీల్లో మితిమీరిన లోడ్లతో తరలించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీరి ఆగడాలకు కళ్లెం వేయడం ప్రారంభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ రెండు ప్రత్యేక బృందాలను ప్రత్యేకంగా నియమించారంటే అక్రమాలు ఏమేరకు జరుగుతున్నాయో అర్థమవుతుంది.

పలమనేరు డివిజన్ గనులు, భూగర్భ శాఖ పరిధిలో మొత్తం 252 క్వారీలు ఉన్నాయి. ఇందులో 125 క్వారీల్లో మాత్రమే పనులు జరుగుతున్నాయి. అధికారులు ఎనిమిది క్వారీలపై కేసులు నమోదు చేయగా వీటిలో కుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండలాల్లోని క్వారీలే కావడం గమనార్హం.

**సీజ్‌చేసినా ఎవరూ రాక..**

అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని గుర్తించి గనులు, భూగర్భశాఖ



వారు కేసులు నమోదు చేశారు. వారి నుంచి దాదాపు 14 బ్లాకుల గ్రానైట్ రాళ్లను సీజ్ చేశారు. ఆరు నెలలు కావస్తున్నా అవి తమవి అని చెప్పుకోవడానికి ఎవరూ రాలేదు. ప్రస్తుతం క్వారీ నడుస్తున్న ప్రాంతాల్లో కూడా వాలాకరకు అనుమతులున్న చోట కాకుండా వేరే చోట్ల పనులు చేస్తున్నారు. వీటికి క్షేత్రస్థాయిలోని రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారు. కొన్ని సర్వే నంబర్లు అటవీశాఖ పరిధిలో ఉన్నా మంచిరాయి ఉంటే తవ్వేస్తున్నారు. పర్మిట్ లేకుండా 8 చోట్ల తవ్వకాలు చేపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిపై కూడా ప్రస్తుతం కేసులు నమోదు చేశారు.

**కఠిన చర్యలు తప్పవు**

అనుమతులు లేకుండా తవ్వకాలు చేపట్టినా, పర్మిట్ లేకుండా తరలించినా చర్యలు తప్పవు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రెండు ప్రత్యేక బృందాలను కూడా నియమించారు. ఇప్పటికే దర్యాప్తు 80 శాతం పూర్తయింది. నోటీసులు ఇచ్చిన వారి నుంచి జిల్లా వ్యాప్తంగా జరిమానా రూ.2 కోట్ల వరకు వసూలు చేశాం. ఇంకా రూ.1.50 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. – సత్యనారాయణ డీడీ, మైన్స్, చిత్తూరు

చురకలు



## ముద్దుగుమ్మకు మరో లైఫ్ అండ్ డెత్ మ్యాటర్..!

సినిమా ఇండస్ట్రీలో హీరోలకు, హీరోయిన్స్‌కి ప్రతి సినిమా లైఫ్ అండ్ డెత్ మ్యాటర్ అనడంలో సందేహం లేదు. ముఖ్యంగా కెరీర్ ఆరంభంలో ప్రతి సినిమా విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలి, లేదంటే ఫ్లాప్ వచ్చి కెరీర్ మొత్తం నాశనం అయ్యే అవకాశాలు ఉంటాయి. అందుకే కెరీర్ ఆరంభంలో నటీనటుల ఎంపిక సరిగ్గా లేకుంటే మొత్తం కెరీర్ ఎఫెక్ట్ కావడం మనం చూస్తూ ఉన్నాం. కెరీర్ ఆరంభంలో రెండు మూడు వరుస హిట్స్ పడితే స్టార్‌డం దక్కించుకోవడం జరుగుతుంది. అదే కెరీర్ ఆరంభంలో ఫ్లాప్స్ పడితే కెరీర్‌లో ముందుకు సాగడమే కష్టం అవుతుంది. అందుకే బాలీవుడ్‌తో పాటు అన్ని భాషల ఇండస్ట్రీలోనూ హీరోయిన్స్ కెరీర్ పరంగా నిలదొక్కుకోవాలంటే మినిమం హిట్స్ పడాల్సిందే. కానీ జాన్వీ కపూర్ లక్కీగా పెద్ద హిట్స్ పడకున్నా తన అందంతో పాటు, తన బ్యాక్ గ్రౌండ్ కారణంగా ఇండస్ట్రీలో నెగ్గుకు వస్తున్న విషయం తెల్సిందే.



**జాన్వీ కపూర్ బాలీవుడ్ ఎంట్రీ...** శ్రీదేవి నటవారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్‌కి మంచి ఆరంభం లభించింది. అయితే కమర్షియల్‌గా బిగ్ సక్సెస్‌లను దక్కించుకోవడంలో జాన్వీ కపూర్ విఫలం అయింది. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు గుర్తింపు దక్కించుకుంటూ వచ్చింది. జాన్వీ కపూర్ అందంతో ఆకట్టుకోవడంతో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ఆ మధ్య వచ్చిన పరమ్ సుందరి సినిమాతో జాన్వీ కపూర్ ఖచ్చితంగా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుందని అంతా భావించారు. ఆమె కూడా పరమ్ సుందరి విషయంలో చాలా ఆసక్తిని పెంచుకుంది. కానీ నిరాశనే మిగిల్చిన విషయం తెల్సిందే. ఇప్పుడు ఈమె వరుణ్ ధావన్‌తో కలిసి 'సన్నీ సంస్కారికి తులసి కుమారి' సినిమాతో రాబోతున్న విషయం తెల్సిందే.

**రామ్ చరణ్ పెద్ది మూవీలో జాన్వీ కపూర్...** జాన్వీ కపూర్ బాలీవుడ్‌లో ఇప్పటికే చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరుస్తూ వచ్చాయి. పరమ్ సుందరి మాదిరిగా ఈ సినిమా సన్నీ సంస్కారికి తులసి కుమారి సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిస్తే జాన్వీ కపూర్ కి హిందీలో ఆఫర్లు తగ్గే ప్రమాదం ఉందని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకే బాలీవుడ్‌లో జాన్వీ కపూర్‌కి ఈ సినిమా లైఫ్ అండ్ డెత్ మ్యాటర్ అన్నట్లుగా మారింది. కేవలం జాన్వీ కపూర్‌కి మాత్రమే కాకుండా వరుణ్ ధావన్ విషయంలోనూ ఇదే పరిస్థితి. ఆయన గత చిత్రాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. అందుకే ఈ సినిమా విషయమై ఆయన ఫ్యాన్స్ చాలా ఆసక్తిగా ఉన్నారు. వీరిద్దరికీ ఈ సినిమా ఎంత ముఖ్యమో అనేది సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనలో ప్రతిభ ఉన్న జాన్వీ కపూర్‌కి ఈ సినిమా, రామ్ చరణ్ తో చేస్తున్న పెద్ది సినిమా హిట్‌ను అందిస్తాయా అనేది చూడాలి.

## యాక్షన్ లోకి గుంటూరు పిల్ల!

మీనాక్షి చౌదరి కి చెప్పుకోవడానికి సక్సెస్ లున్నా? చేతిలో అవకాశాలు మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుతం అనగనగా ఒక రోజు చిత్రంలో నటిస్తోంది. తెలుగులో నటిస్తోన్న ఒకే ఒక్క చిత్రమిది. ఇలాంటి సమయంలోనే పక్క పరిశ్రమలు అనుకోకుండా ఆదుకుంటాయి. అది మీనాక్షి విషయంలో కూడా ప్రూవ్ అవుతుంది. ఇటీవలే బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీ ఫోర్స్ లో ఛాన్స్ అందుకుంటున్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా అది నిజమేనని కన్ఫమ్ అయింది. ఇప్పటి వరకూ మీనాక్షి బాలీవుడ్ లో లాంచ్ అవ్వలేదు. దీంతో ఇదే బాలీవుడ్ డెబ్యూ అవుతుంది.

**అలియాభట్ నో చెప్పడంతో:** ఇందులో అమ్మడు జాన్ అబ్రహాంతో రొమాన్స్ చేయబోతుంది. అంతేకాదు మీనాక్షి పాత్ర పవర్ ఫుల్ గానూ ఉంటుంది. ఇది పూర్తి యాక్షన్ ప్యాక్డ్ చిత్రం కావడంతో మీనాక్షి పాత్ర కూడా యాక్షన్ తోనే నిండి ఉంటుంది. దీనిలో భాగంగా యాక్షన్ సన్నివేశాలకు సంబంధించి వర్క్ షాపులకు కూడా హాజరవుతుందన్నది



తాజా సమాచారం. నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ఈ నేపథ్యంలోనే మీనాక్షి పాత్రను ఫైనల్ చేసి వర్క్ షాప్ లు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ పాత్ర కోసం బాలీవుడ్ లో అలియాభట్ ని ట్రై చేసారు.

**ఇకపై బాలీవుడ్ పై ఫోకస్:** కానీ అలియా భట్ బిజీ షెడ్యూల్ కారణంగా డేట్లు ఇవ్వలేకపోయింది. దీంతో ఆ ఛాన్స్ మీనాక్షికి వరించింది. సరిగ్గా టాలీవుడ్ లో అవకాశాలు లేని సమయంలో వచ్చిన అవకాశం కావడంతో మీనాక్షి ఆనందంతో ఉబ్బితబ్బిబుతోంది. ఈ సినిమా సక్సెస్ అయితే అమ్మడు బాలీవుడ్ లో స్థిరపడే అవకాశాలున్నాయి. కెరీర్ టాలీవుడ్ లో మొదలైన ఏ నటి అయినా అంతిమంగా బాలీవుడ్ లో స్థిరపడాలనే గోల్ తోనే ఉంటారు. తాజా పరిస్థితుల నేపత్యంలో మీనాక్షి ఇకపై బాలీవుడ్ పై ఫోకస్ చేసే అవకాశం ఉంది.

**ఓ సంచలన ఫ్రాంచైజీ ఇది:** ఫోర్స్ బాలీవుడ్ హిట్ ఫ్రాంచైజీలో ఒక్కటి. ఏసీపీ యశ్వర్ధన్ సింగ్ పాత్రలో జాన్ ఫోర్స్ సినిమాతో ఎంత ఫేమస్ అయ్యాడు. అప్పటి నుంచి ఫోర్స్ అన్నది ఓ ఫ్రాంచైజీ గా మారిపోయింది. ఈ ఫ్రాంచైజీ నుంచి ఇప్పటి వరకూ రిలీజ్ అయిన రెండు చిత్రాలు మంచి విజయం సాధించాయి. ఈనేపథ్యంలో ఫోర్స్ 3పై భారీ అంచనాలు ఏర్పడు తున్నాయి. జాన్ అబ్రహం ఏసీపీ యశ్వర్ధన్ సింగ్ పాత్రను బలంగా నమ్మడంతో మరోసారి ఫోర్స్ ఫ్రాంచైజీని రీబూట్ చేస్తున్నారు. ఈసారి దర్శకత్వం బాధత్యలు భావ్ దూలియాకు అప్పగించారు.




## సౌత్ ఇండస్ట్రీ దూకుడు.. టాప్ 10లో అన్నీ మనవే!



సౌత్ సినీ ఇండస్ట్రీ ఒకప్పుడు వేరు.. ఇప్పుడు వేరు.. పాన్ ఇండియా రేంజ్ లో అనేక దక్షిణాది సినిమాలు అదరగొడుతున్నాయి. అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతున్నాయి. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తున్నాయి. తద్వారా ఎన్నో రికార్డులు క్రియేట్ చేస్తున్నాయి. ఇప్పటికే నమోదై ఉన్న రికార్డులు కూడా బద్దలుకొడుతున్నాయి. అదే సమయంలో ఓపెనింగ్స్ విషయంలో గట్టిగా పోటీపడుతున్నాయి. తొలి రోజు వరల్డ్ వైడ్ గా భారీ వసూళ్లను రాబడుతున్నాయి. అయితే రీసెంట్ గా టాప్-10 హయ్యెస్ట్ ఓపెనింగ్స్ సాధించిన ఇండియన్ మూవీస్ లిస్ట్ లోకి టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ వచ్చి చేరింది. ఫస్ట్ డే ఆ సినిమా.. రూ. 154 కోట్లు సాధించింది. తద్వారా టాప్ ఓపెనింగ్ సాధించిన సినిమాల జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. అంతేకాదు నార్త్ కు చెందిన బ్లాక్ బస్టర్ హిట్లు రణబీర్ కపూర్ యానిమల్ (రూ.116 కోట్లు), షారుఖ్ ఖాన్ జవాన్ (రూ.128 కోట్లు) చిత్రాలకు షాక్ ఇచ్చింది.

అయితే గత ఏడాది రిలీజైన పుష్ప 2 సినిమా ఇంకా టాప్ ప్లేస్ లోనే కొనసాగుతోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నటించిన ఈ సినిమా తొలి రోజే రూ. 294 కోట్లు ప్రపంచవ్యాప్తంగా రాబట్టింది. ఆ తర్వాత టాలీవుడ్ స్టార్ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ డే 1 వరల్డ్ వైడ్ గా రూ. 223 కలెక్ట్ చేసి రెండో ప్లేస్ లో నిలిచింది. మరి ఆ లిస్ట్ లో టాప్ 10 లో ఉన్న సినిమాల వివరాలు ఇలా!

**టాప్ 10 అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాలు...** పుష్ప 2- రూ. 294 కోట్లు, ఆర్ఆర్ఆర్ - రూ. 223 కోట్లు, బాహుబలి ది కంక్లూజన్ - రూ. 217 కోట్లు, కల్కి 2898 ఏడీ - రూ. 191.50 కోట్లు, సలార్ - రూ. 178.50 కోట్లు. దేవర - రూ. 172 కోట్లు, కేజీఎఫ్ 2 - రూ.165 కోట్లు, ఓజీ- రూ. 154 కోట్లు, కూలీ - రూ.153 కోట్లు, లియో - రూ. 143 కోట్లు. అయితే పై లిస్ట్ చూసుకుంటే.. సౌత్ ఇండస్ట్రీ దూకుడు ఎలా ఉందో స్పష్టంగా అర్థమవుతుంది. టాప్ 10 లిస్ట్ లో మొత్తం దక్షిణాది సినిమాలే ఉన్నాయి. ఒక్కటంటే ఒక్కటి కూడా బాలీవుడ్ మూవీ లేదు. మరో ప్రత్యేక విషయమేమంటే.. అత్యధికంగా తెలుగు సినిమాలే ఏడు ఉన్నాయి. టాప్ 5 సినిమాలు మొత్తం టాలీవుడ్ వే కావడం విశేషం.

## మన శంకరవరప్రసాద్.. ఈసారి అనిల్ కు అంత ఈజీ కాదండోయ్!




గత 10ఏళ్లుగా టాలీవుడ్ లో కామెడీ ఎంటర్టైనర్ లకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తున్నారు అనిల్ రావిపూడి. పంచ్ డైలాగులు, కామెడీ కామెడీ టైమింగ్ తో ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆకట్టుకోవడంలో అనిల్ సక్సెస్ అయ్యారు. కొన్నేళ్లుగా ఫ్యామిలీ ఎంటర్టైనర్ లు తెరకెక్కిస్తూ పండగ సీజన్ లో సినిమాలు విడుదల చేస్తున్నారు. అలా పండక్కి వస్తూ హిట్ సాధిస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి విక్టరీ వెంకటేశ్ తో సంక్రాతికి వస్తున్నాం సినిమా తీశారు. రామ్చరణ్ గేమ్ఛేంజర్, బాలకృష్ణ డాకు మహారాజ్ సినిమాలతో పోటీగా రిలీజ్ చేశారు.

అలాంటి రెండు యాక్షన్ సినిమాలను కాదని, ప్రేక్షకులు అనిల్ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ఈ సినిమా ఊహించని రేంజ్ లో వసూళ్లు సాధించి... పండగ విన్నర్ గా నిలిచింది. ఈసారి కూడా ఆయన అదే ఫార్ములాతో వస్తున్నారు. ప్రస్తుతం అనిల్.. మెగాస్టార్ చిరంజీవితో మనశంకర వరప్రసాద్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కూడా వచ్చే ఏడాది సంక్రాతి రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈసారి అనిల్ కు అంత ఈజీ కాకపోవచ్చు. ఎందుకంటే, అదే కామెడీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ జానాలో మరో రెండు సినిమాలు పొంగల్ ఫైట్ లో ఉండడమే అందుకు కారణం. అందుకే ఈసారి కాంపిటీషన్ ఫుల్ గా ఉండనుంది. ఈ లైనప్ లో నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు, ప్రభాస్ హర్రర్ కామెడీ రాజాసాబ్ సినిమాలు బరిలో ఉన్నాయి. ఇలా ఒకటి కంటే ఎక్కువ సినిమాలు కామెడీ జానాను నమ్ముకొని రావడంతో మార్కెట్ స్ప్లిట్ అవుతుంది. అంటే సినిమాలు మార్కెట్ ను పంచుకుంటాయన్న మాట. ఏ ఒక్క సినిమాకు కూడా వన్ సైడ్ ఆక్యుపెన్సీ ఉండదు. అందుకే ఈసారి పండగకు ప్రేక్షకులు కామెడీనే కాదు సినిమాలో మరిన్ని ఎలిమెంట్స్ ఉండాలని కోరుకుంటారనడంలో సందేహం లేదు. అది చిరు- అనిల్ సినిమాను ఇరకాటంలో పెట్టవచ్చు. అలా అనిల్ కు ఈ సీజన్ కాస్త భిన్నంగా మారనుంది. అయినప్పటికీ.. అనిల్ - చిరంజీవి కాంబోకు ఉండాల్సిన బజ్ అయితే ఉంది. కేవలం ఇక్కడ అనిల్ డీసెంట్ కంటెంట్ ను డెలివరీ చేయలగితే పొంగల్ ఫైట్ లో మరోసారి విజేతగా నిలిచే ఛాన్స్ ఉంటుంది.

## క్వీన్ ఆఫ్ బ్యూటీ అనసూయ భరద్వాజ్

అనసూయ భరద్వాజ్ ఎప్పటికప్పుడు తన ఫ్యాషన్ ఫోటోషూట్లతో, లైఫ్ స్టైల్ అప్‌డేట్స్‌తో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన స్విమ్మింగ్ పూల్ ఫోటోలు నెట్టింట్లో చర్చనీయాంశంగా మారాయి. బ్లాక్ స్విమ్ సూట్‌లో ఐస్లాండ్ చల్లని వాతావరణంలో ఆనసూయ సేదతీరుతున్న ఫోటోలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. సన్ గ్లాసెస్‌తో స్టైలిష్‌గా, ఫ్రెష్‌గా కనిపించిన ఆమె లుక్స్ ఫ్యాన్స్‌కి కొత్త అనుభూతిని కలిగిస్తున్నాయి. దీంతో బికినీ కంటే ఘాటుగా ఆ లుక్స్ ఉన్నాయని కొందరు పాజిటివ్ గా రెస్పాండ్ అవుతున్నారు. ఇక ఇప్పటికే నటిగా అనసూయ మంచి క్రేజ్ అందుకుంది. ఆమె బుల్లి తెరపై యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి, టాప్ టెలివిజన్ హోస్ట్‌గా పేరు సంపాదించింది. ముఖ్యంగా "జబర్దస్త్"



వంటి షోల ద్వారా బుల్లితెర ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఆ తరువాత సినిమాల్లో కూడా తన ప్రతిభను చూపించింది. రంగస్థలం, పుష్ప వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రత్యేకంగా పుష్ప సినిమాలో అనసూయ, తన నెగటివ్ షేడ్స్‌తో కూడిన నటనకు మంచి ప్రశంసలు అందుకుంది. ఇక టెలివిజన్‌లో మాత్రమే కాదు, వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, స్టేజ్ షోలు ఇలా విభిన్న రంగాల్లో తన ప్రతిభను రుజువు చేస్తూ ముందుకు సాగుతోంది. సోషల్ మీడియాలో అనసూయ ఎప్పటికప్పుడు తన వ్యక్తిగత జీవితంలోని చిన్నచిన్న క్షణాలను, ఫ్యాషన్ లుక్స్‌ని పంచుకుంటూ అభిమానులతో కనెక్ట్ అవుతోంది. ఇక లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఈ పూల్ ఫోటోలు కొన్ని నిమిషాల్లోనే వేల లైక్స్ సంపాదించాయి. క్వీన్ ఆఫ్ బ్యూటీ అంటూ ఎప్పటికప్పుడు సర్ప్రైజ్ చేసే లుక్స్ ఇస్తోందిని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## స్టార్ రేంజ్ ఉన్న వాళ్లతో అమ్మడు పోటీ..!

ఓజీ సినిమా చూసిన తర్వాత శ్రీయా రెడ్డి గురించి మాట్లాడకుండా ఉండలేరు. నిడివి తక్కువ ఉన్న రోల్ అయినా ఆమె తన మార్క్ చూపించారు. ఓజీ సినిమాలో శ్రీయా రెడ్డిని కావాలని తీసుకున్నాడు సుజిత్. ఎందుకంటే నెగిటివ్ రోల్ చేసే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారు. మేల్ విలన్ దొరుకుతారు కానీ లేడీ విలన్ అంటే కాస్త ఆలోచిస్తారు. కానీ కెరీర్ మొదట్లోనే శ్రీయా రెడ్డి ఆ స్టెప్ తీసుకున్నారు. సౌత్ లో లేడీ విలన్ అనగానే అందరికీ నరసిం హ సినిమాలో రమ్యకృష్ణ గుర్తొస్తారు. ఐతే ప్రస్తుతం శ్రీయా రెడ్డి కూడా అంత ఇంపాక్ట్ చూపించారు.

**వేళ్లతో లెక్క పెట్టే సినిమాలు..** సలార్ లో కూడా ఆమె చేసిన పాత్ర సర్ ప్రైజ్ చేస్తుంది. ఐతే శ్రీయా రెడ్డి దాదాపు రెండు దశాబ్దాలుగా సినిమాలు చేస్తున్నా కేవలం సెలెక్టెడ్ ప్రాజెక్ట్స్ మాత్రమే ఆమె అందుకుంటుంది. అందుకే ఆమె వేళ్లతో లెక్క పెట్టే సినిమాలే చేసింది.



ఐతే సలార్ 1, ఓజీ సినిమాల్లో మళ్లీ ఆయన నెగిటివ్ షేడ్స్ ఆడియన్స్ ని మెప్పించాయి. ఇలాంటి రోల్స్ కి ఆమె పర్ఫెక్ట్ ఛాయిస్ అని భావిస్తున్నారు. ఈమధ్య వరలక్ష్మి శరత్ కుమార్ కూడా లేడీ విలన్ గా చేసినా శ్రీయా రెడ్డి ఎందుకో స్పెషల్ గా అనిపిస్తారు. ఐతే ఓజీ చూశాక ఆమెకు ఇలాంటి ఆఫర్స్ ఎన్నో వచ్చే ఛాన్స్ ఉంది. కానీ ఆమె అన్నిటికీ ఓకే చెప్పదట. తను నెగిటివ్ రోల్ లేదా సినిమాలో నటించాలంటే పాత్రతో పాటు స్టార్ ఇమేజ్ ఉన్న హీరోలు మాత్రమే కావాలని అంటుంది. స్టార్ సినిమాలు మాత్రమే చేస్తానంటుంది కాబట్టే ఆమెకు సరైన అవకాశాలు లేవని చెప్పొచ్చు. నటిగా తనని తాను ప్రూవ్ చేసుకునేందుకు తన పాత్ర వరకు డిమాడ్ ఓకే కానీ అది స్టార్ సినిమానే అయ్యుండాలని చెప్పడం కెరీర్ మీద ఇంపాక్ట్ చూపిస్తుంది.

**శ్రీయా రెడ్డి కండీషన్స్..** ఓజీ తర్వాత మళ్లీ శ్రీయా రెడ్డి తిరిగి ఫాం లోకి వచ్చేలా ఉన్నా వచ్చిన సినిమాల్లో కథ ఆమె పాత్ర చూస్తే ఓకే కానీ స్టార్ ఉన్నాడా లేదా అన్నది పట్టించుకుంటే మరో ఛాన్స్ రావడం కష్టమే. మరి శ్రీయా రెడ్డి ఈ ఒక్క కండీషన్ ని పక్కన పెడితే మాత్రం ఆమె కోసం కొత్త పాత్రలు రాసి మరీ అవకాశం ఇచ్చేలా ఉన్నారని చెప్పొచ్చు. ఎలాగు సలార్ 2 లో ఆమె పాత్ర ఉంటుంది. దానికి తోడు మరికొన్ని అవకాశాలు వస్తే శ్రీయా రెడ్డి కెరీర్ ఫాం లోకి వస్తుంది. శ్రీయా రెడ్డి కోలీవుడ్ హీరో విశాల్ కి వదిన అనే విషయం తెలిసిందే. విశాల్ పొగరు సినిమాలో ఆమె విలన్ గా నటించి మెప్పించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536